సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 316

గురువారం 6-2-2020

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'



**సహకార బ్యాంకులు బలోపేతం**

బ్యాంకింగ్ చట్టాల సవరణకు కేంద్ర కేబినెట్ ఆమోదం

-బిజినెస్‌లో



**గెలుపు 'రాస్' పెట్టాడు..**

భారత్‌పై అజేయ సెంచరీతో కివీస్‌ను గెలిపించిన రాస్ టేలర్

-స్పోర్ట్స్‌లో

బుధవారం మేడారం జాతరకు పోటెత్తిన భక్తులు



# కొలువుదీరిన కన్నెపల్లి వెన్నెలమ్మ



సారలమ్మను మేడారం తీసుకువస్తున్న పూజారులు



జంపన్న గద్దె వద్ద చిన్నారితో కలిసి మొక్కు చెల్లిస్తున్న భక్తుడు

## గద్దెపైకి చేరిన సారలమ్మ

**పగిడిద్దరాజు, గోవిందరాజు సైతం**

**దారిపొడవునా భక్తుల మొక్కులు**

**మేడారం జాతర ప్రారంభం**

**నేడు చిలకలగుట్ట నుంచి సమ్మక్క రాక**

**సారలమ్మ రాక ఇలా..**

**సాయంత్రం 6:50 గంటలకు:** కన్నెపల్లి నుంచి పయనం

**రాత్రి 7:28 గంటలకు:** కన్నెపల్లి పొలిమేర దాటిన సారలమ్మ

**రాత్రి 8:01 గంటలకు:** జంపన్నవాగు దాటిన సారలమ్మ

**అర్ధరాత్రి 12:24 గంటలకు:** గద్దెల మీద సారలమ్మను ప్రతిష్టించిన పూజారులు

సాక్షి ప్రతినిధి, వరంగల్: మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర మొదలైంది. కోరుకున్న మొక్కులు తీర్చే సారలమ్మ మేడారం గద్దెపై బుధవారం రాత్రి కొలువుదీరారు. అలాగే, కొత్తగూడ మండలం పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు, ఏటూరునాగారం మండలం కొండాయి నుంచి గోవిందరాజులు సైతం సారలమ్మతోపాటే మేడారం గద్దెల పైకి చేరారు. ముగ్గురి రాకతో మేడారం వన జాతర అంబరాన్నంటింది. కన్నెపల్లిలోని సారలమ్మ గుడి వద్ద ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం బుధవారం సాయంత్రం సారలమ్మ పూజారులు, వడ్డెలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 6:50 గంటలకు గుడి నుంచి వెదురు బుట్ట (పట్టె మూకుడు)లో అమ్మవారి ప్రతి రూపమైన పసుపు, కుంకుమలు తీసుకుని మేడారానికి బయల్దేరారు. జంపన్నవాగులో కాళ్లు శుద్ధి చేసుకొని మేడారం గుడికి చేరుకున్నారు. అప్పటికే అక్కడికి చేరుకున్న పగిడిద్దరాజు, గోవిందరాజుతో కలసి వడ్డెలు ముగ్గురి రూపాలను అర్ధరాత్రి 12:24 గంటలకు మేడారం గద్దెలపై చేర్చారు. కన్నెపల్లి నుంచి 3.6 కిలోమీటర్ల దూరంలోని మేడారం గద్దెల వద్దకు సారలమ్మను చేర్చే అద్భుత సన్నివేశాన్ని చూసేందుకు లక్షలాది మంది భక్తులు వచ్చారు. దారి పొడవునా ఇరువైపులా ఎదురేగి దండాలు పెట్టారు. సారలమ్మను తీసుకొస్తున్న

మిగతా 2వ పేజీలో ▶

**మేడారం.. అన్నీ 'ప్రత్యేకం'**

**నేడు సమ్మక్క గద్దెపైకి కంకవనం**

- వివరాలు 5లో


## రామ మందిర నిర్మాణానికి ట్రస్ట్

**'శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర' పేరుతో ట్రస్ట్ ఏర్పాటు**

**లోక్‌సభలో స్వయంగా ప్రకటించిన ప్రధాని మోదీ**

**ట్రస్ట్‌లో ఒక దళిత వర్గం వ్యక్తి సహా 15 మంది సభ్యులు**

- వివరాలు 10లో



బుధవారం లక్నోలో డిఫెన్స్ ఎక్స్‌పోను ప్రారంభించి సరదాగా తుపాకీ ఎక్కుపెట్టిన మోదీ



## ఉరి.. అందరికీ ఒకేసారి

- నిర్భయపై సామూహిక హత్యాచార కేసులో మరణశిక్ష పడిన నలుగురు దోషులు తమకున్న అన్ని న్యాయపర అవకాశాలను వినియోగించుకోవడానికి ఢిల్లీ హైకోర్టు వారం రోజుల గడువు విధించింది. వారం రోజుల తరువాత అధికారులు చట్టబద్ధంగా వ్యవహరించాలని ఆదేశిస్తూ ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేశ్ కుమార్ కైత్ బుధవారం చెప్పారు.

- 10లో


సూచించిన నేటి గుడ్లు & చికెన్ హైదరాబాద్ జోన్ ధరలు

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE · Vencobb CHICKEN

| | | | | |
|---|---|---|---|---|
| గుడ్ల రిటైల్ ధర ₹ 60 డజన్ | ఫారం దగ్గర లైవ్ బర్డ్ | 72 కిలో | డ్రెస్డ్ స్కిన్‌తో | 136 కిలో |
| | రిటైల్ లైవ్ బర్డ్ | 94 కిలో | స్కిన్‌లెస్ | 155 కిలో |

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది


## ఇదం జగత్




ఈ నోటీసు వచ్చినప్పటి నుండి కూలీ నాకు ఎవరూ ఇవ్వడం లేదుసార్!

## ఒకే కాంట్రాక్టర్‌కు 4,769 పనులు!

**నామినేషన్లపై అప్పగించిన దక్షిణ డిస్కం**

- పనుల విలువ రూ. 30 కోట్లపైనే
- ఒకే పనికి వేర్వేరు రేట్లతో అడ్డగోలుగా అంచనాలు
- 100–700% అధిక రేటుతో బిల్లుల చెల్లింపు
- ఎస్‌ఎస్‌ఆర్ రేట్లను పాటించని అధికారులు
- పని పరిమాణం సైతం అడ్డగోలుగా పెంచిన వైనం
- ఫేస్‌బుక్ లైవ్‌లో బయటపెట్టిన సంస్థ ఏడీఈ కోటేశ్వర్‌రావు.. 2 లక్షల మంది వీక్షించడంతో వైరల్‌గా మారిన వీడియో
- విచారణ జరిపిస్తున్నామన్న సంస్థ వర్గాలు



సాక్షి, హైదరాబాద్: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎవరూ ప్రమాదాల బారిన పడకుండా ఏర్పాటు చేసే రక్షణ కంచెల పనుల్లో జరుగుతున్న భారీ దోపిడీ బట్టబయలైంది. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్‌ఎస్పీడీసీఎల్) అధికారులు కొన్నేళ్లుగా కాంట్రాక్టర్లకు యథేచ్ఛగా దోచిపెడుతున్న వైనం ఫేస్‌బుక్ లైవ్ వేదికగా వెలుగులోకి వచ్చింది. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కంచెల ఏర్పాటు కోసం ఒక్కో ప్రాంతంలో ఒక్కో ధరతోపాటు ఒక్కో పని పరిమాణంతో టీఎస్‌ఎస్పీడీసీఎల్ అధికారులు అంచనాలు తయారు చేసి కాంట్రాక్టర్లకు దోచిపెడుతున్నారంటూ టీఎస్‌ఎస్పీడీసీఎల్ అదనపు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏడీఈ) కోటేశ్వర్‌రావు స్వయంగా బహిర్గతం చేశారు. జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ ఏడీఈగా డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఆయన మంగళవారం ఫేస్‌బుక్ లైవ్ నిర్వహించి టీఎస్‌ఎస్పీడీసీఎల్‌లో జరుగుతున్న అవినీతి, అక్రమాలను అధికారిక పత్రాలతో సహా ప్రజల ముందుంచారు. బుధవారం రాత్రి వరకు

మిగతా 2వ పేజీలో ▶






epaper.sakshi.com

బుధవారం స్నానమాచరించేందుకు వచ్చిన జనంతో కిక్కిరిసిన మేడారం జంపన్న వాగు



## మళ్లీ భూముల లెక్క!

**కేటగిరీ, సర్వే నంబర్ల వారీగా భూ సమాచార సేకరణ**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం మరోసారి భూముల లెక్క తవ్వుతోంది. ప్రభుత్వ, ప్రైవేటు భూముల సమాచారాన్ని సేకరిస్తోంది. ఇప్పటికే పలు దఫాల్లో భూముల వివరాలను సేకరించిన ప్రభుత్వం.. ఈసారి మాత్రం ప్రతి కేటగిరీ భూముల లెక్కలను తీస్తోంది. భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా రికార్డులను నవీకరించిన రెవెన్యూ శాఖ ప్రైవేటు భూముల లెక్కను కొలిక్కి తెచ్చింది. ఆ తర్వాత అటవీ, భూదాన్, వక్ఫ్, దేవాదాయ భూములను ఆయా శాఖలు ఇచ్చిన జాబితాతో క్రోడీకరించారే తప్ప క్షేత్ర స్థాయిలో పరిశీలించలేదు. ఈ నేపథ్యంలో రెవెన్యూ గ్రామాల వారీగా ఉన్న భూ విస్తీర్ణం, ఏయే కేటగిరీ కింద ఎంత భూమి ఉంది? అందులో ఎంత వినియోగంలో ఉంది? ప్రస్తుత స్థితి? భూ లభ్యత ఎంత అనే అంశాలపై సమాచారాన్ని సేకరిస్తోంది. ఈ మేరకు తాజాగా భూ పరిపాలనా




ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) కార్యాలయం నిర్దేశించిన నమూనాకు అనుగుణంగా వివరాలను రాబడుతోంది. ప్రభుత్వ, వ్యవసాయ సీలింగ్, యూఎల్సీ, అటవీ, ఇనామ్, దేవాదాయ, వక్ఫ్, భూదాన్, ఎవక్యూ, ఎనిమీ, చర్చ్ భూములు, అసైన్డ్ భూముల సమాచారమేగాకుండా వివాదరహిత, వివాదాస్పద, భూ కేటాయింపు (సంస్థలకు), వినియోగం, భూ సేకరణ, ఇళ్ల స్థలాలు, భూ ఆక్రమణ ఇలా సర్వే నంబర్ల వారీగా సమాచారాన్ని రెవెన్యూ యంత్రాంగం సేకరిస్తోంది. ఈ సమాచారం ఆధారంగా అందుబాటులో ఉన్న భూ నిధి (ల్యాండ్ బ్యాంక్)పై స్పష్టత వస్తుందని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే క్లియర్‌గా ఉన్న భూముల వేలం లేదా ప్రాజెక్టుల స్థాపన కోసం భూ సేకరణ జరిపి విక్రయించడం ద్వారా నిధులను సమీకరించే ఆలోచన కూడా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

## ఐపీఎస్‌ల కొరత వాస్తవమే..!

- **139 మందికి 97 మందే ఉన్నారని కేంద్ర హోంశాఖ వెల్లడి**

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణలో ఐపీఎస్ అధికారుల కొరత ఉన్న మాట వాస్తవమేనని మరోసారి రుజువైంది. కేంద్ర హోంశాఖ పరిధిలోని డేటా ఆన్ పోలీస్ ఆర్గనైజేషన్స్ (డీవోపీవో) తాజాగా విడుదల చేసిన నివేదికలో ఈ విషయం మరోసారి తేటతెల్లమైంది. 2019, జనవరి 1 వరకు అందుబాటులో ఉన్న గణాంకాల ఆధారంగా ఈ నివేదిక విడుదలైంది. దీని ప్రకారం తెలంగాణకు కేంద్రం 137 ఐపీఎస్ పోస్టులు మంజూరు చేయగా.. అపుడు ప్రభుత్వం 112 మందిని కేటాయించింది. ఇందులో ఖాళీలు, డిప్యుటేషన్లు, పదవీ విరమణలు పోను ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 97 మంది ఐపీఎస్ అధికారులు మాత్రమే అందుబాటులో ఉన్నారు. ఇటీవలే ఏడీజీలు సౌమ్యా



మిశ్రా, సంతోష్‌మెహ్రా, ఐజీ అకున్ సబర్వాల్ కేంద్ర సర్వీసులకు వెళ్లిన విషయం తెలిసిందే. ఇటీవల తమ రాష్ట్రానికి 40 మంది ఐపీఎస్ అధికారులను కేటాయించాలని తెలంగాణ కోరింది. దీన్ని పెద్దగా పరిగణనలోకి తీసుకోని కేంద్రం.. కేవలం కంటితుడుపుగా 11 మంది ట్రైనీలను కేటాయించింది. ప్రస్తుతం శిక్షణలో భాగంగా వీరంతా రాష్ట్రంలోని అన్ని పోలీసు విభాగాలు, వాటి పనితీరును తెలుసుకుంటున్నారు. వీరి శిక్షణ సెప్టెంబర్‌లో పూర్తవనుంది. ఇక అక్టోబర్‌లో అది కూడా దసరా తర్వాతే వీరు విధుల్లో చేరతారని ఓ ఉన్నతాధికారి 'సాక్షి'కి వెల్లడించారు. గత ఆగస్టులో ఇద్దరు అధికారులు రిటైరయ్యారు. 2020లో మరో 9 మంది అధికారులు రిటైర్ కానున్నారు. ఈ లెక్కన జరగబోయే రిటైర్మెంట్లను దృష్టిలో పెట్టుకుని కేంద్రం వాటిని సర్దుబాటు చేసిందే.. తప్ప కొత్తగా కేటాయించేదేమీ లేదని పలువురు ఉన్నతాధికారులు పెదవి విరిచారు.

## 'పంచాయతీరాజ్' బాధ్యత ఇకపై కలెక్టర్లకు..

**ఉత్తర్వులు జారీ చేసిన పీఆర్ కమిషనర్**

**సాక్షి, హైదరాబాద్:** జిల్లా స్థాయిలో పంచాయతీరాజ్ పర్యవేక్షణ బాధ్యతను పూర్తి స్థాయిలో కలెక్టర్లకు కట్టబెడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గ్రామ పంచాయతీ కార్యదర్శులు మొదలు డివిజనల్ పంచాయతీ అధికారులపై చర్యలు తీసుకునే అధికారాలను జిల్లా కలెక్టర్లకు అప్పగించింది. ఇప్పటివరకు 2, 3, 4 గ్రేడ్ల కార్యదర్శులపై మాత్రమే చర్యలు తీసుకునే అధికారం కలెక్టర్లకు ఉండేది. ఆపై అధికారులపై చర్యలకు ప్రభుత్వానికి సిఫార్సు చేయాల్సి ఉండేది. ఇకపై క్షేత్రస్థాయిలో పనిచేసే గ్రామ పంచాయతీ కార్యదర్శులు మొదలు డివిజనల్ పంచాయతీ అధికారి (డీఎల్‌పీఓ) వరకు చర్యలు తీసుకునే విచక్షణాధికారాన్ని కలెక్టర్లకు బదలాయించింది. కొత్త పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఈ అధికారాలు వర్తిస్తాయని స్పష్టం చేసింది. ఇటీవల మేడ్చల్ జిల్లా మూడు చింతలపల్లి మండలం కొల్తూరు గ్రామ కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ ఆ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే దీనిపై అయోమయం నెలకొనడంతో స్పష్టత కోరుతూ పంచాయతీరాజ్ కమిషనర్‌కు లేఖ రాశారు. దీనికి స్పందించిన పీఆర్ కమిషనర్ ఎం.రఘునందన్‌రావు అన్ని గ్రేడ్ల కార్యదర్శులు, మండల పంచాయతీ అధికారి (ఎంపీవో), డివిజనల్ పంచాయతీ అధికారి (డీఎల్‌పీఓ వరకు క్రమశిక్షణ చర్యలేగాకుండా సస్పెన్షన్ చేసే అధికారం కలెక్టర్లకు ఉందని స్పష్టతనిచ్చారు. జిల్లా స్థాయిలో ఎంపీడీఓ, డీపీఓలు కూడా కలెక్టర్ల పర్యవేక్షణలో పనిచేస్తారని తేల్చి చెప్పారు.

**ఎంపీడీవోలకు వాహన సౌకర్యం..**

ఎంపీడీవోలకు వాహన సౌకర్యం కల్పిస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. వచ్చే 6 నెలల పాటు అద్దె ప్రాతిపదికన వాహనాన్ని సమకూర్చుకునే వెసులుబాటును కల్పించారు.

# కొలువుదీరిన కన్నెపల్లి వెన్నెలమ్మ

▶ మొదటి పేజీ తరువాయి

పూజారి దాటుకుంటూ వెళ్తే.. సంతానభాగ్యం కలుగుతుందని, కోర్కెలు నెరవేరతాయని భక్తుల నమ్మకం. సారలమ్మ ప్రధాన పూజారి కాక సారయ్య అమ్మవారి ప్రతిమను వెదురు బుట్ట (పట్టెమూకుడు)లో తీసుకొస్తుండగా ఆలయం మెట్ల నుంచి వంద మీటర్ల పొడవునా భక్తులు కింద పడుకుని వరం పట్టారు. సారల మ్మను తీసుకువస్తున్న పూజారులు వీరిపై నుంచి దాటి వెళ్లారు. సారలమ్మ గద్దెలకు రాక ను సూచిస్తూ ఆదివాసీ పూజారులు కొమ్ము బూరలు ఊదారు. ప్రత్యేక డోలు వాద్యాలు, శివసత్తుల పూనకాలు, హిజ్రాల శివాలుతో కన్నెపల్లిలోని సారలమ్మ ఆలయం భక్తితో పరవశించింది.

**తీసుకొచ్చారిలా..**

సారలమ్మ ప్రధాన పూజారి కాక సారయ్య, పూజారులు లక్ష్మీబాయమ్మ, కాక కిరణ్, కాక వెంకటేశ్వర్లు, కాక కనుకమ్మ, కాక భుజంగరావులు సారలమ్మను కన్నెపల్లి నుంచి గద్దెలపైకి తీసుకొచ్చారు. సోలం వెంకటేశ్వర్లు పట్టిన హనుమాన్ జెండా నీడలో కన్నెపల్లి వెన్నెలమ్మగా పేరున్న సారలమ్మ గద్దెలపైకి చేరారు. ప్రత్యేక పోలీసుల బృందం రోప్‌పార్టీ(తాడు వలయం)గా ఏర్పడి వీరికి భద్రత కల్పించారు. ప్రభుత్వం తరపున డీఆర్వో రమాదేవి, ఐటీడీఏ పీవో చక్రధర్‌రావు, ఇటీవలే బదిలీపై వచ్చిన పీవో హన్మంతు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అడిషనల్ ఎస్పీలు దక్షిణమూర్తి, మురళీధర్, డీఎస్పీ విష్ణుమూర్తి మూడంచెలుగా 80 మందితో రోప్ పార్టీ, భారీ బందోబస్తును పర్యవేక్షించారు.

**భక్త జన సందోహం**

సారలమ్మ, తండ్రి పగిడిద్దరాజుతో పాటు గోవిందరాజు ప్రతిమలు గద్దెలపైకి చేరుకోవడంతో మేడారం ప్రాంతంలోని కన్నెపల్లి, రెడ్డిగూడెం, ఊరట్టం, జంపన్నవాగు, కొత్తూరు, నార్లాపూర్ పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆర్టీసీ పాయింట్ మీదుగా, రెడ్డిగూడెం, ఊరట్టం, కాల్వపల్లి, నార్లాపూర్ మీదుగా లక్షలాదిగా వస్తున్న భక్తులతో అడవి దారులన్నీ పోటెత్తుతున్నాయి. భక్తుల పుణ్యస్నానాలతో జంపన్నవాగు మొత్తం జనంతో నిండిపోయింది. మొక్కులు తీర్చుకునేందుకు వచ్చిన భక్తుల తాకిడితో దారులన్నీ కిటకిటలాడాయి. సారలమ్మ గద్దెలపైకి రాగానే భక్తులు పరవశంతో దర్శనం కోసం ఒక్కసారిగా గద్దెల వద్దకు వచ్చేందుకు ప్రయత్నించారు. 6 కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసిన క్యూలైన్లు సరిపోక రోడ్డుపై సైతం వరుసల్లో బారులు తీరారు.



మేడారం జాతర ఏర్పాట్లను సమీక్షిస్తున్న సీఎస్ సోమేశ్. చిత్రంలో డీజీపీ మహేందర్‌రెడ్డి

### నేడు కొలువుదీరనున్న సమ్మక్క

మేడారం జాతరలో కీలక ఘట్టంగా భావించే సమ్మక్కను గద్దెలపైకి గురువారం చేరుస్తారు. మేడారం సమీపంలోని చిలకల గుట్టపై నుంచి సాయంత్రం 5 గంటల సమ యంలో ప్రధాన పూజారి కొక్కెర కృష్ణయ్య కుంకుమ భరిణె రూపంలో ఉన్న సమ్మక్కను వెదురు బొంగులో భద్రపర్చుకుని చిలకల గుట్టపై నుంచి తీసుకొస్తారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ములుగు జిల్లా కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ సమ్మక్కను తీసుకొచ్చే కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ములుగు ఎస్పీ సంగ్రామ్‌సింగ్ పాటిల్ ఏకే 47 తుపాకీతో గాల్లోకి కాల్పులు జరిపి సమ్మక్కకు స్వాగతం పలుకుతారు. లక్షల మంది భక్తులు సమ్మక్కకు ఎదురేగి.. కోళ్లు, మేకలు బలిస్తారు. సమ్మక్కను ప్రతిష్ఠించాక భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు.

# ఒకే కాంట్రాక్టర్‌కు 4,769 పనులు!

▶ మొదటి పేజీ తరువాయి

దాదాపు 2 లక్షల మంది ఈ వీడియోను వీక్షించడంతోపాటు వేల మంది షేర్ చేయడంతో ఇది ఫేస్‌బుక్‌లో వైరల్‌గా మారింది.

**యాజమాన్యం అండదండలతోనే...**

వికారాబాద్, మెదక్, జోగిపేట, సిద్దిపేట, సంగారెడ్డి డివిజన్ల పరిధిలో ప్రదీప్ ఎలక్ట్రికల్స్ ఏజెన్సీకి నామినేషన్ల విధానంలో 4,769 పనులు అప్పగించారని అధికారిక సాక్ష్యాలతో కోటేశ్వర్‌రావు బయటపెట్టారు. ఎస్ఈగా రిటైరైన ఓ అధికారి, మరో నలుగురు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు కలిసి ఈ అక్రమాలకు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. రూ. లక్షలోపు వ్యయం చేసే అత్యవసర పనులనే నామినేషన్ల పద్ధతిలో అప్పగించేందుకు నిబంధనలు అనుమతిస్తాయని, కానీ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు వంటి పనులు అత్యవసరంగా చేయాల్సిన పనుల పరిధిలోకి రావని, ఈ పనులకు తప్పనిసరిగా టెండర్లు నిర్వహించాల్సి ఉంటుందని ఆయన 'సాక్షి'కి తెలిపారు. అయితే సంస్థ యాజమాన్యం అండదండలతోనే ఈ అక్రమాలు జరిగాయని ఆయన స్పష్టం చేస్తున్నారు. రూ. లక్షలోపు అంచనాలు కలిగిన పనులు చేసే ఒక చిన్న కాంట్రాక్టర్ ఒకే డివిజన్ పరిధిలో పనిచేయడం సాధ్యమని, అతడికి నాలుగు డివిజన్ల పరిధిలో పనులు ఎలా అప్పగించారని ఆయన ప్రశ్నిస్తున్నారు. ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ బడ్జెట్ పేరుతో కేటాయించే అత్యవసర వినియోగం నిధుల్లో సింహభాగం అధికారులు, కాంట్రాక్టర్ల జేబుల్లోకి చేరుతున్నాయని అంటున్నారు. పనులు ఏమాత్రం చేయకున్నా, పాక్షికంగా చేసినా పూర్తిగా బిల్లులు చెల్లించినట్లు తన వద్ద ఆధారాలున్నాయని ఆయన తెలిపారు. అవినీతి, అక్రమాలతో విద్యుత్ సంస్థలు మునిగిపోతున్న నావలా తయారయ్యాయని, వాటిని కాపాడుకోవాలనే ఉద్దేశంతో తాను ఫేస్‌బుక్ లైవ్ నిర్వహించానని వెల్లడించారు. అవినీతి, అక్రమాలను నిరోధించడంలో యాజమాన్యం విఫలం కావడంతో విద్యుత్ చార్జీల పెంపు అనివార్యంగా మారి పేదలు నష్టపోవాల్సి వస్తోందన్నారు.

**హైకోర్టులో కేసు...**

టీఎస్ఎస్పీడీసీఎల్‌లో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రధాన మంత్రి, రాష్ట్రపతి, సీబీఐ, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్, కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ, ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేయడంతోపాటు రాష్ట్ర హైకోర్టులో సైతం కోటేశ్వర్‌రావు కేసులు వేశారు. ఈ కేసులు త్వరలో విచారణకు రానున్నాయని ఆయన పేర్కొన్నారు. కాగా, కోటేశ్వర్‌రావు సీఎంవోకు చేసిన ఫిర్యాదుపై అంతర్గత విచారణ జరుగుతోందని టీఎస్ఎస్పీడీసీఎల్ ప్రజా సంబంధాల విభాగం వర్గాలు 'సాక్షి'కి తెలిపాయి.

- మెదక్ జిల్లా తూప్రాన్‌లోని రెండు ట్రాన్స్‌ఫార్మర్లకు 1,458 చదరపు అడుగుల కంచె ఏర్పాటు కోసం 2018 మార్చిలో చదరపు గజానికి రూ. 56 ధరతో రూ. 81,648 బిల్లులను కాంట్రాక్టర్‌కు చెల్లించారు.
- మహబూబ్‌నగర్ జిల్లా ఐజలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లకు 574 చదరపు అడుగుల కంచె ఏర్పాటు కోసం 2017 జూలైలో చదరపు అడుగుకు రూ. 125 ధరతో కాంట్రాక్టర్‌కు రూ. 71,750 చెల్లించారు.
- సిద్దిపేటలోని కల్వకుంట్ల కాలనీలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లకు 290 చదరపు అడుగుల కంచె ఏర్పాటు కోసం 2017 నవంబర్‌లో చదరపు అడుగుకు రూ. 284 ధర చొప్పున కాంట్రాక్టర్‌కు రూ. 82,360 చెల్లించారు.
- పరిగిలోని గొండుగొనపల్లి, డి.ఎంకెపల్లిలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లకు 220 చదరపు అడుగుల కంచె కోసం 2018 ఫిబ్రవరిలో చదరపు అడుగుకు రూ. 384 ధరతో కాంట్రాక్టర్‌కు రూ. 84,840 చెల్లించారు.

**నామినేషన్ విధానంలో ఈ నాలుగు పనులన్నింటినీ ప్రదీప్ ఎలక్ట్రికల్స్ అనే కాంట్రాక్టు సంస్థ దక్కించుకోవడం గమనార్హం. 2010–20 మధ్య ఈ ఒక్క సంస్థకే టీఎస్ఎస్పీడీసీఎల్ అధికారులు రూ. 30.69 కోట్లకుపైగా విలువజేసే 4,769 పనులు అప్పగించారు.**

### 700 శాతం వరకు రేట్ల పెంపు...

కోటేశ్వర్‌రావు సాక్ష్యాలతో చూపిన ఆధారాల్లో అత్యల్ప రేటు అయిన రూ. 56తో పోలిస్తే 700 శాతం అధిక రేటు అయిన రూ. 384తో అంచనాలు అధికారులు రూపొందించారు. ఇలా 100% నుంచి 700% వరకు రేట్లను అడ్డగోలుగా పెంచారు. అంచనాల తయారీలో ప్రామాణిక ధరల పట్టిక (ఎస్ఎస్ఆర్) రేట్లను పరిగణనలోకి తీసుకోకుండా అడ్డగోలుగా వ్యవహరించారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ మహా అయితే 120 చదరపు అడుగుల కంచెతో భద్రతా వలయాన్ని ఏర్పాటు చేస్తారు. కానీ ప్రదీప్ ఎలక్ట్రికల్స్ చేపట్టిన పనులను పరిశీలిస్తే రెండు ట్రాన్స్‌ఫార్మర్లకు కలిపి ఒకచోట ఏకంగా 1,458 చదరపు అడుగుల కంచె ఏర్పాటుకు, మరోచోట 574 చదరపు అడుగుల కంచె ఏర్పాటుకు అధికారులు బిల్లులు చెల్లించినట్లు స్పష్టమవుతోంది.



# యమపురికి యాప్ దారి

- హెల్త్ వెబ్‌సైట్లు, యాప్‌లు, ఆన్‌లైన్ వీడియోలతో వైద్యం ప్రాణాంతకం
- మానవ శరీరంపై ప్రయోగం ఏమాత్రం సమంజసం కాదంటున్న నిపుణులు

☛ ప్రకాశ్ (పేరు మార్చాం) అనే వ్యక్తి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేసేవాడు. అతడికి రెండేళ్ల కింద కుక్క కరిచింది. డాక్టర్ వద్దకు వెళ్తే ఇంజెక్షన్లు వేయించుకోవాలని సూచించారు. ఇంటికొచ్చాక కుక్కకాటు ఇంజెక్షన్లపై వెబ్‌సైట్‌లో, కొన్ని యాప్‌లలో వెతికాడు. ఈ ఇంజెక్షన్ల వల్ల సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయని వాటిల్లో ఉంది. దీంతో భయపడిన ప్రకాశ్.. కుక్క కరిస్తే ఏం చేయాలన్న దానిపై ఆన్‌లైన్‌లో వీడియోలు చూశాడు. అందులో జీలకర్ర, ఇంగువ, వెల్లుల్లి వంటివి వాడితే తగ్గుతుందని చిట్కాలు తెలుసుకుని, వాటిని పాటించాడు. అలా చేయడం మంచిది కాదని కుటుంబసభ్యులు చెప్పినా వినకుండా.. వితండవాదం చేశాడు. ఇదిలా ఉంటే అతడిని కరిచిన కుక్క వారం రోజులకు చనిపోయింది. ఆ తర్వాత ప్రకాశ్‌కూ రేబిస్ వ్యాధి సోకి 2 నెలల్లోనే చనిపోయాడు.

☛ ఆమె పేరు చిత్ర.. ప్రభుత్వ ఉద్యోగిని. తరచూ తలనొప్పి వస్తుందని గూగుల్‌లో సెర్చ్ చేసింది. కొన్ని హెల్త్ యాప్‌లనూ పరిశీలించింది. తలనొప్పితో బ్రెయిన్ ట్యూమర్ రావొచ్చని, ఇతరత్రా జబ్బులు రావొచ్చని విశ్లేషణ చదివింది. ఎంతో ఆందోళన చెందిన ఆమె.. వైద్యుడి వద్దకు వెళ్లకుండానే ఎంఆర్ఐ స్కాన్ తీయించింది. అందులో ఏమీ కనిపించలేదు. అయినా సంతృప్తి చెందకుండా ఇతరత్రా వైద్య పరీక్షలు చేయించింది. వాటిల్లోనూ ఏమీ లేదు. వైద్యుడిని సంప్రదిస్తే సాధారణ తలనొప్పి మాత్రమేనని, పూర్తిస్థాయిలో నిద్రపోవాలని సూచించాడు.

☛ అతడి పేరు నరేశ్.. ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తాడు. అతడు ఉండాల్సిన బరువు కంటే 20 కేజీలు అధికంగా ఉన్నాడు. ఈ మధ్య వెబ్‌సైట్లు, యాప్‌లలో వైరల్ అయిన ఓ ప్రత్యేక డైట్‌ను అతడు ఫాలో అయ్యాడు. కొవ్వు పెరిగి, అది కిడ్నీలపైనా గుండెపైనా ప్రభావం పడిందని డాక్టర్లు నిర్ధారించారు. దీంతో ఆ డైట్‌ను నిలిపివేసి, వైద్యులు ఇచ్చిన మందులు వాడి ప్రాణాలను కాపాడుకున్నాడు.

**– సాక్షి, హైదరాబాద్**

ఇంటర్నెట్‌లో, హెల్త్ యాప్‌లలో ఆరోగ్యపరమైన చిట్కాలు పాటిస్తూ అనేకమంది ఎలా ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారో ఈ సంఘటనలే పెద్ద ఉదాహరణ. ఇంటర్నెట్‌లో హెల్త్‌కు సంబంధించి సెర్చ్ చేస్తే కుప్పలుతెప్పలుగా సైట్లు, వీడియోలు, సమాచారం వస్తుంది. అలాంటి వాటిని నమ్మడం మంచిది కాదని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. ప్రసిద్ధి చెందిన వైద్యుల వీడియోలు, యాప్‌లను తప్ప ఇతరత్రా పాటించడం మంచిది కాదంటున్నారు. కొందరు వైద్యశాస్త్రాన్ని నమ్మకుండా చిట్కాలు పాటిస్తూ అవాంతరాలు తెచ్చుకుంటున్నారని చెబుతున్నారు. ఒక అంచనా ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 3.5 లక్షల హెల్త్ యాప్‌లు, వెబ్‌సైట్లు ఉన్నాయి. కొన్ని యాప్‌లు ఎక్సర్‌సైజుకు సంబంధించినవి కాగా, కొన్ని ఆహార నియమాలకు సంబంధించినవి. కొన్నింటిలో ఏ జబ్బుకు ఏ మందులు వాడాలి.. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనేది ఉన్నాయి. కొన్ని ఆన్‌లైన్ వీడియోల్లోనైతే ఆరోగ్య చిట్కాల పేరుతో వందల సైట్లు కనిపిస్తుంటాయి. ఇంటర్నెట్ విస్తృతి అదనుగా ప్రవేశించిన ఈ మాయదారి యాప్‌లు, వెబ్‌సైట్‌లు కిడ్నీలో రాళ్లు వస్తే ఈ చిట్కాలు పాటించండి.. బరువు ఎక్కువుంటే ఈ చిట్కాలు పాటిస్తే నెల రోజుల్లో 10 కేజీలు తగ్గుతాయని చెబు తుంటాయి. కామెర్లు వస్తే పలానా ఆకురసం తాగాలి వంటివి కనిపిస్తాయి. పాత తరం వాళ్లు ఇలాంటివి పాటించడం వల్లే వారు ఆరోగ్యంగా ఉన్నారని కూడా నమ్మబలుకుతున్నాయి. ఇటువంటి వీడియోలు చూసి మోసపోవద్దని వైద్యులు సూచిస్తున్నారు.

**శరీరంపై ప్రయోగాలు చేయొద్దు..**


మానవ శరీరంపై ఇష్టారాజ్యంగా ప్రయోగాలు చేయకూడదన్న కీలకమైన విషయాన్ని వైద్యులు సూచిస్తున్నారు. మనిషి మనిషికి వారి అలవాట్లలో తేడాలుంటాయి. వారి శరీర నిర్మాణంలోనూ తేడాలుంటాయి. కొందరికి కొన్ని రకాల ఆహార పదార్థాలు తింటే సరిపడదు. వారికి అలర్జీలు వస్తాయి. కొందరికి కొన్ని రకాల మందులు కూడా సరిపడవు. ప్రతి మనిషి వారి వాతావరణ పరిస్థితులు, చిన్నప్పటి నుంచి వారి ఆహార అలవాట్లను బట్టి అనేక రకాల తేడాలు ఉంటాయి. కాబట్టి ఏదైనా జబ్బు కానీ, అనారోగ్య సమస్యగానీ వస్తే డాక్టర్‌ను సంప్రదించి మాత్రమే నిర్ణయం తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. కొందరు షుగర్ పరీక్షలు చేయించుకుంటారు. సాధారణం కంటే కాస్తంత ఎక్కువ కనిపిస్తే తనకు షుగర్ ఉందని ఫిజీషియన్‌ను కలవకుండానే నిర్ధారించుకుంటారు. కొందరు అర్హతలేని ప్రైవేటు ప్రాక్టీషనర్‌ను కలిసి మందులు కూడా వాడతారని వైద్యులు చెబుతున్నారు.

**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో వస్తే సరే..**

ప్రస్తుతం యాప్‌లు, వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ వీడియోలు సాధారణ లక్షణాలను మాత్రమే చెబుతుం టాయి. అదే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీతో ముమ్మం దు యాప్‌లు రానున్నాయి. అవి కొంతమేరకు ప్రాక్టికల్‌గా ఉండే అవకాశముందని వైద్యులు అంటున్నారు. ఏదేమైనా వైద్యుడిని సంప్రదించకుండా ఆన్‌లైన్ వైద్యం ఏమాత్రం మంచిదికాదని స్పష్టం చేస్తున్నారు.

**ఒక్కోసారి ప్రాణాంతకం**

"యాప్‌లు, వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ వీడియోలను చూసి వైద్యం చేసుకుంటే ఇక వైద్యులు ఎందుకు? నెట్ ఆధారంగా వైద్యం చేసుకోవడం, చిట్కాలు పాటించడం అశాస్త్రీయం. ప్రాణాంతకం కూడా. పైగా దుష్ప్రభావాలు వస్తుంటాయి.



– డాక్టర్ పుట్టా శ్రీనివాస్, డైరెక్టర్, మహబూబ్‌నగర్ మెడికల్ కాలేజీ

**గుడ్డిగా అనుకరించొద్దు**

యాప్‌లు, వెబ్‌సైట్లలో ఆరోగ్య సమాచారం చూసి గుడ్డిగా ఫాలోకాకూడదు. వైద్యుల ప్రమేయం లేకుండా ఆహారంలో మార్పులు చేర్పులు అనవసరంగా చేయకూడదు. దీనివల్ల మన శరీర సహజ లక్షణం మారిపోతుంది.



– డాక్టర్ కృష్ణ ప్రభాకర్, ఫిజీషియన్, సిటీన్యూరో, హైదరాబాద్

**ప్రయోగాలు వద్దు**

డాక్టర్ సలహా లేకుండా ఎవరూ శరీరంపై ఎలాంటి ప్రయోగం చేయకూడదు. ఆహార విషయమైనా, వైద్యమైనా తప్పనిసరిగా వైద్యుడిని సంప్రదించాలి. లేకుంటే ఒక్కోసారి ప్రాణాంతకం కావొచ్చు.



– డాక్టర్ రాజు, ఛాతీ వైద్య నిపుణులు, హైదరాబాద్

**ట్యూమర్ అనుకుంటే ఎలా**

కొందరు సాధారణ తలనొప్పి వచ్చినా, వెబ్‌సైట్లలో వెతికితే బ్రెయిన్ ట్యూమర్ ఉండొచ్చని కూడా ఉంటుంది. దాన్ని నమ్మి ఎంఆర్ఐ స్కాన్ తీయించుకుంటున్న వారూ ఉంటున్నారు. వెబ్‌సైట్లను నమ్మి ప్రమాదకరమైన వాటిని కూడా చిన్నవిగా చూసే పరిస్థితి కూడా ఉంటుంది."



–డాక్టర్ సాంబశివారెడ్డి, సిటీన్యూరో, హైదరాబాద్

# మళ్లీ 1:15 రేషియో అమలు

## ఈసారి కొత్త కోర్సులకు ఓకే



### ఏఐసీటీఈ అప్రూవల్ ప్రాసెస్ హ్యాండ్ బుక్ విడుదల

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ కాలేజీల్లో ఫ్యాకల్టీ స్టూడెంట్ రేషియోను అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) మళ్లీ తగ్గించింది. డీమ్డ్ యూనివర్సిటీలు, అటానమస్ కాలేజీలు, నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) గుర్తింపు ఉన్న కాలేజీలు 1:15 ఫ్యాకల్టీ స్టూడెంట్ రేషియోను అమలు చేయాలని పేర్కొంది. గతంలో ఇది 1:15 ఉండగా, దాన్ని గతేడాది 1:20కి పెంచింది. అయితే ఇప్పుడు మళ్లీ 1:15కు తగ్గించింది. అలాగే పీజీ కోర్సుల్లో (ఎంటెక్) ఇప్పటివరకు ఉన్న ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తిని 1:12 నుంచి 1:15కు పెంచింది. 2020–21 విద్యా సంవత్సరంలో దేశంలో వృత్తి, సాంకేతిక విద్యా సంస్థల నిర్వహణకు అనుమతి ఇచ్చేందుకు ఏఐసీటీఈ అప్రూవల్ ప్రాసెస్ హ్యాండ్‌బుక్‌ను జారీ చేసింది. అలాగే దానికి సంబంధించి గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. యాజమాన్యాలు ఆ నిబంధనలను పాటిస్తూ అనుమతుల కోసం ఈ నెల 6 నుంచి 29లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది. ఆలస్య రుసుముతో యాజమాన్యాలు మార్చి 5 వరకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించింది. దరఖాస్తు చేసుకున్న కాలేజీలకు ఏప్రిల్ 30లోగా అనుమతులు జారీ చేస్తామని వివరించింది. అప్రూవల్ ప్రాసెస్ హ్యాండ్ బుక్‌లో మార్పులు కావాలని కోరుకునే యాజమాన్యాల కోసం ఈనెల 10న ముంబైలో, 12న ఢిల్లీలో, 13న అనంతపూర్ జేఎన్టీయూలో సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఈసారి దరఖాస్తు ఫీజును రూ.లక్ష నుంచి రూ.15 వేలకు తగ్గించింది.

**అప్రూవల్ హ్యాండ్ బుక్‌లోని ప్రధాన అంశాలు..**

❖ కొన్నేళ్లు ఇంజనీరింగ్ కోర్సుల్లో సీట్ల భర్తీ తగ్గిపోతున్న నేపథ్యంలో కొత్త కాలేజీలకు అనుమతించవచ్చని ఏఐసీటీఈ నిపుణుల కమిటీ పేర్కొంది. అయితే నేషనల్ పర్‌స్పెక్టివ్ ప్లాన్ ప్రకారం కొత్త కోర్సులకు అనుమతి ఇస్తామని పేర్కొంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, బ్లాక్ చైన్ టెక్నాలజీ వంటి వాటికి అనుమతి ఇస్తామని వెల్లడించింది. గతంలో దరఖాస్తు చేసుకొని ఉండి, ఆ ఆయా కోర్సులను ప్రవేశ పెట్టే కాలేజీలకే, అదీ 25 ఏళ్ల లీజ్ డీడ్ ఉంటే ప్రారంభించేందుకు అనుమతిస్తామని పేర్కొంది.

❖ కంప్యూటర్ సైన్స్‌లో ఎక్కువ సీట్లు భర్తీ అవుతున్నాయని, మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్ తదితర ఇతర కోర్సుల్లో 40 శాతమే సీట్లు భర్తీ అవుతున్నాయని పేర్కొంది. అందుకు సీఎస్సీ కాకుండా మిగతా కోర్సుల్లో అదనపు ఇంటేక్ అడిగితే ఇస్తాం.

❖ ఫ్యాకల్టీ క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ కోసం చర్యలు చేపట్టాలి. ఇండస్ట్రీలకు పంపించడం, ఎన్ఐటీ, ఐఐటీ ఫ్యాకల్టీతో సంప్రదించి క్వాలిటీ పెంచాలి.

❖ కాలేజీ అడ్వైజరీ బోర్డులో పారిశ్రామిక రంగానికి చెందిన వారు ఇద్దరిని కచ్చితంగా నియమించాలి.

❖ 2020–21 విద్యా సంవత్సరం నుంచి రెండేళ్ల పాటు కొత్త ఫార్మసీ కాలేజీల ఏర్పాటుకు (డిప్లొమా, డిగ్రీ కోర్సుల కోసం) అనుమతించబోమని స్పష్టం చేసింది.

❖ డీమ్డ్ యూనివర్సిటీలు దూర విద్యా విధానంలో ఎంబీఏ, ఎంసీఏ, ట్రావెల్ అండ్ టూర్స్ కోర్సులను నిర్వహించవచ్చు. అయితే ఆయా కోర్సుల నిర్వహణకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) అనుమతి తప్పనిసరి. అలాగే ఆనరరీ డిగ్రీలను ప్రవేశ పెట్టొచ్చు. అయితే అదనపు సీట్లను ఇవ్వకుండా, ఉన్న సీట్లలోనే వాటిని ప్రవేశ పెట్టాలి.

❖ కాలేజీలకు ఏఐసీటీఈ అనుమతి ఇచ్చినా యూనివర్సిటీలు మంజూరు చేయకపోతే ఫ్యాకల్టీ సంఖ్యను పరిగణనలోకి తీసుకోరు.

**కాలేజీల్లో కచ్చితంగా అమలు చేయాల్సినవి..**

❖ క్యాంపస్‌లలో గ్రీనరీకి ప్రాధాన్యం ఇవ్వాలి. పర్యావరణ పరిరక్షణకు దోహదపడే చర్యలు చేపట్టాలి. రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ తప్పనిసరిగా అమలు చేయాలి. – విద్యార్థుల అభిప్రాయాల స్వీకరణ, ఫ్యాకల్టీ వివరాలను కాలేజీ ఆవరణలో డిస్‌ప్లే చేయాలి.

❖ స్టూడెంట్స్ సేఫ్టీ ఇన్సూరెన్స్‌ను కచ్చితంగా అమలు చేయాలి. ఉద్యోగుల కోసం గ్రూపు యాక్సిడెంట్ పాలసీ వర్తింపజేయాలి.

❖ ఆన్‌లైన్ కోర్సులకు ప్రాధాన్యం ఇవ్వాలి. 'స్వయం'పోర్టల్ ద్వారా విద్యార్థులు ఆన్‌లైన్ పాఠాలను చూసే, వినే ఏర్పాట్లు చేయాలి.

❖ ఆన్‌లైన్ ఫిర్యాదులు, పరిష్కార విభాగం ఉండాలి. గ్రీవెన్స్ రిడ్రెసల్ కమిటీని ఏర్పాటు చేయాలి. యూనివర్సిటీ తరపున అంబుడ్స్‌మెన్‌ను నియమించాలి.

❖ మహిళా అధ్యాపకులు, విద్యార్థులపై లైంగిక వేధింపులను అరికట్టేందుకు, ఫిర్యాదులను పరిష్కరించేందుకు కాలేజీల్లో ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీలను (ఐసీసీ) ఏర్పాటు చేయాలి.

❖ ఎస్సీ, ఎస్టీలపై అత్యాచార నిరోధక కమిటీలను ఏర్పాటు చేయాలి. – విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, టీచర్ ట్రైనింగ్, విద్యార్థులకు 3 వారాల ఇండక్షన్ ట్రైనింగ్ అమలు చేయాలి. ఇంటర్నల్ క్వాలిటీ అష్యూరెన్స్ సెల్‌లు ఏర్పాటు చేయాలి.

## కేసీఆర్‌వి రాచరిక పోకడలు: పొన్నాల



సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ ఒక నియంత, రాచరిక పోకడలతో వ్యవహరిస్తున్నారని టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య అన్నారు. సహకార ఎన్నికల ప్రకటన ద్వారా మరోసారి తనది నిరంకుశ పాలన అని కేసీఆర్ నిరూపించుకున్నారని పేర్కొన్నారు. బుధవారం గాంధీ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సహకార ఎన్నికలను హడావుడిగా ముందస్తు సమాచారం లేకుండా ప్రకటించారని విమర్శించారు. కనీసం ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులకు కూడా అవకాశం లేకుండా చేశారన్నారు. కేసీఆర్ పాలనలో రైతులకు ఒరిగిందేమీ లేదని, ఏం మొహం పెట్టుకుని ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు.




## బిర్యానీ అడిగితే పాచి అన్నం పెడతారా?

### పసుపు బోర్డుపై కేంద్రం ప్రకటనలు నకిలీ: జీవన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటుకు దశాబ్దాల తరబడి రైతులు ఉద్యమాలు చేస్తుండగా, కేంద్ర ప్రభుత్వం తాజాగా స్పైసెస్ బోర్డు రీజినల్ కార్యాలయం ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేయడాన్ని పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ చైర్మన్, ఆర్మూరు ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి తప్పుబట్టారు. బిర్యానీ అడిగితే పాచి అన్నం పెడుతున్నారని, పసుపు బోర్డు ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ నకిలీ ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ స్పైసెస్ బోర్డుకు సంబంధించి ఇప్పటికే ఆరు రీజినల్ ఆఫీసులుండగా, తెలుగు రాష్ట్రాల్లో వరంగల్, గుంటూరులో పనిచేస్తున్నాయన్నారు. పసుపు బోర్డు ఏర్పాటు కోసం 1986 నుంచి ఉద్యమాలు జరుగుతుండగా గతంలో తాను పాదయాత్ర చేశానని, మాజీ ఎంపీ కవిత తీవ్ర ప్రయత్నాలు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. స్పైసెస్ బోర్డు రీజినల్ ఆఫీసును 2018లోనే ఏర్పాటు చేసేందుకు కేంద్రం హామీ ఇవ్వడంతో రాష్ట్ర ప్రభుత్వం భూమిని కూడా కేటాయించిందని తెలిపారు. పసుపు బోర్డు సాధించిన తర్వాతే అర్వింద్ నిజామాబాద్‌కు రావాలని, ఎంపీగా గెలిచిన తర్వాత ఆయనకు మతి తప్పిందని విరుచుకుపడ్డారు.

## ఈసీ నాగిరెడ్డి రాజీనామా చేయాలి: నిరంజన్



సాక్షి, హైదరాబాద్: టీఆర్ఎస్ ఎంపీ కె.కేశవరావు ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారని రాజ్యసభ చైర్మన్ ప్రకటించిన నేపథ్యంలో ఇప్పటికైనా ఎన్నికల కమిషనర్ (ఈసీ) నాగిరెడ్డి బాధ్యతగా వ్యవహరించి తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఆంధ్రప్రదేశ్ సభ్యుడైన కేకేను తుక్కుగూడ మున్సిపాలిటీలో ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఓటు వేయించారని, నేరేడుచర్లలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభం అయ్యాక ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి పేరును చేర్చి గెలిచారని టీపీసీసీ ఎన్నికల సమన్వయ కమిటీ కన్వీనర్ జి.నిరంజన్ విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ అక్రమాలకు పాల్పడిందని, ఇప్పుడు సహకార ఎన్నికల్లో కూడా 20 లక్షల మంది ఓట్లను తొలగించారని బుధవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆరోపించారు.

## కొత్త రెవెన్యూ చట్టంపై కేబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు చేయాలి: మాజీ మంత్రి సమరసింహారెడ్డి



సాక్షి, హైదరాబాద్: కొత్త రెవెన్యూ చట్టంపై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసి ప్రతిపాదనలు తీసుకోవాలని కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి డి.కె.సమరసింహారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెవెన్యూ చట్టాల మార్పు ప్రజలకు మరింత మేలు చేయాలని, కొత్త చట్టాలను తెచ్చే క్రమంలో అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. బుధవారం గాంధీ భవన్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎంఆర్‌జీ వినోద్‌రెడ్డితో కలసి ఆయన మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ చట్టం గతంలో చేసినప్పుడు తానే చైర్మన్‌గా ఉన్నానని, అప్పుడు ప్రజల దగ్గరకు వెళ్లి అన్ని అంశాలను పరిశీలించామని చెప్పారు. అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ప్రతిపాదనలు తీసుకున్నామని తెలిపారు. ఇప్పుడు కూడా అలానే చేయాల్సి ఉండగా.. కేసీఆర్ అన్నీ తనకే తెలుసనే విధంగా ప్రవర్తిస్తున్న తీరు మంచిది కాదని మండిపడ్డారు.

## గొర్రెల పంపిణీతో సత్ఫలితాలు: మంత్రి తలసాని



అథర్‌సిన్హాను సన్మానిస్తున్న మంత్రి తలసాని

సాక్షి, హైదరాబాద్: పశుసంవర్ధకం కోసం రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఏ ప్రభుత్వం కేటాయించని స్థాయిలో నిధులు కేటాయిస్తోందని ఆ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సబ్సిడీపై గొర్రెల పంపిణీ పథకం రాష్ట్రంలో సత్ఫలితాలనిస్తోందని, ఈ పథకం కింద ఇప్పటివరకు 76.92 లక్షల గొర్రెలను పంపిణీ చేయగా, వాటికి 70.88 లక్షల పిల్లలు జన్మించాయని తెలిపారు. ఈ గొర్రెల విలువ సుమారు రూ.3,189 కోట్లు ఉంటుందని ఆయన వెల్లడించారు. పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన అథర్‌సిన్హా బుధవారం మాసబ్‌ట్యాంక్‌లోని శాఖ ప్రధాన కార్యాలయంలో తలసానిని కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు శాఖ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆలోచనలతో రాష్ట్రంలో పశుసంవర్ధక శాఖ అనేక చర్యలు తీసుకుంటోందని, వాటిని సక్రమంగా అమలయ్యేలా చూడాలని కోరారు.

## మేడారంలో బీజేపీ అంబులెన్స్ సేవలు

### ప్రారంభించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: మేడారం జాతర సందర్భంగా అంబులెన్స్ సేవలు అందించేందుకు బీజేపీ ముందుకు వచ్చింది. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ అంబులెన్స్ వ్యాన్లను ప్రారంభించారు. ఈ అంబులెన్స్‌లో వైద్యులు సునీల్, సుభాష్, డాక్టర్ సురేందర్, రాంరెడ్డి, జిజ్ఞేశ్, సురేశ్‌గౌడ్ తమ వైద్య సేవలు అందిస్తారని ఆయన మీడియాకు తెలిపారు. మెడికల్ కోఆర్డినేటర్‌గా గంగాధర్ వ్యవహరిస్తారని చెప్పారు. మేడారం అభివృద్ధికి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు హామీలిస్తూ వాటిని నెరవేర్చకుండా మభ్యపెడుతున్నారని, ప్రజలనే కాకుండా దేవుళ్లను, దేవతలను కేసీఆర్ ప్రభుత్వం మోసం చేస్తోందని విమర్శించారు. మేడారం జాతరను జాతీయ పండుగగా ప్రకటించాలనే దానిపై సీఎం కేసీఆర్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. మేడారానికి రూ.98 కోట్లు కేటాయించి నలుగురు కలెక్టర్లను మార్చారన్నారు. అందిన కాడికి దండుకోవడానికే కలెక్టర్లను బదిలీలు చేశారని ఆరోపించారు. తమ కమీషన్ల దందాలో అధికార పార్టీ నేతలు పండుగలను కూడా వదలడం లేదన్నారు.




బుధవారం మేడారంలో జంపన్నవాగు వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు


అమ్మలకు భక్తులు సమర్పించిన మొక్కులు

# నేడు సమ్మక్క గద్దెపైకి కంకవనం

**ఎస్ఎస్‌తాడ్వాయి:** సమ్మక్క–సారలమ్మ జాతరలో అతి ముఖ్యమైన ఘట్టాల్లో కంకవనం (వెదురు) తీసుకు రావడం కీలకమైనది. సమ్మక్క – సారలమ్మ గద్దెలపైకి చేరుకోక ముందే అక్కడికి కంకవనం చేరుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు గురువారం సమ్మక్క తల్లిని గద్దెపై ప్రతిష్ఠించడానికి ముందు కంకవనాలను అక్కడ ప్రతిష్ఠిస్తారు. కంకవనాలను తీసుకురావడంలో పూజారులు ప్రత్యేక విధానాన్ని పాటిస్తారు. కంకవనాలను తెచ్చేందుకు సమ్మక్క పూజారులు కుటుంబీకులు రోజంతా ఉపవాసం ఉంటారు. సమ్మక్క పూజారులు, ఆదివాసీ యువకులు మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో మేడారానికి దక్షిణం వైపు ఉన్న అడవిలోకి వెళ్లారు. అక్కడ గద్దెలపైకి తీసుకురావాల్సిన కంకవనాన్ని ఎంపిక చేస్తారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటల వరకు కంకవనానికి పూజలు నిర్వహించారు. ఈ పూజ వివరాలను బయటి వ్యక్తులకు ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పకపోవడమే కాకుండా ఎవరినీ దగ్గరకు రానివ్వరు. వనంలో పూజ ముగిసిన తర్వాత బుధవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయానికి అడవి నుంచి అందరూ మేడారం చేరుకుంటారు. ఇక గురువారం తలస్నానం చేసి మళ్లీ అడవిలోకి వెళ్తారు. అక్కడ అప్పటికే ఎంపిక చేసిన ఉన్న కంకను తీసుకుని మార్గమధ్యలో ఇంగ్లిష్ మీడియం పాఠశాల దగ్గర ఉన్న గుడిలో పూజలు చేస్తారు. మేడారం ఆడపడుచులు ఎదురేగి కంకలకు ప్రత్యేక స్వాగతం పలుకుతారు. తొలి సూర్యకిరణాలు గద్దెలపై పడే సమయంలో కంకలను అడవి నుంచి మేడారంలో గద్దెల వద్దకు చేరుస్తారు. ఇక్కడ పూజలు నిర్వహించి కంకను ప్రతిష్ఠిస్తారు. ఆ తర్వాత సాయంత్రానికి సమ్మక్క గద్దెపైకి చేరుకుంటుంది.

# ఆదివాసీ పద్ధతిలో సమ్మక్క పెళ్లి

## రెండేళ్లకోసారి కల్యాణ తంతు

### రాత్రి గద్దెలపైకి చేరిన పగిడిద్దరాజు, సారలమ్మ, గోవిందరాజులు

**ఎస్ఎస్ తాడ్వాయి:** వనదేవత సమ్మక్క–పగిడిద్దరాజు కల్యాణం బుధవారం ఆదివాసీ సంప్రదాయం ప్రకారం జరిగింది. రెండేళ్లకోసారి ఈ తంతును సాగిస్తున్నారు. పగిడిద్దరాజు పూజారులు పసుపు–కుంకుమ, చీర సారెను, సమ్మక్క పూజారులు ధోవతి, కండువాలను అందించారు. ఈ తతంగానికి మేడారం గ్రామం వేదికగా నిలిచింది. ఆదివాసీల విశ్వాసం ప్రకారం.. సమ్మక్క భర్త పగిడిద్దరాజు కాగా.. వారి సంతానం సారలమ్మ, జంపన్న. పగిడిద్దరాజు సోదరుడు గోవిందరాజు. ఆదివాసీల ఇలవేల్పులైన వీరు నాలుగు విభిన్న ప్రాంతాల్లో కొలువై ఉన్నారు.

**సమ్మక్క ఆలయమే వేదిక**

మాఘశుద్ధ పౌర్ణమికి ముందు లేదా తర్వాత వచ్చే బుధవారం రోజున వివాహం జరిపించడం ఆనవాయితీ. పెళ్లి తంతులో భాగంగా ప్రస్తుత మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్లలో ఉన్న పగిడిద్దరాజు ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో పడిగెను పగిడిద్దరాజుగా భావిస్తూ పెళ్లికొడుకుగా ముస్తాబు చేశారు. అక్కడి నుంచి మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరగా మేడారానికి బుధవారం రాత్రి చేరుకున్నారు. ప్రధాన పూజారులుగా పెనక వంశీయులు పెనక బుచ్చిరాములు, పెనక మురళీధర్ ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సమ్మక్క పూజారులు పగడిద్దరాజుతో వివాహ పూజలు చేశారు. అనంతరం సమ్మక్క గుడిలో ఆదివాసీ సంప్రదాయం ప్రకారం వడేరాల కుండల రూపంలో సమ్మక్క – పగిడిద్దరాజుకు కల్యాణం జరిపించారు. అనంతరం గోవిందరాజు, సారలమ్మతో కలసి పగిడిద్దరాజు గద్దెలపై కొలువుదీరారు.

## సారలమ్మ ఆలస్యం

### పోలీసుల తీరుపై పూజారుల ఆగ్రహం

**ములుగు:** వారం రోజుల నుంచి భద్రత విషయంలో పోలీసులు అతి చేస్తున్నారని సమ్మక్క–సారలమ్మ పూజారులు ఆరోపిస్తున్నారు. ఇటీవల సమ్మక్క పూజారి రమేశ్‌ను గద్దెల ప్రధాన ప్రవేశ మార్గం నుంచి అనుమతించక పోవడంతో ఆయన ఏకంగా తాళాలను పగులగొట్టి మరీ గద్దెల వద్దకు వెళ్లారు. దీంతో పాటు బుధవారం ఉదయం కన్నెపల్లి ఆడపడుచులు మేడారంలోని గద్దెను అలకడానికి వచ్చారు. ఈ సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసులు అడ్డుకున్నారు. తాము కన్నెపల్లి నుంచి సమ్మక్క – సారలమ్మ గద్దెలను అలంకరించడానికి వచ్చామని చెప్పినా వినలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. చివరికి వైర్‌లెస్ సెట్ల ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో విషయం తెలుసుకొని అనుమతినిచ్చారు. ఇక బుధవారం సాయంత్రానికి కన్నెపల్లి నుంచి సారలమ్మను తీసుకొచ్చే క్రమంలో పోలీసులు పూజారులపై అదే రకంగా వ్యవహరించారు. ముందుగా అమ్మవారిని సాయంత్రం 6 గంటలకు తీసుకువెళ్లాలని భావించినా అది సాధ్యం కాలేదు. పోలీసులు తమను గద్దెల పైకి వెళ్లకుండా ఆపిన విషయంలో పూజారులు ఈ రకంగా వ్యవహరించారని తెలిసింది. ఒక వర్గం పూజారులు ఆలయం పక్కన ఉన్న విడిది స్థానంలో, మరో వర్గం పూజారులు ఐటీడీఏ క్యాంపు కార్యాలయం వద్ద ఉండిపోయారు. దీంతో అధికారులు ఆగమేఘాల మీద దిద్దుబాటు చర్యలకు దిగింది. పోలీసులు వ్యవహరించిన తీరుపై పూజారులతో సహా భక్తులు మండిపడ్డారు.



## జంపన్నా.. మా కష్టాలు కనవా?

*జంపన్న వాగులో స్నానానికి వచ్చిన భక్తులు మళ్లీ మేడారం వచ్చేందుకు సరైన దారి లేక ఇబ్బంది పడుతున్నారు. జంపన్న వాగులో నీటి నిల్వ కోసం చెక్ డ్యాం నిర్మించారు. అయితే, దాని పైనుంచి రోడ్డు ఎక్కేందుకు సరైన మార్గం లేక భక్తులు అవస్థలు పడాల్సి వచ్చింది. మహిళలు, పురుషులు అనే తేడా లేకుండా ఇలా పైకి ఎక్కారు.*



## నిల్చునే తలనీలాల సమర్పణ

*మేడారం జాతరలో ఎటు చూసినా భక్తులే కనిపిస్తున్నారు. తలనీలాలు సమర్పించే కల్యాణకట్ట సైతం కిక్కిరిసిపోయింది. దీంతో జంపన్న వాగు వెంట ఎక్కడపడితే అక్కడే తలనీలాలు సమర్పిస్తున్నారు. కూర్చునే స్థలం కూడా లేకపోవడం తో భక్తులను నిల్చోబెట్టే నాయీ బ్రాహ్మణులు తలనీలాలు తీయడం కనిపించింది.*

*– వరంగల్ అర్బన్*

## జగమంత కుటుంబం



*మేడారానికి జిల్లాలు, రాష్ట్రాలు, దేశాలు దాటి భక్తులు వస్తుంటారు. కుటుంబ సమేతంగా అక్కడకు వెళ్లినప్పటికీ.. ఆ తర్వాత అందరూ ఒకే కుటుంబంగా కలసిపోతారు. మేడారంలో ఓ చోట కోడి కాపేందుకు ఓ భక్తుడు పొయ్యి సిద్ధం చేశాడు. ఇంకేముంది పక్కనే ఉన్న మరికొందరు కూడా తాము కోసిన కోళ్లను తీసుకొచ్చి అదే పొయ్యిపై కాపడం కనిపించింది.*

## ప్రముఖుల పూజలు

**సాక్షి, భూపాలపల్లి:** సమ్మక్క–సారలమ్మ జాతరకు ప్రముఖుల తాకిడి పెరిగింది. బుధవారం మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, వైరా ఎమ్మెల్యే రాములు వనదేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అలాగే, ములుగు ఎమ్మెల్యే సీతక్కతో పాటు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన దివంగత కాంగ్రెస్ నేత మహేంద్ర కర్మ కుమార్తెలు సుస్మిత, సుమిత్ర వరాల తల్లులను దర్శించుకున్నారు.

## ట్రిప్‌కు రూ.3వేలు

**ఏటూరునాగారం:** మేడారం జాతరకు వచ్చే భక్తులు ఈసారి విహంగ వీక్షణం చేసేందుకు వీలు కల్పించారు. హెలికాప్టర్‌లో మేడారం జాతర పరిసరాల్లో ఒక ట్రిప్ వేయాలనుకునే వారు రూ.3 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఆసక్తి ఉన్న పలువురు భక్తులు మంగళవారం హెలికాప్టర్‌లో జాతరను విహంగ వీక్షణం చేసి సంబురపడ్డారు.

## వాగులో పడి బాలుడి మృతి

**కాళేశ్వరం:** ములుగు జిల్లా మేడారంలోని జంపన్నవాగులో స్నానం చేస్తుండగా నీటిలో మునిగి వరంగల్ అర్బన్ జిల్లా కేంద్రంలోని ఆటోనగర్‌కు చెందిన వేణుగోపాల్(15) మృతి చెందాడు. బుధవారం మేడారం చేరుకున్నాక వేణుగోపాల్ జంపన్నవాగులో స్నానం చేస్తుండగా నీటిలో మునిగి ఎక్కువగా నీళ్లు మింగి అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే అతడిని మేడారంలోని ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పారు.

## రేపు సీఎం, గవర్నర్ మేడారం రాక

### ఏర్పాట్లను పరిశీలించిన సీఎస్ సోమేశ్‌కుమార్, డీజీపీ

**సాక్షి, భూపాలపల్లి:** ఈనెల 7వ తేదీన ముఖ్యమంత్రి కేసీఆర్, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, 8న కేంద్ర గిరిజనాభివృద్ధి శాఖ మంత్రి అర్జున్ ముండా ములుగు జిల్లా మేడారంలోని శ్రీ సమ్మక్క –సారలమ్మను దర్శించుకోనున్నారు. అలాగే.. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, డీజీపీ మహేందర్ రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. హైదరాబాద్ నుంచి నేరుగా హెలికాప్టర్‌లో మేడారానికి వచ్చారు. దాదాపు 40 నిమిషాల పాటు గద్దెల వద్ద భక్తుల రద్దీ, ఏర్పాట్లపై పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్, ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్, ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతర ఏర్పాట్లపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా, మేడారంలో భద్రతా చర్యల కోసం 12 వేల మంది పోలీసులు విధుల్లో ఉన్నట్లు డీజీపీ తెలిపారు. మహిళల భద్రత కోసం షీ టీంలు, అలాగే తొక్కిసలాట జరగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. మిస్సింగ్ వ్యక్తుల కోసం ప్రత్యేకంగా ఒక విభాగం ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.

## మహాజాతరకు 4వేల బస్సులు

### ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు

**జనగామ :** శ్రీ సమ్మక్క–సారలమ్మ మహాజాతరకు వచ్చే భక్తుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ 4 వేల బస్సు సర్వీసులు నడిపిస్తోందని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ) టి.వెంకటేశ్వర్లు, ఈడీ (ఆపరేషన్స్) ఇ.యాదగిరి తెలిపారు. జాతరను పురస్కరించుకుని జనగామలోని ప్రెస్టన్ మైదానంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బస్టాండ్‌ను బుధవారం వారు పరిశీలించారు. అనంతరం డీఎం భూక్యా ధరమ్‌సింగ్‌తో కలసి విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ జిల్లాల నుంచి ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నామని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా రాష్ట్ర వ్యాప్తంగా 12,500 మంది సంస్థ ఉద్యోగులు పనిచేస్తున్నారని చెప్పారు. అనంతరం మేడారం వెళ్లే భక్తులకు జూట్ బ్యాగులను ఉచితంగా అందజేశారు.

# మేడారం.. అన్నీ 'ప్రత్యేకం'

## ఒక్కో ఊరికి ఒక్కో ప్రత్యేకత.. ఒక్కొక్కరిదీ ఒక్కో చరిత్ర

*ఆదివాసీల అతి పెద్ద జాతర.. దక్షిణాది కుంభమేళ.. మేడారం జాతర ఎన్నో ప్రత్యేకతలకు నెలవు. ప్రతి అంశం వెనుక ఓ చరిత్ర ఉంది. ప్రతి ప్రక్రియకు ప్రత్యేకత ఉంది. ఒక్కో ఊరికి ఒక్కో చరిత్ర. వనదేవతలుగా ప్రసిద్ధికెక్కిన ఒక్కొక్కరిదీ ఒక్కో వీరగాథ. మేడారంలోని కీలక అంశాలపై ప్రత్యేక కథనం..*

*– గడ్డం రాజిరెడ్డి, సాక్షి ప్రతినిధి, వరంగల్*



## పూనుగొండ్లలో పగిడిద్దరాజు గుడి

మహబూబాబాద్ జిల్లా గంగారం మండలంలో పూనుగొండ్ల గ్రామం ఉంది. ఇక్కడ సమ్మక్క భర్త పగిడిద్దరాజు గుడి ఉంది. మేడారం, పూనుగొండ్ల మధ్య దూరం నలభై కిలోమీటర్లు. సమ్మక్క భర్త పగిడిద్దరాజును పూనుగొండ్ల నుంచి మేడారానికి తీసుకువస్తారు. పెనక వంశానికి చెందిన పగిడిద్దరాజును అదే వంశానికి చెందిన పెనక బుచ్చిరామయ్య అనే పూజారి పూనుగొండ్ల గ్రామం నుంచి కాలినడకన తీసుకువస్తారు.

## వెన్నెలక్క నెలవు.. కన్నెపల్లి



తాడ్వాయి మండలంలోని ఊరట్టం గ్రామపంచాయతీ పరిధిలో కన్నెపల్లి గ్రామం ఉంది. ఈ గ్రామంలోనే వెన్నెలమ్మగా పిలిచే సారలమ్మ ఆలయం ఉంది. జాతర సమయంలో ఇక్కడి నుంచి జంపన్నవాగు మీదుగా మేడారంలోని గద్దెల వరకు సారలమ్మను ఆదివాసీ పూజారులు తీసుకొస్తారు. ఈ ఊరి జనాభా 282 మంది. ఈ గ్రామ ప్రజలు ఏం చేయాలన్నా సారలమ్మ ఆశీర్వాదం తప్పనిసరి. 'మా వెన్నెలక్కకు సెప్పకుంటే ఇగ అంతే.. అమ్మో.. సారక్కకు చెప్పే సేత్తం'అంటారు ఇక్కడి ఆదివాసీలు.

## బయ్యక్కపేట, చందా వంశీయులు... ఇదో ఘట్టం

కొందరి పరిశోధనల ప్రకారం... మేడారంలో కొలువు తీరిన సమ్మక్కకు బయ్యక్కపేటలోనూ చరిత్ర ఉంది. ఈ మేడారం జాతరను మొదట బయ్యక్కపేటలోనే నిర్వహించేవారు. ఈ బయ్యక్కపేట మేడారానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉంది. చందా వంశపు కోయ గిరిజనుల ఆడబిడ్డగా సమ్మక్క బయ్యక్కపేటలోనే జన్మించినట్లు ప్రచారంలో ఉంది.

## గోవిందరాజు ఇలాకా.. కొండాయి



ఏటూరునాగారం మండలంలో కొండాయి గ్రామం ఉంది. సారలమ్మ భర్త గోవిందరాజు ఆలయం ఇక్కడే ఉంది. మేడారం, కొండాయి గ్రామాల మధ్య దూరం పన్నెండు కిలోమీటర్లు. జాతర సందర్భంగా వడ్డెలు, తలపతి, వర్తోళ్లు కలసి డోలు చప్పుళ్లతో కాలినడకన మేడారం చేరుకుంటారు.



## ఆ బాలిక పేరే సమ్మక్క

కరీంనగర్ జిల్లా జగిత్యాల ప్రాంతంలోని 'పొలవాస'ను 12 శతాబ్దంలో గిరిజన దొర మేడరాజు పాలించాడు. వేట కోసం ఒకసారి అభయారణ్యంలోకి వెళ్లాడు. అక్కడ పులుల సంరక్షణలో, దివ్యకాంతులతో ఉన్న బాలికను చూసి గ్రామానికి తీసుకొచ్చారు. సమ్మక్క అని పేరు పెట్టారు. యుక్త వయసు వచ్చిన సమ్మక్క.. మేడారాన్ని పరిపాలించే పగిడిద్దరాజును వివాహమాడింది. పగిడిద్దరాజు మేడరాజుకు మేనల్లుడు. పగిడిద్దరాజు – సమ్మక్కకు సారలమ్మ, నాగులమ్మ కుమార్తెలు, జంపన్న కుమారుడు. సారలమ్మకు గోవిందరాజుతో పెళ్లి జరిగింది.

## మారేడు చెట్ల మేడారం

80 కుటుంబాలు ఉన్న చిన్న పల్లె ఇది. సమ్మక్క–సారలమ్మ జాతర ప్రధాన కేంద్రమైన గద్దెలు ఈ గ్రామంలోనే ఉన్నాయి. ఈ గ్రామంలో సమ్మక్కకు ఆలయం ఉంది. జాతరలో కీలక ప్రాంతాలైన చిలకలగుట్ట, జంపన్నవాగు సైతం ఈ గ్రామ సమీపంలోనే ఉన్నాయి. వరంగల్ అర్బన్ జిల్లా కేంద్రం నుంచి 110 కిలోమీటర్ల దూరంలో మేడారం ఉంటుంది. అటవీ ప్రాంతంలోని తాడ్వాయి మండలం ఊరట్టం పంచాయతీ పరిధిలో ఈ ఊరు ఉంటుంది. మారేడు చెట్లు ఎక్కువగా ఉన్నందున ఈ ఊరికి మేడారం అని పేరు వచ్చినట్లు చెబుతుంటారు. ఇక్కడ కోయ వర్గానికి చెందిన గిరిజన కుటుంబాలే ఎక్కువ. వీరి ప్రధాన వృత్తి వ్యవసాయం, ఉత్పత్తుల సేకరణ.

## విలుకాడు... గోవిందరాజు

సారలమ్మ భర్త గోవిందరాజు. దబ్బగట్ల వంశానికి చెందిన గోవిందరాజు.. మేడారానికి వచ్చిన సమయంలోనే కాకతీయులతో యుద్ధం జరిగింది. విలువిద్యలో ఆరితేరిన గోవిందరాజు యుద్ధంలోనే వీరమరణం పొందారు.

## సారలమ్మ..

సమ్మక్క కూతురు సారలమ్మ. తల్లికి తగ్గ తనయ. కాకతీయులతో జరిగిన యుద్ధంలో మేడారం నుంచి కన్నెపల్లి వైపు వెళ్లిన సారలమ్మ ఆ ప్రాంతంలోనే వీరమరణం పొందారు. దీంతో అక్కడి వారు తమ ఇలవేల్పుగా కొలుస్తున్నారు. సమ్మక్క ఆగమనానికి ముందురోజు కన్నెపల్లి గ్రామంలోని సారలమ్మ గుడిలో ప్రధాన పూజారి ప్రత్యేక పూజలు చేస్తారు.

## సంపెంగవాగే 'జంపన్న'వాగు

సమ్మక్క కుమారుడు జంపన్న. కాకతీయులతో జరిగిన యుద్ధంలో శత్రువు చేతికి చిక్కి చావడం ఇష్టంలేని జంపన్న అక్కడికి సమీపంలోని సంపెంగవాగులో దూకి చనిపోయాడు. అప్పటి నుంచి ఈ వాగును జంపన్న వాగుగా పిలుస్తారు. మేడారం జాతరకు వచ్చే భక్తులు ఈ వాగులో స్నానాలు చేసిన తర్వాతే వన దేవతలకు మొక్కులు సమర్పిస్తారు.



సాక్షి
గురువారం, ఫిబ్రవరి, 6

# సర్వత్రా 'ఢిల్లీ' ఉత్కంఠ

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు హోరాహోరీగా జరిగిన ప్రచారం గురువారం సాయంత్రంతో సమాప్త మవుతుంది. ప్రచారం మొదలైన కొన్ని రోజుల వరకూ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ప్రభుత్వం సాధించిన విజయాలపైనా, దాని వైఫల్యాలపైనా సాగుతున్నట్టు కనబడిన చర్చంతా పది పన్నెండు రోజులుగా కొత్త మలుపు తిరిగింది. ఢిల్లీకి అవసరమైన మౌలిక సదుపాయాలు, వాటిని తీర్చడానికి ఎదురవుతున్న అవరోధాలు, జవాబుదారీ తనం వగైరా అంశాలు ప్రస్తావనకొస్తుండగా దాన్ని తనకనుకూలమైన దోవకు మళ్లించడంలో బీజేపీ సఫలమైంది. పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)కు వ్యతిరేకంగా షాహీన్‌బాగ్‌లో మహిళలు సాగిస్తున్న ఆందోళనపై కేంద్రీకరించి, జాతీయ భద్రతను ప్రధాన అంశంగా మార్చి మీరెటు వైపో తేల్చు కోవాలంటూ పౌరులకు బీజేపీ పిలుపునిచ్చింది. ప్రజలు స్థానిక అంశాలనూ, ఆప్ ప్రభుత్వ సాఫల్య వైఫల్యాలను పరిగణనలోకి తీసుకుని ఓట్లేస్తారా లేక బీజేపీ కోరుకున్నట్టు జాతీయ భద్రతే ప్రధాన మనుకుంటారా అన్నది చూడాల్సివుంది. 8వ తేదీ సాయంత్రం పోలింగ్ ముగిశాక వెలువడే ఎగ్జిట్ పోల్స్ ఈసారి గాలి ఎటు వీచిందో చెప్పగలిగే అవకాశం వుంది. ఎగ్జిట్ పోల్స్ ఏం చెప్పినా 11న అసలు ఫలితాలు వెలువడే వరకూ ఉత్కంఠ తీరదు.

ఢిల్లీ పౌరులు ఏం ఆలోచిస్తున్నారో, చివరకు ఎటువైపు మొగ్గుతారో నిర్ణయించడం అంత సులభమేమీ కాదు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి అక్కడున్న ఏడు స్థానాలనూ కట్టబెట్టిన ప్రజలు, మరికొన్ని నెలల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్‌కు భారీ ఆధిక్యతతో అధికారం అప్పగించి అందరి అంచనాలనూ తలకిందులు చేశారు. మొత్తం 70 స్థానాల్లో ఆప్‌కు 67 రాగా, మిగిలిన మూడు బీజేపీకి దక్కాయి. అప్పుడు ఆప్ నెగ్గుతుందని కానీ, నెగ్గినా ఈ స్థాయిలో సీట్లొస్తాయని గానీ ఏ సర్వే చెప్పలేకపోయింది. ఇంచుమించు ప్రతి సర్వే కూడా బీజేపీకి 40కి మించి స్థానాలొస్తాయని, ఆప్‌కి అంతక్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెచ్చుకున్న 28 స్థానాలకు మించిరావని, ఇంకా తగ్గినా ఆశ్చర్యం లేదని చెప్పాయి. ఈ లెక్కలన్నీ 2014 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకొచ్చిన 46.40 శాతం ఓట్ల ఆధారంగా వేసినవే. ఎనిమిది నెలలక్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కూడా బీజేపీ 2014నే పునరావృతం చేసింది. ఆ పార్టీకి అంతక్రితం కంటే మెరుగ్గా 56.58 శాతం ఓట్లు లభించాయి. 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఆప్ ఏడు చోట్లా ఓడిపోయినా 32.90శాతం ఓట్లు గెల్చుకుంది. కానీ మొన్న లోక్‌సభ ఎన్నికల్లో దానికి కేవలం 18 శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి. ఒక్కచోట అది రెండో స్థానంలోకి రాగలిగింది. మిగిలిన ఆరుచోట్లా రెండో స్థానం కాంగ్రెస్‌దే. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఆ ఫలితాలను బేరీజు వేస్తే బీజేపీ 65 స్థానాల్లో ఆధిక్యత చూపగా, కాంగ్రెస్ అయిదు చోట్ల ఆధిక్యత తెచ్చుకుంది. ఆప్ సున్నా చుట్టింది. కానీ 2015 అసెంబ్లీ ఎన్నికల అనుభవం తర్వాత బీజేపీ భరోసాగా లేదు. 'మీ ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో చెప్పండ'న్న కేజ్రీవాల్ సవాలుకు బీజేపీ జవాబీయలేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ముఖ్యమంత్రి అభ్యర్థి విషయమై ఇలాగే చర్చ సాగింది. మాజీ ఐపీఎస్ అధికారి కిరణ్ బేడీని అప్పట్లో పార్టీలో చేర్చుకుని, ఆమెను తమ ముఖ్యమంత్రి అభ్యర్థిగా బీజేపీ ప్రకటించింది. కానీ ఆ నిర్ణయం వికటించింది. అందువల్లే ఈసారి అలా ఎవరినీ ప్రకటించే సాహసం చేయలేదు.

బీజేపీ ప్రచార బాధ్యతలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా తన భుజస్కంధాలపై వేసుకున్నారు. పలు సభల్లో ప్రసంగించడంతోపాటు, కొన్నిచోట్ల ఇంటింటి ప్రచారం చేశారు. ఆయన, ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్న సభలన్నిటిలోనూ జాతీయ భద్రత, 370 అధికరణ రద్దు తదితర అంశాలే విస్తృతంగా ప్రచారమయ్యాయి. బీజేపీ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు ఢిల్లీలో మోహరించారు. దేశద్రోహుల్ని కాల్చిచంపాలంటూ కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ సభల్లో నినాదాలు చేయించడం, మరో ఎంపీ షాహీన్‌బాగ్ ఆందోళనకారులు ఇళ్లల్లోకి చొరబడి అరాచకాలు సృష్టిస్తారంటూ ప్రకటించడం వివాదాస్పదమయ్యాయి. వేదికలపై ఇలా జాతీయ భద్రతను హోరెత్తించినా మేనిఫెస్టోను మాత్రం బీజేపీ స్థానిక అంశాలతో నింపింది. ఇంటింటికీ రక్షిత మంచినీరు, వలస కార్మికులు నివసించే కాలనీల అభివృద్ధి, ఆడపిల్ల పుడితే రూ. 2 లక్షల సాయం, నిరుపేద విద్యార్థులకు ఉచితంగా ఎలక్ట్రిక్ స్కూటర్లు వంటి వాగ్దానాలు చేసింది. బీజేపీ, ఆప్ కూడా పరస్పరం ప్రభావితమవుతున్నాయని రెండు పార్టీల మేనిఫెస్టోలు గమనిస్తే అర్థమవుతుంది. గత అయిదేళ్లలో కేజ్రీవాల్ అమలు చేసిన అంశాలు గమనంలోకి తీసుకుని బీజేపీ మేనిఫెస్టో రూపొందిస్తే... బీజేపీ లేవనెత్తుతున్న అంశాల విషయంలో ఆప్ అత్యంత జాగరూకతతో అడుగులేసింది. షాహీన్‌బాగ్‌పై మీ వైఖరేమిటన్న ప్రశ్నకు నేరుగా జవాబివ్వడానికి ఆప్ సిద్ధపడలేదు. పైగా మళ్లీ అధికారంలో కొచ్చాక పాఠశాలల్లో దేశభక్తిపై పాఠాలు పెడతామని వాగ్దానం చేసింది. పారిశుద్ధ్య కార్మికులు విధి నిర్వహణలో మరణిస్తే రూ. కోటి ఇస్తామని చెప్పడం అందరి ప్రశంసలూ పొందింది. 20,000 లీటర్ల వరకూ ఉచితంగా నీరు, 200 యూనిట్ల వరకూ ఉచిత కరెంట్, ప్రభుత్వ పాఠశాలల సమూల మార్పు, మొహల్లా క్లినిక్‌లు, మహిళలకు ఉచితంగా బస్ ప్రయాణం, కాలనీల్లో సీసీ టీవీ కెమెరాల ఏర్పాటు వంటివి కేజ్రీవాల్ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసింది. కేంద్రం సృష్టించిన అవరోధాలు అధిగమించి సుప్రీంకోర్టు తీర్పుతో ఏడాదిన్నరగా అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని కేజ్రీవాల్ చెప్పడాన్ని జనం సానుకూలంగా తీసుకున్నారు. కాంగ్రెస్ రంగంలోవున్నా దాన్నెవరూ పట్టించుకునే స్థితి లేదు. మొత్తానికి బీజేపీ ప్రచార హోరుతో ఈసారి ఢిల్లీ ఎన్నికల్లో వెలువడే తీర్పుపై దేశమంతా ఉత్కంఠ ఏర్పడింది. ఈ ఎన్నికల్లో విజయం మాటెలావున్నా, 2015 ఎన్నికల్లో కేజ్రీవాల్ సాధించిన మెజారిటీని మాత్రం పునరావృతం చేయనీయరాదన్న కృత నిశ్చయం బీజేపీలో కనబడింది. ఓటరు నాడి తెలిసేది మరికొన్ని రోజుల్లోనే.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, తిథి శు.ద్వాదశి సా.5.31 వరకు, తదుపరి త్రయోదశి నక్షత్రం ఆరుద్ర రా.11.09 వరకు, తదుపరి పునర్వసు, వర్జ్యం ఉ.7.28 నుంచి 9.04 వరకు, దుర్ముహూర్తం ఉ.10.20 నుంచి 11.05 వరకు, తదుపరి ప.2.53 నుంచి 3.37 వరకు అమృతఘడియలు... ప.1.04 నుంచి 2.44 వరకు.

**సూర్యోదయం :** 6.35
**సూర్యాస్తమయం:** 5.54
**రాహుకాలం :** ప.1.30 నుంచి 3.00 వరకు
**యమగండం :** ఉ.6.00 నుంచి 7.30 వరకు

# బడుగులకు ఈ బడ్జెట్‌తో ఒరిగిందేమిటి?



మల్లెపల్లి లక్ష్మయ్య

**బ్రిటిష్‌వారి తోడ్పాటుతో దళితులకు, బలహీనవర్గాలకు అంబేడ్కర్ పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్, విదేశీ విద్య స్కాలర్‌షిప్‌లు రూపొందించారు. కానీ 70 ఏళ్ల తర్వాత కూడా నేటి పాలకుల విధానాలు ఎస్సీ, ఎస్టీ, బీసీలలో ఉన్న వెనుకబాటుతనాన్ని ఎంత మాత్రం తొలగించే స్థితిలో లేవు. ఎస్టీ విద్యార్థుల విదేశీ చదువులకు గత నాలుగేళ్ళుగా రెండు కోట్లను మాత్రమే కేటాయిస్తున్నారు. 2 కోట్ల రూపాయల మొత్తంతో ఎంత మంది విద్యార్థులు విదేశాల్లో చదువుకుంటారో ఆ బడ్జెట్ రూపొందించిన వారే జవాబు చెప్పాలి. ఇది ముమ్మాటికీ దళిత, బలహీన వర్గాల పట్ల పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం. దళితులకు, ఆదివాసీలకు, బలహీన వర్గాలకు రాజ్యాంగం కల్పించిన అవకాశాలను కాలరాయడమే తప్ప మరొకటి కాదు. కానీ ఇవే ప్రభుత్వాలు ధనిక రైతులకు, పారిశ్రామిక వేత్తలకు, వేలకోట్ల అధిపతులకు ఉపకరించే ఎన్నో సబ్సిడీలను అందిస్తూండటం గమనార్హం.**

''సామాజిక అన్యాయం, ఇతర దోపిడీ విధానాల నుంచి బలహీన వర్గాలను ప్రత్యేకించి షెడ్యూల్డ్ కులాలను, తెగలను రక్షించడానికీ, విద్య, ఆర్థిక రంగాల్లో వారిని అభివృద్ధి చేయడానికి ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉంది, అందుకుగాను ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించాలి'' అంటూ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్–46 నిర్దేశిస్తున్నది. భారత రాజ్యాంగంలోని నాలుగో భాగమైన ఆదేశిక సూత్రాలలో ఈ విషయాన్ని పొందుపరిచారు. అంటే ప్రభుత్వం నిర్వహిస్తున్న అన్ని కార్యక్రమాలలో ఈ వర్గాల వారిని తప్పనిసరిగా దృష్టిలో ఉంచుకోవాల్సి ఉంటుంది. దీనర్థం సమాజ ప్రగతికీ, సమాజ పురోగమనానికీ వేసే ప్రతి అడుగులో అట్టడుగున పడినలిగే వర్గం ఒకటుంటుందని గమనంతో వ్యవహరించడం ప్రభుత్వాల బాధ్యత అని నొక్కి చెప్పడమే. అదే విధంగా ఆర్టికల్–38 కూడా మరొక రకమైన ఆదేశాలను ఇచ్చింది. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని, వారి జీవితాల్లో సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ప్రగతిని సాధించడానికి అన్ని రకాల ప్రభుత్వ సంస్థలు కృషిచేయాలని, ప్రజల మధ్య, ప్రాంతాల మధ్య ఉన్న అసమానతలను తొలగించాలని కూడా ఆర్టికల్ – 38 ఆదేశిస్తున్నది. అంటే ప్రాంతాల మధ్య అభివృద్ధి కార్యక్రమాల్లో నిధుల కేటాయింపుల్లో వ్యత్యాసం చూపకూడదని దాని అర్థం. ఈ అంశాల్లో ఎటువంటి వివక్షా తగదని చెప్పడమే.

అయితే ఇటీవలి కాలంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ప్రజల మధ్య వ్యత్యాసాలను పెంచుతున్నాయ్ కానీ తగ్గించడం లేదు. ముఖ్యంగా బడ్జెట్ కేటాయింపుల్లో దీని ప్రభావం స్పష్టంగా కనపడుతున్నది. ప్రభుత్వాలకు నాయకత్వం వహించే నాయకులు మాట్లాడే మాటలకన్నా, వారు బడ్జెట్ కేటాయింపుల్లో చూపెడుతున్న విషయాలు అసలు అక్షరసత్యాలు. ఎన్ని రకాల మాటలు మాట్లాడినా చివరకు వారి చిత్తశుద్ధి తేలేది బడ్జెట్ వడ్డనలోనే అనేది సత్యం.

ముందుగా ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికీ, వారి అభివృద్ధికీ కేటాయించిన నిధులను పరిశీలిస్తే, ప్రభుత్వాలకు ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం అవుతుంది. ఈ రెండు వర్గాలకు కూడా విద్యాభివృద్ధిపైనే నిధుల కేటాయింపులు జరుగుతున్నాయి. అయితే వాటిపైన పెడుతున్న ఖర్చును చూస్తే మనకు అసలు విషయం తెలుస్తుంది. ఇందులో పెద్ద కేటాయింపులు పోస్ట్–మెట్రిక్ స్కాలర్‌షిప్‌లే. పదవ తరగతిపైన విద్యనభ్యసిస్తున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులందరూ ఈ స్కాలర్‌షిప్‌ల వల్లనే చదువగలుగుతున్నారు. ఎస్సీ విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కేటాయింపులు చూస్తే, 2017–18లో రూ. 3,414 కోట్లు ఖర్చు చేస్తే, 2019–20లో రూ. 2,926.82 కోట్లు కేటాయించారు. అది 2020–21 సంవత్సరానికి వచ్చేసరికి రూ. 2,987 కోట్లు కేటాయించారు. సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఎస్సీల సంక్షేమం కోసం ప్రత్యేకించి కేటాయించింది ఈ ఆర్థిక సంవత్సరం రూ. 7,154 కోట్లు. ఇందులో రూ. 2,987 కోట్లు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లే. అయితే ఈ కేటాయింపులు ఇప్పుడు ఎస్సీ కుటుంబాల్లోని విద్యార్థుల విద్యావకాశాలను ఏవిధంగానూ తీర్చలేవు. అందువల్ల రాష్ట్రప్రభుత్వాల మీద భారం పడుతున్నది. దీనితోపాటు, కాంగ్రెస్ నాయకత్వంలోని యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయెన్స్ ప్రభుత్వం, రాజీవ్‌గాంధీ ఫెలోషిప్‌లు ప్రవేశపెట్టడం వల్ల ఎంతో మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు పరిశోధక విద్యనభ్యసించారు. కానీ గత కొన్నేళ్లుగా కేటాయింపులు బాగా తగ్గిపోయాయి. 2019–20లో రూ.360 కోట్లు ఉంటే, ప్రస్తుత సంవత్సరం రూ. 300 కోట్లకు తగ్గించారు. దీనివల్ల రీసెర్చ్ వైపు వెళ్లడానికి ఇష్టపడే విద్యార్థులకు నిరాశే మిగులుతోంది. విదేశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులకు కూడా ఎటువంటి ప్రోత్సాహం లేదు. గత సంవత్సరం రూ. 20 కోట్లు ఉంటే, ఈ సంవత్సరం అదే అంకెను యథావిధిగా కొనసాగించారు. 2018–19లో దీనికోసం రూ. 15 కోట్లు కేటాయించి రూ. 5.97 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ఎస్సీలలోని బాల బాలికల హాస్టల్స్ నిర్మాణం, నిర్వహణకు అందించే మొత్తాలు కూడా ఆశ్చర్యకరంగా తగ్గిపోతున్నాయి. 2017–18 సంవత్సరంలో రూ. 74.91 కోట్లు ఖర్చు చేస్తే, 2018–19లో రూ. 160.5 కోట్లు కేటాయించి దానిని రూ. 36.56 కోట్లకు కుదించి ఖర్చు చేయడం ఎంతటి తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమో అర్థం అవుతుంది.

### కొత్త కోణం



ఈ సంవత్సరం బడ్జెట్ ప్రసంగంలో ఒక ముఖ్యమైన వ్యాఖ్యను మనం చూశాం. కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్యక్రమాలలో పారిశుద్ధ్య కార్మికులను ఇక వినియోగించేది లేదని ప్రకటించారు. కానీ అందుకోసం ఆమె ఒక నిర్దిష్టమైన ప్రతిపాదనలు చేయలేదు. పదిహేనేళ్ళ క్రితం పారిశుద్ధ్య కార్మికుల వ్యవస్థను నిషేధిస్తూ చట్టం తీసుకొచ్చారు. కానీ దాని అమలు ఇప్పటి వరకు ఒక కొలిక్కి రాలేదు. ఇప్పటికీ ఇంకా ఒక లక్ష మంది వరకు మాన్యువల్ స్కావెంజర్స్ ఉన్నట్టు లెక్కలు చెబుతున్నాయి. ఒక వేళ ఆర్థికమంత్రి ప్రకటన నిజం కావాలనుకుంటే అందుకు వారి పునరావాసానికి తగు చర్యలు తీసుకోవాలి. తగిన కార్యక్రమాలు రూపొందించాలి. అందుకు గాను బడ్జెట్ కావాల్సి ఉంటుంది. అయితే ఇందు కోసం గత కొంతకాలంగా చేస్తోన్న కేటాయింపులు కొంత గందరగోళాన్ని సృష్టిస్తున్నాయి. లక్ష మందికి పునరావాసం కల్పించడానికి దాదాపు రూ. 220 కోట్లు కావాలి. కానీ ఈ సంవత్సరం కేటాయించింది రూ. 110 కోట్లు మాత్రమే.

ఎస్టీ విద్యార్థులు కళాశాల విశ్వవిద్యాలయాల్లో విద్యనభ్యసించడానికి ఇస్తున్న స్కాలర్‌షిప్ కింద 2019–20లో రూ. 19.5 కోట్లు కేటాయిస్తే, ఈ సంవత్సరం రూ.8 కోట్లకు కుదించారు. పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు ఎస్టీలకు గత సంవత్సరం రూ. 440 కోట్లు కేటాయిస్తే, ప్రస్తుత సంవత్సరం దానిని రూ. 400 కోట్లకు కుదించారు. ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌లు కూడా 1,826 కోట్ల నుంచి రూ. 1,900 కోట్లకు కేటాయించి చేతులు దులుపుకున్నారు. మొత్తం ఆదివాసీల విద్య కోసం గత సంవత్సరం రూ. 2,266 కోట్లు ఉంటే ఈ సంవత్సరం నామమాత్రంగా రూ. 2,300 కోట్లకు కోత కోశారు. ఎస్టీ విద్యార్థుల విదేశాల చదువులకు గత నాలుగేళ్ళుగా రూ.2 కోట్లను మాత్రమే కేటాయిస్తున్నారు. 2 కోట్ల రూపాయల మొత్తంతో ఎంత మంది విద్యార్థులు విదేశాల్లో చదువుకుంటారో ఆ బడ్జెట్ రూపొందించిన వారే జవాబు చెప్పాలి. ఒక్కొక్క కోర్సుకి కనీసం 20 నుంచి 25 లక్షల ఫీజు ఉంటుందని అంచనా. ఇలా ఎందుకు కేటాయిస్తున్నారో అర్థం కావడం లేదు.

ఆదివాసీల ఆర్థికాభివృద్ధికి కేంద్రం అందించే నిధుల దగ్గర ఖాళీస్థలం కనిపించడం చూస్తే ఈ ప్రభుత్వ వనవాసి కళ్యాణం ఎంత అద్భుతంగా ఉందో అర్థం అవుతుంది. హిందువుల సెంటిమెంట్‌తో రాజకీయంగా బలపడాలని చూస్తున్న ప్రభుత్వం, వారిపట్ల చూపుతున్న శ్రద్ధ చాలా నిరాశను కలుగజేస్తున్నది. జాతీయ స్కాలర్‌షిప్‌ల కేటాయింపులు అంటే రీసెర్చ్ స్కాలర్స్ కోసం గత సంవత్సరం రూ. 70 కోట్లు కేటాయిస్తే, ఈ సంవత్సరం రూ. 52 కోట్ల 50 లక్షలుగా నిర్ణయించారు. ఇందులో ఇటీవల చేర్చిన ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వాటా కూడా ఉంది. బీసీల విదేశీ చదువులకోసం గత సంవత్సరం రూ. 26 కోట్లు కేటాయిస్తే, ఈ సంవత్సరం రూ. 35 కోట్లకు పెంచారు. ప్రస్తుతం ఇక్కడ ప్రస్తావించిన పథకాలలో పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్, విదేశీ విద్య స్కాలర్‌షిప్‌లు బాబా సాహెబ్ అంబేడ్కర్ చొరవతో స్వాతంత్ర్యానికి ముందే 1944లో ప్రారంభమయ్యాయి. ఆ రోజుల్లోనే అంబేడ్కర్ బ్రిటిష్ ప్రభుత్వంతో సంప్రదించి ఇటువంటి పథకాలను రూపొందించారు. దాదాపు 70 ఏళ్ల తర్వాత కూడా ఈ ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు ఎంత మాత్రం ఎస్సీ, ఎస్టీ, బీసీలలో ఉన్న వెనుకబాటుతనాన్ని తొలగించే స్థితిలో లేవు. కానీ ఇవే ప్రభుత్వాలు ధనిక రైతులకు పారిశ్రామిక వేత్తలకు, వేలకోట్ల అధిపతులకు ఉపకరించే ఎన్నో సబ్సిడీలను అందిస్తూండటం గమనార్హం. ఇప్పటికీ 40 శాతానికి పైగా ఉన్న వెనుకబడిన కులాలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ లేదంటే, హిందువుల పట్ల, హిందూ సెంటిమెంట్‌తో రాజకీయాలు నడుపుతోన్న పార్టీకీ, ప్రభుత్వానికీ ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వాలు రాజ్యాంగంలో పేర్కొన్న ఎన్నో విషయాలను విస్మరిస్తుంటే ఆర్థిక, సామాజికాభివృద్ధి కోసం నిర్దేశించిన సూత్రాలను కనీసం పట్టించుకున్న పాపానపోవడం లేదు. ఇది ఎంతమాత్రం ప్రజాస్వామ్య స్ఫూర్తినికానీ, రాజ్యాంగబద్ధ పాలనను కానీ అనుసరిస్తున్నట్టుగా భావించలేం. ఇది ముమ్మాటికీ దళిత, బలహీన వర్గాల పట్ల పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం. దళితులకు, ఆదివాసీలకు, బలహీన వర్గాలకు రాజ్యాంగం కల్పించిన అవకాశాలను కాలరాయడమే తప్ప మరొకటి కాదు.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు । మొబైల్ : 81063 22077

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### ఆరు నెలలు



"ఫరూఖ్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీలను నిర్బంధించి ఇప్పటికి ఆరునెలలు అయ్యింది. తుపాకీలతో కాల్చండి అని ప్రజలకు పిలుపునిచ్చే నేతలంతా స్వేచ్ఛగా తిరుగుతుంటే, అకారణంగా కశ్మీరీ నేతలను నిర్బంధించడం విచిత్రం" – షమా మహ్మద్, కాంగ్రెస్ నేత

### శత్రుత్వం



"పిల్లలకు చికిత్స చేసినందుకు 2017లో డాక్టర్ కఫీల్ ఖాన్‌ను అరెస్ట్ చేశారు. అది కూడా గోరఖ్‌పూర్ ఆసుపత్రిలో పలువురు చిన్నారులు చనిపోయాక. ఇప్పుడేమో రెండు మతాల మధ్య శత్రుత్వాన్ని పెంచుతున్నాడని అరెస్ట్ చేశారు. శత్రుత్వాన్ని పెంపొందించడానికి అతడు అసలు ఏం చేశాడు?"

– ఫహద్ అహ్మద్, విద్యార్థినేత


### ప్రశ్న



"ఢిల్లీ పోలీసులకు నాదొక ప్రశ్న. జామియా యూనివర్సిటీ దగ్గర కాల్పులు జరిపిన జువెనైల్ తాను బజరంగ్ దళ్ కార్యకర్తనని సామాజిక మాధ్యమంలో పేర్కొన్నాడు. అప్పుడు ఓ డీసీపీ స్థాయి అధికారితో విలేకరుల సమావేశం ఏర్పాటు చేయించి, బజరంగ్ దళ్ పేరు ఎందుకు బయటపెట్టలేదు?"

– సాహిల్ ముర్లీ మెంఘానీ, యాంకర్

### హక్కు



"ఎన్నికల ప్రచారానికి సంబంధించి ఫోన్‌లు వస్తున్నాయి. ఒక శరణార్థిగా నాకు ఓటు వేసే హక్కు లేదని వాళ్లు తెలుసుకోవాలి. ఎవరు శరణార్థులు, ఎవరు పౌరులు అని తేల్చడానికి జాతీయ పౌర పట్టిక అవసరం. నేను నా శరణార్థి హక్కులను కోరుకుంటున్నా. ఎన్నికల ప్రచారం నుంచి నా ఫోన్ నంబర్‌ను తొలగించండి"

– తస్లీమా నస్రీన్, రచయిత్రి

### సీరియస్



"చాలా సీరియస్‌గా అడుగుతున్నా. దేశద్రోహులను కాల్చివేస్తే నష్టం ఏంటి? మీ సొంత ఇంట్లో మీరొక ద్రోహితో కలిసి నివసిస్తారా? మీ సమాధానం మీలోని హిపోక్రసీని బయట పెడుతోంది" – వివేక్ అగ్నిహోత్రి, ఫిల్మ్ మేకర్

### అవకాశం



"ఉత్తరప్రదేశ్‌లో డిఫెన్స్ ఎక్స్ పో 20 ఏర్పాటు చేయడం ఇటీవల కాలంలో ఆ రాష్ట్రంలో జరిగిన మంచి పరిణామం. తమ రాష్ట్రంలో నెలకొల్పిన డిఫెన్స్ కారిడార్‌ను ప్రదర్శించి రక్షణ పరికరాల తయారీదారులను ఆకర్షించే అవకాశం రాష్ట్రానికి దక్కింది. ఉత్తరప్రదేశ్‌లో విస్తృతంగా ఉన్న మానవ శక్తిని మనం ఈ రంగంలో వినియోగించుకోవాలి"

– వినితా హిందుస్తానీ, టీచర్

### హిపోక్రసీ



"హిందూ దుస్తులు ధరించి రహస్య కెమెరాతో గుజరాత్‌లోని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నేతలను ఇంటర్వ్యూ చేస్తే ఏ మాత్రం తప్పుగా అనిపించని రాణా అయూబ్‌కు, గుంజా కపూర్ బురఖా ధరించి షహీన్‌బాగ్‌లోనివారిని ప్రశ్నలు వేస్తే ఎందుకు తప్పనిపించింది? దీన్నే రాజకీయ హిపోక్రసీ అంటారు"

– ఆర్ఫాటికూ సింగ్, జర్నలిస్ట్

## ఇన్‌బాక్స్

### ధూళి మేఘం

ఏం మాట్లాడేటట్టు లేదు
ఏం రాసేటట్టు లేదు
గాలినిండా
ఇనుప గొలుసులు
వేలాడుతున్నాయి
చెట్ల కొమ్మలకు
ఉచ్చులు ఊగుతున్నాయి

అడుగు తీసి అడుగేస్తే చాలు
అణువణువునా
వలలు పరిచి వున్నాయి


గొంతులను పెకలించే
శూలాలు పదును తేలుతున్నాయి
ప్రశ్నలను వేటాడే
క్రూరమృగాలు పొంచి వున్నాయి

ఏదోవొక రంగు బట్టతో
కళ్లకు గంతలు
కట్టుకున్న మనుషులు
మనిషి రంగును
మంటగలిపేస్తున్నారు

సముద్రమేదైనా
చిన్న దీవి కావాలి
ఎడారి ఎంతదయినా
ఒక ఒయాసిస్సుకావాలి

నేల పరుచుకున్నంత మేర
ఒక చెట్టు నాటాలి
చెట్టు నిండా
మనుషులు పూయాలి

ఏం మాట్లాడేటట్టు లేదు
ఏం రాసేటట్టు లేదు
దేశమంతా పరుచుకున్న
ఏదో ధూళి మేఘం



దేశాన్ని ప్రేమించే వాళ్లు
ఏ దేశవాసులయినా
మనుషులయితే చాలు
తీగల్లా అల్లుకుపోయే వాళ్లు
దేశం ధూళిని బిగ్గరగా ఊదేయాలి
దేశపటం తేటగా మెరవాలి!

– చిత్తలూరి సత్యనారాయణ, ప్రముఖ కవి, హైదరాబాద్

# 'మరడు' చెబుతున్న గుణపాఠం

### సందర్భం



మంగారి రాజేందర్

నదీ ప్రవాహక ప్రాంతంలో అక్రమంగా నిర్మించిన ప్రజావేదికను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూల్చివేసినప్పుడు మీడియా గగ్గోలు పెట్టింది. నదీ ప్రవాహక ప్రాంతంలో నిర్మాణాలు చేపట్టకూడదు.

తెలంగాణ రాష్ట్రంలో కూడా 111 జీవో ఒకటి ఉంది. ఈ జీవో వర్తించే ప్రాంతాల్లో ఎలాంటి నిర్మాణాలని చేపట్టకూడదు. 'మరడు' ఉదంతం ద్వారా నేర్చుకోవాల్సిన గుణపాఠం ఇదే. కేరళ రాష్ట్రంలోని కొచ్చి ప్రాంతంలో జీవ వైవిధ్యం ఉన్న నది పరీవాహక ప్రాంతం వెంబనాడ్ నది పరీవాహక ప్రాంతం. ఈ పరిసర ప్రాంతాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదన్న 'సీఆర్‌జెడ్' ప్రకటనలు ఉన్నాయి. ఒక వేళ చేపడితే ప్రభుత్వాలు ఉపేక్షించినా కోర్టులు ఉపేక్షించే పరిస్థితి ఉండదు. అందుకు ఉదాహరణే 'మరడు' కూల్చివేత ఉదంతం.

నాలుగువందల కుటుంబాలు నివాసముంటున్న అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌ని కొచ్చి దగ్గరలోని మరడులో నాలుగు నిర్మాణ సంస్థలు నిర్మించాయి. ఆ నిర్మాణాలని సుప్రీంకోర్టు ఆదేశాలతో జనవరి 11, 12న ఇంప్లోషన్ పద్ధతిలో కూల్చివేశారు. హోలీ ఫెయిత్ బిల్డర్స్ ఫ్లాట్స్ నిర్మాణం కోసం మరడు గ్రామ పంచాయతీ నుంచి 18.8.2006 నాడు అనుమతి తీసుకున్నారు. ఆల్ఫా వెంచర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ 19.9.2006 రోజున పంచాయతీ నుంచి ఫ్లాట్స్ నిర్మాణానికి అనుమతి తీసుకుంది. ఈ నిర్మాణాలలో చాలా ఉల్లంఘనలు ఉన్నాయని సీనియర్ టౌన్ ప్లానర్ కేరళ రాష్ట్ర చీఫ్ సెక్రటరీకి తెలియజేశాడు. దీంతో సంబంధిత నిర్మాణ సంస్థలకు షోకాజ్ నోటీసులను జారీ చేయమని ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ గ్రామ పంచాయతీని ఆదేశించారు. గ్రామ పంచాయతీ నుంచి నోటీసు అందగానే ఆ నిర్మాణ సంస్థలు కేరళ హైకోర్టులో రిట్ దాఖలు చేసి సింగిల్ జడ్జి ద్వారా స్టే ఉత్తర్వులు పొంది తమ నిర్మాణాలని పూర్తి చేశారు. ఆ తరువాత గ్రామ పంచాయతీ నుంచి నెంబర్లని కూడా పొందారు. ఆ తరువాత ఆ నోటీసులను సింగిల్ జడ్జి కొట్టివేశారు.

ఈ ఉత్తర్వులకి వ్యతిరేకంగా మరడు గ్రామ పంచాయతీ, మరడు మున్సిపాలిటీలు డివిజన్ బెంచి ముందు అప్పీలుని 2013లో దాఖలు చేశాయి. ఈ రెండింటినీ హైకోర్టు 2 జూన్ 2015న తన తీర్పుని బిల్డర్స్ వైపున చెప్పింది. రివ్యూ దరఖాస్తుని కూడా కొట్టివేసింది. కేరళ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ సుప్రీంకోర్టులో ప్రత్యేక అనుమతి దరఖాస్తుని 2016లో దాఖలు చేసింది. నవంబర్ 27, 2018 రోజున సుప్రీంకోర్టు, ముగ్గురు సభ్యులతో కూడిన ఓ కమిటీని ఏర్పాటు చేస్తూ ఆ జోన్‌లో ఆ నిర్మాణాలు ఉన్నాయో లేదా చూడాలని కమిటీని ఆదేశించింది. ఈ కట్టడాలు కోస్టల్ రెగ్యులేటరీ జోన్ పరిధిలోకి వస్తాయని కమిటీ సుప్రీంకోర్టుకి తెలియచేసింది. కమిటీ నిర్ణయాంశాలని అంగీకరిస్తూ న్యాయమూర్తులు అరుణ్‌మిశ్రా, నవీన్ సిన్హాలతో కూడిన సుప్రీం కోర్టు డివిజన్ బెంచ్ ఈ నిర్మాణాలని ఒక నెల లోపు కూల్చివేయాలని మే 8, 2019న ఆదేశించింది. తమ వాదనలని వినలేదని ఆ ఫ్లాట్స్‌లో నివాసం ఉంటున్న వ్యక్తులతో బిల్డర్స్ వేసవి రోజుల్లో దరఖాస్తులు దాఖలు చేసి ఆరువారాల స్టేని పొందారు. వేసవి సెలవుల తరువాత ఈ కేసు మళ్లీ న్యాయమూర్తి అరుణ్ మిశ్రా నేతృత్వంలోని బెంచి ముందుకు వచ్చింది. 'బెంచి హంటింగ్' పద్ధతిని విమర్శిస్తూ ఆ దరఖాస్తులని జులై 5, 2019 రోజున కొట్టివేశారు. ఆ తరువాత బిల్డర్స్ దాఖలు చేసిన రివ్యూ దరఖాస్తులని కూడా కొట్టివేశారు.

తమ ఉత్తర్వులని అమలుపరచడంలేదని తీవ్ర అసంతృప్తిని వ్యక్తపరుస్తూ సెప్టెంబర్ 20 లోగా కూల్చివేయాలని, అలా చేయని పక్షంలో సెప్టెంబర్ 23 రోజున కేరళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ ముందు హాజరు కావాలని సుప్రీంకోర్టు డివిజన్ బెంచి సెప్టెంబర్ 6, 2019న ఆదేశించింది. కేరళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సెప్టెంబర్ 23న సుప్రీంకోర్టు ముందు హాజరైనాడు. కూల్చివేత అమలు గురించి ప్రణాళికను సిద్ధం చేసి కోర్టుకు సమర్పించమని కోర్టు ఆదేశించింది. కూల్చివేతవల్ల తమ ఇళ్లు దెబ్బతింటాయని మరికొందరు సుప్రీంకోర్టుని ఆశ్రయించారు. కానీ ఫలితం లేకపోయింది. ఆ ఫ్లాట్స్‌లోని నివాసితుల నష్టపరిహారం అంచనా వేయడానికి ఓ హైకోర్టు మాజీ న్యాయమూర్తి బాలక్రిష్ణన్ నాయర్‌ని కోర్టు నియమించింది.


మార్చి 2018 కోస్టల్ జోన్ నియమాలకి సవరణలు తీసుకొని వచ్చారని, దాని ప్రకారం తమ నిర్మాణాలు సక్రమమేనని, ప్రొసీజరల్ తప్పిదాన్ని సరిచేసుకోవచ్చని, నాలుగు వందల కుటుంబాల జీవితం ఈ కూల్చివేతతో ముడిపడి ఉందని బిల్డర్స్ కోర్టుకి విన్నవించారు. కోర్టు ఈ వాదనని అంగీకరించలేదు.

వ్యాసకర్త గతంలో జిల్లా సెషన్స్ జడ్జీగా, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యునిగా పనిచేశారు
మొబైల్ : 94404 83001

# కోటికొక్కరు

కోటి మందిలో ఒకరుగా జీవించడానికి, కోటిమందికి ఒక్కరై జీవించడానికి మధ్య హస్తిమశకాంతరం ఉంది. భువిపై నడయాడిన కారణ జన్ములంతా జగతికి ప్రయోజనాన్ని, జాతికి ఆనందాన్ని కలిగించిన వారే. వెయ్యి మైళ్ళ ప్రయాణమైనా ఒక్క అడుగుతోనే ప్రారంభమైనట్టు, కోటి అంకెల గణితమైనా ఒకటితోనే లెక్కించడం ప్రారంభించినట్టు గొప్ప కార్యాలను దైవీభూతులు ఒక్కరే ప్రారంభించి అనేకులకు చేర్చారు. 'నిక్కమైన మంచి నీలమొక్కటి చాల'న్నట్టు, ఎందరికో అసాధ్యమైన కార్యాలను అవలీలగా సాధించి జాతి ఘనత చాటారు.

'నూటికో కోటికో ఒక్కరు, ఎప్పుడో ఎక్కడో పుడతారన్నట్టు' ఒక్కరే అనేకులకు సమానంగా ఎదిగి, విజేతలై నిలిచిన ఉదంతాలను చరిత్ర నిక్షిప్తం చేసింది. అర్థశాస్త్రానికి కౌటిల్యుడు, కామసూత్రాలకు



జ్యోతిర్మయం

వాత్సాయనుడు, గణిత, ఖగోళ పరిశోధనలకు ఆర్యభట్టు, యోగశాస్త్రానికి పతంజలి, ఆయుర్వేదానికి చరకుడు, జ్యోతిషానికి వరాహమిహిరుడు, పూర్ణాంశానికి భాస్కరాచార్యులు, నాట్యశాస్త్రానికి భరత ముని పేర్లు తక్కున జ్ఞప్తికి రావడానికి వారి కృషి, అంకితభావాలే కారణం.

'ఆకాశంలో తారలెన్నున్నా పగటి వెలుగుకు సూర్యుడు, రాత్రి వెన్నెలకు చంద్రుడు ఆధారమైనట్టు', నేలపై నడయాడిన వారెందరున్నా స్వల్పకాలమే జీవించిన శంకరాచార్యుడు, వివేకానందుడు, శ్రీనివాస రామానుజన్‌లు గడించిన కీర్తి వెలుగులతో జగతి పులకించింది. మహనీయుల అడుగుజాడల్ని నిత్యం జాతి అనుసరిస్తున్నా ధర్మమార్గానికి బుద్ధుడు, సత్యాగ్రహానికి గాంధీజీ, మానవసేవకు మదర్ థెరిసాలు గుర్తు రావడానికి వారందించిన స్ఫూర్తి సందేశాలే కారణం. భగవద్గీత విభూతి యోగంలో శ్రీకృష్ణుడు ''అక్షరాలలో అకారము, వేదాలలో సామవేదము, పురోహితులలో బృహస్పతి, మహర్షులలో భృగువు, వృక్షాలలో అశ్వత్థము, ఆయుధాలలో వజ్రాయుధము, పాడి ఆవులలో కామధేనువు తానేనంటూ' ప్రకటించడంలో 'ఉత్తమమైన ఒక్క అంశ చాలన్న' భావం ఇమిడి ఉంది.

– నారంశెట్టి ఉమామహేశ్వరరావు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి
# ఫ్యామిలీ
నల్లగొండ
గురువారం ॥ 6-2-2020



సినిమా పేజీలో



పేరు కోసమే కష్టపడ్డాను

మైనపు బొమ్మ

టైనీ టేల్



వాలర్మతి వంటను చానెల్ కోసం షూట్ చేస్తున్న భర్త రామ్ కుమార్

# చారెడేసి చానెల్

ఒక అన్నా.. చెల్లి.

చెల్లి వచ్చి 'అన్నా.. ఈ రోజు కొత్త వంటకం నేర్చుకున్నాను' అని చెప్పింది.

'ఓహ్.. నాకూ నేర్పించు' అన్నాడు అన్న.

అలా రోజూ రకరకాల కొత్త వంటకాల గురించి ఈ అన్నాచెల్లెళ్లిద్దరూ తెలుసుకొని..నేర్చుకొని.. పదిమందికీ నేర్పించే పని పెట్టుకున్నారు 'ది టైనీ ఫుడ్' అనే యూట్యూబ్ చానెల్ ద్వారా.

టైనీ పేరుకు తగ్గట్టే ఆ చానెల్ వీడియోల్లో కనిపించే వంట సామాగ్రి అంతా బొమ్మలాటలో ఉండే బొమ్మల్లాగే చిన్నగా ఉంటాయి. చిన్న మట్టిపొయ్యి. దానికి సరిపోయే చిన్న చిన్న మట్టి పాత్రలు.. అంతే చిన్న మట్టి బాండీ.. బుజ్జి పెనం.. బుల్లి అప్పడాల కర్ర, అట్ల కాడ, చిన్న చిన్న చెంచాలు.. అన్నీ మట్టివే. అచ్చంగా బొమ్మలాట

చిట్టి పొట్టి పాత్రల్లో వంట చేస్తున్న దృశ్యం



చూస్తున్నట్టే ఉంటుంది. ఈ యూట్యూబ్ చానెల్‌కు జపాన్ కుకింగ్ చానెల్సే స్ఫూర్తి. స్థానిక సంప్రదాయ వంటకాల నుంచి ప్రపంచ నలుమూలలకు చెందిన వంటకాల వరకు అన్నిటినీ చేసి చూపిస్తూంటారు ఈ చానెల్‌లో. ఆట వస్తువుల్లాంటి పాత్రలతో వంటలు చేయడం సరే.. ఆ వంటలను ఎలా చేయాలో వివరించే ఈ అన్నాచెల్లెళ్లూ బొమ్మలే. తోలు బొమ్మలు!

మరి ఈ చానెల్ నిర్వహిస్తున్నదెవరంటారా? తమిళనాడుకు చెందిన వాలర్మతి, రామ్‌కుమార్ అనే దంపతులు. వాలర్మతి ఉద్యోగిని. రామ్‌కుమార్‌ది గోల్డ్‌లోన్ బిజినెస్. వారంతంలో ఈ యూట్యూబ్ వంటల చానెల్ పని పెట్టుకుంటారు.

'కుకింగ్ అంటే మా ఇద్దరికీ ఆసక్తే. అయితే యూట్యూబ్ చానెల్ ఆలోచన వచ్చింతర్వాత.. కాస్త వెనకడుగు వేశాం. ఇప్పటికే బోలెడు వంటల చానెళ్లున్నాయి. వాళ్లందరికన్నా కొత్తగా ఉండాలి అనుకున్నాం. అప్పుడే జపాన్‌కు చెందిన ఈ టైనీ చానెల్స్ కంటపడ్డాయి. రెండు పప్పెట్స్‌ను తయారు చేసి.. షెఫ్స్‌గా అవి వివరిస్తుంటే నేను వంట చేయడం.. అన్నట్టుగా ప్లాన్ చేశాం. సక్సెస్ అయింది. కాని ఎంత కష్టమో తెలుసాండీ.. చిన్న చిన్న వంట పాత్రలతో వంట చేయడం?ఎన్నిసార్లు చేయి కాల్చుకున్నానో! 'అంటుంది వాలర్మతి.

ఈ చానెల్‌కు ఏడు లక్షల మంది సబ్‌స్క్రైబర్స్ ఉన్నారట. ఇదీ 'ది టైనీ ఫుడ్' యూట్యూబ్ కుకింగ్ చానెల్ టేల్.

మైండ్ స్టోరీ



ప్రతీకాత్మక చిత్రం

# డబ్బు ప్రియుడు

**'నెలవంకను చూస్తే నీకేమనిస్తోంది' అని హీరోయిన్ ఒక సినిమాలో అడిగితే 'దానితో నా వీపు గోక్కోవాలని ఉంది' అని అంటాడు ప్రియుడు. అది సరదాకి కావచ్చు. కాని ప్రేమించిన అమ్మాయిని చూస్తే ఆ అమ్మాయి వెనుక ఉన్న ఇల్లు, పొలం, ఆస్తి, బ్యాంక్ బేలెన్స్ కనిపిస్తూ ఉంటే ఆ అబ్బాయిని అనుమానించాలా? నమ్మాలా? ప్రేమలో డబ్బు ప్రస్తావన వస్తే ఏం చేయాలి? ఒకవేళ మోసపోతే ఎలా తట్టుకొని నిలబడాలి? ప్రేమలో డబ్బు ఉండొచ్చు. కాని డబ్బే ప్రేమ అయితే ఎలా?**

**మూడేళ్ల క్రితం.**

'జీవన్. సారీ. నిన్ను తప్పుగా అర్థం చేసుకున్నాను' అంది ఫోన్‌లో ఇందు.

అప్పుడు టైమ్ ఆమెకు మధ్యాహ్నం. అతనికి అర్ధరాత్రి. ఆమె హైదరాబాద్‌లో ఉంది. అతడు శాన్‌ఫ్రాన్సిస్కోలో.

అతడు మౌనంగా వింటున్నాడు.

'అప్పుడు ఏం చేయాలో నాకు అర్థం కాలేదు. ఒకవైపు నువ్వు వెళ్లిపోతున్నావ్ అన్న బాధ. మన ప్రేమ నిలబడుతుందో లేదోనని భయం. మరో వైపు నువ్వు అమెరికా వెళ్లడానికి నన్ను పదేపదే డబ్బు సాయం అడుగుతున్నావు. ఇవ్వాలో వద్దో తెలియదు. అమెరికాకు వెళ్లాక సెటిలయ్యి పెళ్లి చేసుకుంటాను అన్నావ్. ఆ మాట నిలబెట్టుకుంటావో లేదోనని సందేహం. నువ్వు నన్నేమైనా మోసం చేయదలిచావా? అందుకే డబ్బు అడుగుతున్నావా అని నీకు రెస్పాండ్ కాలేదు. ఐయాం సారీ' అందామె.

'రెండేళ్ల తర్వాత ఇది చెప్పడానికి కాల్ చేశావా' అన్నాడు జీవన్.

'అవును. నీ గురించి మొన్నో ఫ్రెండ్ చెప్పింది. అమెరికాలో నువ్వు బాగున్నావని.. కష్టపడి పని చేసి సెటిల్ అయ్యావని.. గర్ల్‌ఫ్రెండ్స్ ఎవరూ లేరని చెప్పింది. అంటే నేనే నీ మనసులో ఉన్నానని అర్థమైంది'

'ఇందూ... నేను అమెరికాకు వెళ్లాలనుకున్నప్పుడు లోన్ డిలే అయ్యింది. నాన్న పొలం అమ్ముదామనుకుంటే కొంటానన్న వ్యక్తి కొంత అడ్వాన్స్ ఇచ్చి ఆ తర్వాత మానుకున్నాడు. అప్పటికే నువ్వు జాబ్ చేస్తున్నావ్. మీ పేరెంట్స్ నీ మీద ఫిక్స్‌డ్ డిపాజిట్స్ చేశారని నువ్వే చెప్పావ్. మనం పెళ్లి చేసుకోబోతున్నాం కాబట్టి ఆ మాత్రం హెల్ప్ అడగొచ్చనుకున్నాను. కాని తప్పుగా అర్థం చేసుకున్నావ్. జర్నీ డేట్ పెరిగే కొద్దీ నేను నిన్ను తొందరపెట్టాను. తొందరపెట్టే కొద్దీ నువ్వు అనుమానించావు. ఏం పర్లేదు. ఇట్స్ ఓకే'...

'జీవన్..'

'చెప్పు'..

'మనం పెళ్లి చేసుకుందాం. నీతో బ్రేకప్ తర్వాత నేను మరొక రిలేషన్‌లోకి వెళ్లలేదు. నీకు తెలుసుగా... నేను చాలా రిజర్వ్‌గా ఉంటాను. అందువల్లనేమో నన్నెవ్వరూ అప్రోచ్ కాలేదు.'

'నాకు నీ మీద ప్రేమ ఇంకా చావలేదు ఇందూ. నువ్వంటే నాకు చాలా ఇష్టం. కాని ఈ ఫోన్ నువ్వు కనీసం నెల ముందు చేయాల్సింది'

'ఏమైంది?' ఆందోళనగా అడిగింది.

'నెలక్రితమే నా ఎంగేజ్‌మెంట్ అయ్యింది. మరో టూ వీక్స్‌లో హైదరాబాద్‌లోనే నా పెళ్లి. చెప్పు... ఏం చేద్దాం'

ఇందు ఏం మాట్లాడలేదు.

మాట్లాడటానికి ఏం లేదు కూడా.

• • •

**మూడేళ్ల తర్వాత.**

'ఇందు... ఒక్క 25 ల్యాక్స్ ఉంటే చాలా బాగుంటుంది' అన్నాడు రాకేష్.

'ఏం?' అడిగింది ఇందు.

'మా ఫ్రెండ్స్ నలుగురు ఒక చిన్న రియల్ ఎస్టేట్ వెంచర్ చేస్తున్నారు. ఒక ఫిఫ్టీ పెడితే ఒన్ ఇయర్‌లో ఒన్ క్రోర్ వస్తాయని అంటున్నారు. నా దగ్గరున్న సేవింగ్స్ నుంచి కొంత ఇంకో ఫ్రెండ్‌ని అడిగి కొంత 25 చేశాను. ఇంకో 25 కావాలి. తిరుపతిలో ఇప్పుడు రియల్ ఎస్టేట్ బాగుంది. ఏం చేద్దాం' అన్నాడు రాకేష్.

అతడు ఇందూకు పరిచయమయ్యి ఆరు నెలలు. ఫేస్‌బుక్‌లో ఒకరోజు ఎర్లీ మార్నింగ్ కాఫీ కప్పుతో ఫ్లాట్‌లోని పూల కుండీల దగ్గర కూచుని ఫొటో పెట్టింది. అతడు ఇంత పొడుగు కవిత్వం కామెంట్‌లో పెట్టాడు. ఆ తర్వాత ఫ్రెండ్ రిక్వెస్ట్ పెట్టాడు. తిరుపతిలో ఆయుర్వేదిక్ డాక్టర్. కుటుంబ బాధ్యతల వల్ల ఇంకా పెళ్లి చేసుకోలేదట. చూడటానికి బాగానే ఉన్నాడు. అతడి వాల్ మీద చూస్తే శాస్త్రీయ సంగీత గాయకుల వీడియో క్లిప్పింగ్స్, అల్లోపతిలో ఉండే అపసవ్యతలను ప్రశ్నించే వ్యాసాల క్లిప్పింగ్స్, ట్రావెలర్‌గా తాను వెళ్లిన స్థలాల ఫొటోలు ఉన్నాయి.

'మంచివాడే' అనుకుంది.

మాట కలిసింది. మాట పెరిగింది. మాట గంటల గంటలు కొనసాగింది. 'త్వరలోనే మనం పెళ్లి చేసుకుందాం' అన్నాడతను.

మరో రెండు వారాలకు ఈ ప్రపోజల్.

'నీకు కుదరకపోతే వద్దులే. ఇబ్బంది పడకు' అన్నాడు మరుసటిరోజు ఫోన్. ఆ గొంతు మామూలుగానే ఉన్నా డిజప్పాయింట్‌గా ఉందేమోనని ఇందుకు అనిపించింది. ఇలాంటి ప్రస్తావన వల్లే ఒక ప్రేమ కోల్పోయాను.. మరో ప్రేమ కోల్పోకూడదు అని అనుకుంది.

'నేను ఇస్తానులే' అంది రాకేష్‌తో.

ఇందూకు తల్లిదండ్రులు కొన్న సొంత ఫ్లాట్ ఉంది. ఈ మధ్యే ఇన్‌వెస్ట్‌మెంట్‌గా ఇంకో ఫ్లాట్ కొని అద్దెకు ఇచ్చింది.. దానిపై లోన్ నడుస్తోంది. అయినా తన దగ్గర పది లక్షల వరకూ ఉన్నాయి. తండ్రి రిటైరయ్యి పి.ఎఫ్ వచ్చింది. ఆ డబ్బులో నుంచి పదిహేను లక్షలు అడగాలనుకుంది.

'ఎందుకమ్మా?' అన్నాడు తండ్రి.

'తిరుపతిలో స్థలం ఉందట నాన్నా. నా ఫ్రెండ్ చెప్పింది. కొంటే మంచి రేట్ వస్తుందట' అని చెప్పింది.

కూతురు జాగ్రత్తగా ఉంటుంది అని తండ్రికి తెలుసు. అలా ఎప్పుడూ డబ్బు అడగలేదు కూడా. ఒక్క నిమిషం కూడా సందేహించకుండా చెక్ ఇచ్చాడు. అదీ ఇదీ కలిపి మొత్తం పాతిక.

పోయాయి.

ఆ తర్వాత రాకేష్ ఫోన్ ఎత్తలేదు. కనిపించలేదు. మాట్లాడలేదు. ఫేస్‌బుక్‌లో అతని అకౌంట్ లేదు. తెలిసినవారి ద్వారా వాకబు చేస్తే తిరుపతిలో ఆ పేరుతో ఆయుర్వేదిక్ డాక్టర్ ఉన్న ఆనవాలే లేదని చెప్పారు.

పోలీస్ కేసు పెట్టడం, ఇంట్లో చెప్పడం ఇవన్నీ పెద్ద రాద్ధాంతాలు. ఎలాగూ జరుగుతాయి. జరిగాయి. కాని తన రెండు నిర్ణయాలు తనని దెబ్బ తీయడంతో ఇందూ కుంగిపోయింది. తీవ్రమైన నిరాశలోకి వెళ్లిపోయింది. వయసు 30కి చేరుకుంది. రెండు ప్రేమలూ భంగపరిచాయి. ఇక బతికి ఏం లాభం వరకూ వెళ్లింది. సరిగా అప్పుడు తల్లిదండ్రులు మేలుకొని ఆమెను సైకియాట్రిస్ట్ దగ్గరకు తీసుకువచ్చారు. అంతా విన్న సైకియాట్రిస్ట్ ఇందూతో మాట్లాడాడు.

• • •

'రెండు సందర్భాల్లోనూ తప్పు నీది కాదమ్మా. డబ్బుది' అన్నాడు సైకియాట్రిస్ట్.

ఇందూ ఆయన వైపు చూసింది.

'ప్రేమ అనేది ఇద్దరు వ్యక్తుల మధ్య సంభవించేది. అది ఒక మానసికమైన బంధం. ఆ బంధంలో ఇద్దరికీ సంబంధించిన ఒక ఊహాజగత్తు, సంతోషం, పారవశ్యం ఉంటాయి తప్ప ఇహలోకపు విషయాలు పట్టవు. నీ ప్రేమలో డబ్బు ప్రస్తావన వచ్చేసరికి నువ్వు కన్ఫ్యూజ్ అయ్యావు. పెళ్లి తర్వాత ఆ ప్రస్తావన వస్తే ఇబ్బంది లేదు. పెళ్లికి ముందు రావడంతో ఎలా జడ్జ్ చేయాలో నీకు తెలియలేదు. అసలు ప్రేమ ప్రేమను అడుగుతుంది తప్ప డబ్బు అడుగుతుందా? ఒక వేళ అడిగితే ఆ ప్రేమ పెద్దల వరకూ వచ్చిందని అనుకోవాలి. నీ అమెరికా ఫ్రెండ్ నిన్ను డబ్బు అడిగినప్పుడు అతని తల్లిదండ్రులు, నీ తల్లిదండ్రులు మాట్లాడుకుని ఆ సహాయం ఇచ్చిపుచ్చుకుని ఉంటే బాగుండేది. నువ్వూ అతనూ ఆ ప్రయత్నం చేయలేదు. దాని వల్ల అపనమ్మకం వచ్చింది. నీ ప్రేమ పోయింది. తిరుపతి కుర్రాడు అడిగినప్పుడైనా నువ్వు అతని గురించి అతని పెద్దల గురించి ఆలోచించలేదు. ఇన్వెస్ట్‌మెంట్ అన్నప్పుడు స్వయంగా తిరుపతి వెళ్లి చూడలేదు. చెక్ చేయలేదు. నమ్మకం ఎంత ఉన్నా ఇలాంటి విషయాల్లో భాగస్వామ్యం ఉండటం తప్పు కాదు కదా. అదీ నువ్వు చేయలేదు. నువ్వు చాలా అదృష్టవంతురాలివి. పాతిక లక్షలు నష్టపోయినా ధైర్యంగా ఉన్నావు. ఊళ్లలో బైక్ కొనుక్కోవాలని బాయ్‌ఫ్రెండ్, సెల్‌ఫోన్ కొనుక్కోవాలని గర్ల్‌ఫ్రెండ్... గర్ల్‌ఫ్రెండ్స్‌కు గిఫ్ట్స్ కొనివ్వాలని బాయ్‌ఫ్రెండ్స్ తెలిసీ తెలియక శక్తి లేకపోయినా డబ్బు ఇన్వాల్వ్ చేసి ప్రాణాల మీదకు తెచ్చుకున్నవారు ఉన్నారు. బాధపడకు. కెరీర్ మీద దృష్టిపెట్టు. బెంగళూరు ట్రాన్స్‌ఫర్ వచ్చింది అంటున్నావుగా వెళ్లు. ఈ గాయం మానిపోనీ. భవిష్యత్తులో నీకు ఏమనిపిస్తే అది చెయ్. మళ్లీ పెళ్లి చేసుకునే స్థాయి ప్రేమ ఎదురైతే వెంటనే పెద్దవాళ్లను ఇన్‌వాల్వ్ చేయి. ఒక దశ వరకే మీరిద్దరూ చేసే క్యాండిల్‌లైట్ డిన్నర్స్ బాగుంటాయి. తర్వాత ఫ్యామిలీ డిన్నర్స్ చేయాలి. అవి పెళ్లి విందుకు దారి తీసేలా చూసుకోవాలి. నా సలహా పనికొస్తుందనే అనుకుంటున్నాను' అన్నాడు సైకియాట్రిస్ట్.

**నువ్వు చాలా అదృష్టవంతురాలివి. పాతిక లక్షలు నష్టపోయినా ధైర్యంగా ఉన్నావు. ఊళ్లలో బైక్ కొనుక్కోవాలని బాయ్‌ఫ్రెండ్, సెల్‌ఫోన్ కొనుక్కోవాలని గర్ల్‌ఫ్రెండ్... గర్ల్‌ఫ్రెండ్స్‌కు గిఫ్ట్స్ కొనివ్వాలని బాయ్‌ఫ్రెండ్స్ తెలిసీ తెలియక శక్తి లేకపోయినా డబ్బు ఇన్వాల్వ్ చేసి ప్రాణాల మీదకు తెచ్చుకున్నవారు ఉన్నారు.**

ఇందు కొంత కోలుకుంది.

మరుసటి రోజు ఫేస్‌బుక్‌లో ఆమె తాజా ఫొటోను చాలామంది చూశారు.

– కథనం: సాక్షి ఫ్యామిలీ

ఇన్‌పుట్స్: డాక్టర్ కల్యాణ చక్రవర్తి, సైకియాట్రిస్ట్

స్త్రీ శక్తి

# కొత్త సంతకాలు





**పరిపాలన ప్రక్షాళనలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ఎనిమిది మంది మహిళా అధికారులకు కలెక్టర్‌లుగా బాధ్యతలు అప్పగించింది. రాష్ట్ర ఆవిర్భావం తరువాత ఇంత పెద్ద స్థాయిలో మహిళా కలెక్టర్లను నియమించడం ఇదే తొలిసారి. హైదరాబాద్ వంటి మెట్రో పాలిటన్ నగరానికి యువ ఐఏఎస్ అధికారి శ్వేతా మహంతిని, కొత్తగా ఏర్పడిన పెద్దపల్లికి మరో యువ అధికారి సిక్తా పట్నాయక్‌ను కలెక్టర్‌లుగా నియమించారు. తక్కిన ఆరుగురు కూడా ఇప్పటికే పాలనలో తమ ప్రత్యేకతను నిలుపుకుంటూ, సామర్థ్యాన్ని నిరూపించుకుంటూ వస్తున్న అధికారులే. వీరంతా గత సోమవారమే కలెక్టర్లుగా బాధ్యతలు స్వీకరించారు. ఆ సందర్భంగా 'సాక్షి' ఈ ఎనిమిది మహిళా కలెక్టర్‌లతో మాట్లాడి, వారి ప్రాధాన్యాలను అడిగి తెలుసుకుంది.**

– తెలంగాణ నెట్‌వర్క్, సాక్షి

### ఫిర్యాదులకు ప్రాముఖ్యం

వెనుకబడిన నారాయణపేట జిల్లా ప్రాంతాన్ని ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజల భాగస్వామ్యంతో అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తాను. ప్రభుత్వం చేపడుతున్న ప్రజాసంక్షేమ పథకాలను అర్హులైన వారందరికి చేరేలా చూస్తాను. ఈ ప్రాంతంలో విద్య, వైద్యంతో పాటు గ్రామీణ, పట్టణాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తాను. ప్రధానంగా భూ సమస్యలు, ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులు, పచ్చదనం, పరిశుభ్రత, హరితహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాను.

– **హరిచందన దాసరి**, నారాయణపేట జిల్లా కలెక్టర్

### అవినీతి రహిత పాలన



ప్రజా సమస్యల పరిష్కారం నా తొలి ప్రాధాన్యం. ప్రభుత్వ శాఖల వారీగా.. క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తాం. సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలకు సక్రమంగా అందేలా చూస్తాం. అవినీతి రహిత పాలన అందిస్తాం. అభివృద్ధిలో జిల్లాను ప్రథమశ్రేణిలో నిలిపేందుకు ఆయా ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి సమష్టిగా పని చేస్తాం.

– **షేక్ యాస్మిన్ బాషా**, వనపర్తి జిల్లా కలెక్టర్

### పల్లె ప్రగతికి ప్రాధాన్యం



ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడమే నా ప్రాధాన్యత. ప్రస్తుతం పల్లె ప్రగతికి తొలి ప్రాముఖ్యం. మెరుగైన పాలనను అందిస్తా. కొత్త జిల్లాలతో పరిపాలన ప్రజలకు చేరువైంది. ప్రభుత్వ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేలా చూస్తాం. అవినీతి అనే దానికి ఆస్కారమే లేదు. సీఎం కేసీఆర్ తరహాలోనే ఒక విజన్ తో పనిచేస్తాం. అధికారులపై వేధింపులుండవు. అలాగని విధుల్లో రాజీ పడేది లేదు.

– **సిక్తా పట్నాయక్**, పెద్దపల్లి జిల్లా కలెక్టర్

### విద్య, వైద్యం, భూ పరిరక్షణ

సమాజంలో మానవుడి మనుగడకు విద్య, వైద్యం ఎంతో అవసరం. అక్షరాస్యులైతే భవిష్యత్తును చక్కగా తీర్చిదిద్దుకోవచ్చు. వైద్య సేవలు అందుబాటులో ఉంటే సంపూర్ణ ఆరోగ్యంతో ఉండొచ్చు. అందుకే ఈ రెండు రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తాను. అంగన్‌వాడీలను సైతం బలోపేతం చేస్తాను. జిల్లాలో ప్రభుత్వ భూముల పరిరక్షణ కూడా మా లక్ష్యాలలో ఉంది.

– **శ్వేత మహంతి**, హైదరాబాద్ జిల్లా కలెక్టర్

### బాలికలకు మార్షల్ ఆర్ట్స్



నేను సివిల్ సర్వీసులోకి రావడానికి మా నాన్న కారణం. అమెరికాలో ఉంటే ఇక్కడకు తీసుకువచ్చారు. 2009లో గ్రూప్ –1 రాసి తొలి ప్రయత్నంలోనే సెలెక్ట్ అయ్యాను. కలెక్టర్ గా జనగామ నాకు మొదటి పోస్టింగ్. మన రాష్ట్ర ప్రభుత్వం చాలా పథకాలను అమలు చేస్తోంది. మిషన్ భగీరథ, డబుల్ బెడ్ రూం ఇళ్లు, పల్లె ప్రగతి, హరిత హారం, వైద్యం, విద్య వంటి అనేక కార్యక్రమాలు చేపడుతోంది. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలను ప్రజల దగ్గరికి తీసుకుపోవడమే నా ముందున్న ప్రధాన లక్ష్యం. విద్యలో జిల్లాను మొదటి వరుసలో నిలిపేందుకు ప్రయత్నిస్తాం. బాలికలకు మార్షల్ ఆర్ట్స్ నేర్పించడంపై దృష్టి పెడతాం. జిల్లా అక్షరాస్యత ను పెంచడానికి కృషి చేస్తాను.

– **కె. నిఖిల**, జనగామ జిల్లా కలెక్టర్

### అన్ని రంగాల్లో జిల్లా ప్రగతి



ప్రజల జీవితాల్లో మార్పు వచ్చేలా అంకిత భావంతో, నిబద్ధతతో పని చేస్తాను. జిల్లాను అన్ని రంగాల్లో ప్రథమస్థానంలో నిలబెట్టేలా చూస్తాను. ప్రజలు, అధికారులతో మమేకం అయి పని చేస్తాను. ప్రభుత్వ పథకాలను సఫలీకృతం చేసేందుకు పని చేస్తాను. అందరూ ఉత్సాహంగా పని చేస్తే ఆదర్శవంతమైన జిల్లాగా మనకు పేరొస్తుంది.

– **శ్రీదేవసేన**, అదిలాబాద్ జిల్లా కలెక్టర్

### మౌలిక సదుపాయాల కల్పన



జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తాను. పరిపాలన యంత్రాంగంతో పారదర్శకంగా, నిబద్ధతతో కలిసి ముందుకు సాగుతాను. జిల్లాలో మౌలిక సదుపాయాల కల్పన కు కృషి చేస్తాను. పారిశుధ్యం, హరితహారంపై ప్రత్యేక శ్రద్ధ ఉంటుంది. సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందేలా చర్యలు తీసుకుంటాం. పల్లెప్రగతిలో చేపట్టిన పనులు పూర్తి చేసేందుకు ప్రాధాన్యమిస్తాం.

– **శృతి ఓఝా**, గద్వాల జిల్లా కలెక్టర్

### పంటలకు ప్రోత్సాహం



వ్యవసాయ, ఉపాధి రంగాలకు తొలి ప్రాధాన్యం. అలాగే గ్రామీణాభివృద్ధి, పర్యాటక రంగం అభివృద్ధిపై దృష్టి పెడతాం. వికారాబాద్ హైదరాబాద్ కు సమీపంగా ఉన్నందున ఉద్యానవన పంటలైన కూరగాయలు, పూలకు ఎక్కువగా మార్కెటింగ్ అవకాశాలువుంటాయి కనుక రైతులు ఉద్యానవన పంటలు సాగుచేసేలా ప్రోత్సహిస్తాం.

– **పౌసమి బసు**, వికారాబాద్ జిల్లా కలెక్టర్

epaper.sakshi.com

సాక్షి ఫ్యామిలీ
సినిమా నల్లగొండ
గురువారం ॥ 6-2-2020



“నా కెరీర్ ప్రారంభం నుంచి కూడా నేను పేరుకోసమే పని చేశాను. ఒక సినిమా చేయాలా? వద్దా? అనే నా నిర్ణయాన్ని డబ్బు ప్రభావితం చేయలేదు. కొత్త సినిమాని ఒప్పకునేముందు ఆ సినిమా వల్ల నాకు ఎంత పేరు వస్తుందని మాత్రమే ఆలోచించుకుని నా వంతు కష్టపడ్డాను. డబ్బు ఆటోమేటిక్‌గా వచ్చేసింది(నవ్వుతూ)” అని సమంత అన్నారు. శర్వానంద్, సమంత జంటగా సి. ప్రేమ్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘జాను’. తమిళంలో హిట్ సాధించిన ‘96’ చిత్రానికి ‘జాను’ తెలుగు రీమేక్. ‘96’ చిత్రాన్ని తెరకెక్కించిన ప్రేమ్‌కుమారే ‘జాను’ సినిమాని డైరెక్ట్ చేశారు. ‘దిల్’ రాజు నిర్మించిన ఈ చిత్రం రేపు(శుక్రవారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా సమంత చెప్పిన విశేషాలు...

# పేరు కోసమే కష్టపడ్డాను

‘రంగస్థలం’ తర్వాత సమంత ఏం చేసినా హిట్ అయిపోతుందన్నారు. ఆ సినిమాలో నా క్యారెక్టరైజేషన్, కొంచెం కథ తెలుసంతే. ఎంటైర్ స్క్రిప్ట్ తెలియదు. ఇప్పుడు నేను సినిమాలను చాలా తెలివిగా ఎంచుకుంటున్నాని అంటున్నారు. కానీ అది అలా జరుగుతోందంతే.

- ‘జాను’ ఇద్దరు వ్యక్తుల కథ. నాకైతే చాలా పెద్ద సినిమా చేశాననిపించింది. ఎక్కువ రిస్క్ అనిపించింది. నా 100 పర్సెంట్ ఎఫర్ట్ పెట్టాను. ‘96’ సినిమా బాగా నచ్చింది. ఆ చిత్రంలో విజయ్ సేతుపతి బాగా చేశారన్నారు. నాకైతే ‘96’ త్రిష గారి సినిమా అనిపించింది. ఈ సినిమా రీమేక్‌లో నటించకూడదని తొలుత అనుకున్నాను. ‘దిల్’ రాజుగారు అడగడంతో కాదనలేకపోయాను. కానీ ‘జాను’ సినిమా చేయకపోతే నా కెరీర్‌లో ఒక మంచి సినిమా కోల్పోయేదాన్ని.. పశ్చాత్తాపం చెందాల్సి వచ్చేది.
- త్రిషగారి నటనను కాపీ చేయలేదు. సినిమాలోని పాత్రని అర్థం చేసుకుని నా శైలిలో విభిన్నంగా నటించాను. అది స్క్రీన్‌పై ఎంత వర్కవుట్ అయ్యిందన్నది ప్రేక్షకులు చెబుతారు. నేను చాలా కష్టపడ్డాను. స్క్రిప్ట్‌ను చాలా సార్లు చదివాను. నాకైతే పూర్తి నమ్మకం ఉంది. విడుదల తర్వాత ప్రేక్షకులు కూడా నమ్ముతారని ఆశిస్తున్నాను. ‘96’లాంటి సినిమాలను రీమేక్ చేయడం కష్టం. కానీ ప్రేమ్‌కుమారే తెరకెక్కించడంతో ఆ మ్యాజిక్‌ను రీ–క్రియేట్ చేశారనిపించింది.
- స్క్రిప్ట్ ప్రకారం నా నటన బట్టే శర్వాగారి నటన ఉంటుంది. అందుకే ఒకరికొకరు సహాయం చేసుకుని బెస్ట్ ఔట్‌పుట్ రావడం కోసం కష్టపడ్డాం.. శర్వా బాగా నటించారు. క్లైమాక్స్ మార్చడం కోసం షూటింగ్‌ను ఆపేశామనే వార్తల్లో నిజం లేదు. శర్వాగారికి ఆరోగ్యం సహకరించనప్పుడు కొంత షూట్ ఆపాం. ఆ తర్వాత మొదలైన ఒక్క షెడ్యూల్‌లోనే సినిమాను పూర్తి చేశాం.

‘ది ఫ్యామిలీమేన్ సీజన్ 2’ వెబ్ సిరీస్‌లో కొత్త సమంతను చూస్తారు. చాలా కష్టపడ్డాను. నేను ఒక్కషాట్‌లో కూడా డూప్ వాడలేదు. అప్పుడు అనుకున్నాను.. సినిమాలో ఫైట్స్ కోసం హీరోలు ఇంత కష్టపడతారా అని!. ఇందులో నేను చేసిన పాత్రను ఇదివరకు చేయలేదు.

- నా కెరీర్‌లో పది సంవత్సరాలు గడిచిపోయాయి. కాలం గడిచేకొద్దీ కొత్త హీరోయిన్లు వస్తుంటారు. ట్రెండ్ మారిపోతుంటుంది. కొందర్ని బెటర్ పెర్ఫార్మెన్స్ అంటారు.. ఇంకొందర్ని బ్యూటిఫుల్ అంటారు. కానీ వీలైనంత కాలం నా పేరు నిలిచిపోవాలని నేను కోరుకుంటున్నాను. అందుకు తగ్గట్లు కష్టపడుతున్నాను. నేను చేసే ప్రతి సినిమా నా మొదటిదిగా భావిస్తాను. నా నటన, నా ప్రవర్తన పట్ల సినిమా యూనిట్ సంతోషంగా ఉన్నారో లేదో కూడా ముఖ్యమే.
- ప్రమోషన్స్ ఎంతవరకు సినిమా కలెక్షన్స్‌ను ప్రభావితం చేస్తాయో నాకు తెలియదు. కానీ నేను ఒక చోటుకు వెళ్లి సినిమాను ప్రమోట్ చేయడం వల్ల పది టిక్కెట్లైనా అమ్ముడు పోతాయంటే వెళ్లి ప్రమోట్ చేస్తాను. ఎందుకంటే ఒక నిర్మాత నన్ను నమ్మి, ఇంత పారితోషికం ఇచ్చినప్పుడు చేయాలి. మూవీ విడుదలై, విజయం సాధిస్తే నేను ఫోన్ లిఫ్ట్ చేయను (సరదాగా). అదే రిలీజ్‌కు ముందు అయితే నాకు వీలైనంత ప్రమోషన్ చేస్తాను. రిలీజ్ టైమ్‌లో సినిమా ఫలితం గురించి కాస్త ఆందోళనకి గురవుతా.
- నా చదువు పట్ల మా అమ్మగారు మరీ స్ట్రిక్ట్‌గా ఉండేవారు కాదు. కానీ, నేను ఫుల్ మార్క్స్ రావాలని కోరుకుంటాను. 12వ తరగతిలో అకౌంట్స్‌లో 200కి 199 మార్కులు రావడంతో బాగా ఏడ్చాను. నేను ఫెయిల్ అయ్యానని మా అమ్మ అనుకున్నారు. అసలు విషయం తెలియడంతో సైలెంట్‌గా వెళ్లిపోయారు.
- నా సినిమాలను చూడమని నా స్నేహితులకు చెబుతుంటాను. నేను గ్రాడ్యుయేషన్ చేసేటప్పుదు మాది గర్ల్స్ కాలేజ్. చాలా స్ట్రిక్ట్. ఎవరూ టీవీ, ఇండస్ట్రీ అంటూ ఉండేవారు కాదు. కానీ, నేను చేసే దాన్ని. సినిమాలకే కాదు.. కుటుంబానికీ సమయం కేటాయించాలనుకుంటున్నాను. ఒక ఆర్టిస్టుగా నేను సాధించే విజయాల కన్నా కూడా నా వ్యక్తిత్వం గురించి మా కుటుంబ సభ్యులు గర్వంగా ఫీల్ అవుతారు.



● ప్రభాస్

## మరోసారి?

హీరో ప్రభాస్, దర్శకుడు రాజమౌళిది బ్లాక్‌బస్టర్ కాంబినేషన్. వీళ్ల కలయికలో వచ్చిన ‘ఛత్రపతి’ పెద్ద హిట్ అయింది. ఆ తర్వాత వచ్చిన ‘బాహుబలి’ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ప్రభాస్‌కి ప్యాన్ ఇండియా పాపులారిటీ తెచ్చిపెట్టింది. కలెక్షన్లు సంపాదించుకోవడానికి ఇండస్ట్రీకి కొత్త మార్కెట్లు చూపెట్టింది. కాగా, మరోసారి ప్రభాస్– రాజమౌళి కాంబినేషన్‌లో సినిమా ఉండబోతోందని ఇండస్ట్రీ టాక్. వారిద్దరూ కలసి ఓ నిర్మాణ సంస్థను ప్రారంభించాలనే ఉద్దేశంలో ఉన్నారని సమాచారం. ఆ నిర్మాణ సంస్థలో తొలి సినిమా వీళ్ల కాంబినేషన్‌లోనే చేయాలనుకుంటున్నారట. ఈసారి పక్కా కమర్షియల్ సినిమా చేయాలనుకుంటున్నారనీ, 2021 చివర్లో ఈ సినిమా ప్రారంభమయ్యే అవకాశం ఉందనే వార్త ప్రచారంలో ఉంది.

## సంక్రాంతికి సై



● ఎన్టీఆర్, రాజమౌళి, రామ్‌చరణ్

దర్శకుడు రాజమౌళి తన పందెంకోళ్లను వచ్చే ఏడాది సంక్రాంతికి బాక్సాఫీస్ బరిలో దించడానికి నిర్ణయించుకున్నారు. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి తెరకెక్కిస్తున్న పీరియాడికల్ చిత్రం ‘ఆర్‌ఆర్‌ఆర్’. డీవీవీ దానయ్య నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఈ ఏడాది జూలై 30న విడుదల చేయాలనుకుంటున్నట్లు ముందుగా ప్రకటించారు. ఆ తర్వాత సినిమా వాయిదా పడిందనే వార్తలు కూడా వినిపించాయి. తాజాగా ఈ సినిమాను జనవరి 8, 2021 విడుదల చేయనున్నట్లు ప్రకటించింది చిత్రబృందం. ‘‘ప్రేక్షకులకు మునుపెన్నడూ లేని అనుభవాన్ని అందించాలని మా టీమ్ అందరం కష్టపడుతున్నాం. వాయిదా పడటం నిరుత్సాహం కలిగించే వార్తే కానీ మా బెస్ట్ ఇవ్వడానికి ప్రయత్నిస్తూనే ఉంటాం’’ అని ‘ఆర్‌ఆర్‌ఆర్’ బృందం ట్వీటర్‌లో పేర్కొంది.




● కాజల్ అగర్వాల్

● చెల్లి నిషా అగర్వాల్‌తో...

## మైనపు బొమ్మ

కాజల్ అగర్వాల్ మర్చిపోలేని రోజు ఫిబ్రవరి 5, 2020. సింగపూర్‌లోని మేడమ్ తుస్సాడ్స్ మ్యూజియంలో మైనపు బొమ్మగా మారిపోయిన రోజు. సింగపూర్‌లో బుధవారం తన మైనపు విగ్రహాన్ని ఆవిష్కరించారు కాజల్. మేడమ్ తుస్సాడ్స్‌లో సౌత్ నుంచి మైనపు బొమ్మగా చోటు సంపాదించుకున్న తొలి హీరోయిన్ కాజల్ కావడం విశేషం. ‘‘ఈ గుర్తింపుని అందించిన మేడమ్ తుస్సాడ్స్ సంస్థకు ధన్యవాదాలు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పర్సనాలిటీల మధ్య నా మైనపు బొమ్మ కూడా ఉండటం గౌరవంగా ఉంది’’ అని పేర్కొన్నారు కాజల్ అగర్వాల్.

## ప్రేమ.. వినోదం



● కల్యాణ్ దేవ్

‘విజేత’ చిత్రంతో హీరోగా పరిచయమయిన చిరంజీవి చిన్నల్లుడు కల్యాణ్ దేవ్ ప్రస్తుతం ‘సూపర్ మచ్చి’ అనే చిత్రంలో నటిస్తున్నారు. తాజాగా తన మూడో చిత్రం కూడా ఖరారైంది. ‘దూకుడు, నమో: వెంకటేశాయ, పూలరంగడు, లౌక్యం’ వంటి సినిమాలకు కథ, మాటలు అందించిన రచయిత శ్రీధర్ సీపాన ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. జీఏ2 పిక్చర్స్ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ ఈ సినిమాను నిర్మించనున్నారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. ఈ సినిమా షూటింగ్ మార్చిలో ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ–‘‘రచయితగా నాకున్న అనుభవంతో ఓ మంచి కథను నేను దర్శకుడిగా పరిచయం కావడానికి సిద్ధం చేసుకున్నాను. ఈ కథకు కళ్యాణ్ దేవ్ సరైన కథానాయకుడనిపించింది. ప్రేమతో కూడిన వినోదభరితమైన చిత్రం ఇది. నాపై నమ్మకం ఉంచి, దర్శకునిగా అవకాశం ఇచ్చిన దర్శక–నిర్మాతల గౌరవాన్ని పెంచగలననే నమ్మకం ఉంది’’ అన్నారు.

## మిస్టరీని ఛేదిస్తూ..



● మంచు విష్ణు

అతిపెద్ద ఐటీ కుంభకోణాల్లో ఒకటిగా నిలిచిన స్కామ్ వెనుక ఉన్న మిస్టరీని ఛేదిస్తున్నారు మంచు విష్ణు. ఆ ప్రయాణంలోనే లాస్ ఏంజెల్స్ కూడా వెళ్లారు. మరి తనకి కావాల్సిన సమాచారం దొరికిందా? వేచి చూడాలి. మంచు విష్ణు హీరోగా కాజల్ అగర్వాల్, సునీల్ శెట్టి ముఖ్య పాత్రల్లో తెరకెక్కుతున్న చిత్రం ‘మోసగాళ్లు’. జెఫ్రీ గీ చిన్ దర్శకుడు. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం లాస్ ఏంజెల్స్‌లో జరుగుతోంది. పది రోజులు సాగే ఈ షెడ్యూల్‌లో విష్ణుపై కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. ఇండో–హాలీవుడ్ ప్రాజెక్ట్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాలో విష్ణు పాత్ర చాలా ఇంటెన్స్‌గా ఉంటుందట. వేసవిలో ఈ చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నారు.



● ధన్సిక

## యూత్‌ఫుల్ ఎంటర్ టైనర్

‘కబాలి’ ఫేమ్ సాయి ధన్సిక ప్రధాన పాత్రలో తెరకెక్కనున్న చిత్రానికి బుధవారం కొబ్బరికాయ కొట్టారు. ఈ చిత్రంతో హరి కొలగాని దర్శకుడిగా పరిచయమవుతున్నారు. శ్రీ సాయి లక్ష్మీ క్రియేషన్స్ పతాకంపై పి.యస్.ఆర్ కుమార్ (వైజాగ్ బాబ్జి) నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభం అయ్యింది. తొలి సన్నివేశానికి నిర్మాత బి.వి.యస్. ఎన్. ప్రసాద్ కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు వీవీ వినాయక్ క్లాప్ ఇచ్చారు. నిర్మాత ‘దిల్’ రాజు తొలి సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. పి.ఎస్.ఆర్ కుమార్ (వైజాగ్ బాబ్జి) మాట్లాడుతూ–‘‘డిస్ట్రిబ్యూటర్‌గా తెలుగు సినిమా పరిశ్రమతో నాకు చాలా అనుబంధం ఉంది. నేను నిర్మాతగా మారడంలో బెక్కం వేణుగోపాల్ ప్రోత్సాహం ఎంతో ఉంది’’ అన్నారు. ‘‘శబ్దాలయా, అన్నపూర్ణ సంస్థలలో డైరెక్షన్ డిపార్ట్ మెంట్‌లో పనిచేశాను. యూత్‌ఫుల్ ఎంటర్ టైనర్‌గా రూపొందనున్న చిత్రమిది. ఈ చిత్రం ఫస్ట్ షెడ్యూల్ నేటి నుంచి ప్రారంభమై ఇరవై రోజుల పాటు హైదరాబాద్‌లో జరుగుతుంది’’ అన్నారు హరి కొలగాని. ‘‘ఈ సినిమాలో కొత్తగా కనిపిస్తాను’’ అన్నారు సాయి ధన్సిక. ఈ చిత్రానికి సమర్పణ: వాగేశ్వరి (పద్మ), కెమెరా: వాస్లి శ్యాం ప్రసాద్, సంగీతం: శేఖర్ చంద్ర, సహ నిర్మాతలు: పవన్, సుమన్, లైన్ ప్రొడ్యూసర్: వెంకట యస్‌కె కులపాక.

## పిట్టకథే కానీ పెద్ద కథ



● బ్రహ్మాజీ, విశ్వంత్, నిత్యాశెట్టి, సంజయ్‌రావ్

‘‘పిట్టకథ టైటిల్ చాలా బాగుంది. ఇండస్ట్రీలో ఈ మధ్య పిట్టకథ గురించే చర్చ జరుగుతోంది. ఇది పిట్టకథే కానీ చాలా పెద్ద కథ అని నమ్ముతున్నాను. ‘ఓ పిట్టకథ’ ఈ వేసవిలో ప్రేక్షకులకు చల్లటి ఉపశమనం ఇస్తుంది’’ అని డైరెక్టర్ కొరటాల శివ అన్నారు. విశ్వంత్ దుద్దుంపూడి, సంజయ్‌రావు, నిత్యాశెట్టి, బ్రహ్మాజీ ముఖ్య తారలుగా చెందు ముద్దు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘ఓ పిట్టకథ’. భవ్య క్రియేషన్స్ పతాకంపై వి.ఆనంద ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా క్యారెక్టర్స్ పోస్టర్‌ను కొరటాల శివ ఆవిష్కరించారు. చెందు ముద్దు మాట్లాడుతూ– ‘‘ఒక పల్లెటూరులో జరిగే కథ ఇది. వినోదం, ఉత్కంఠను రేకెత్తిస్తుంది’’ అన్నారు. ‘‘సినిమా చాలా బాగా వచ్చింది’’ అన్నారు వి.ఆనందప్రసాద్. ‘‘మార్చిలో సినిమా విడుదల చేస్తున్నాం’’ అన్నారు ఎగ్జిక్యూటివ్ నిర్మాత అన్నే రవి. ఈ చిత్రానికి కెమెరా: సునీల్ కుమార్ యన్, సంగీతం: ప్రవీణ్ లక్కరాజు.

## ఇండస్ట్రీలోని త్రీ మంకీస్ మేమే



● ‘గెటప్’ శ్రీను, రాంప్రసాద్, ‘సుడిగాలి’ సుధీర్

‘‘ఇండస్ట్రీలో ఎంతో మంది పెద్ద వాళ్లున్నా నన్ను, మంచు లక్ష్మి, అలీని ఎందుకు పిలిచారు? మేం ముగ్గురం చేసే పిచ్చి చేష్టలు ఊహించుకొని, ఇండస్ట్రీలో ఉన్న త్రీ మంకీస్ మేమే అని మమ్మల్ని పిలిచినట్టున్నారు’’ అని డైరెక్టర్ కె.రాఘవేంద్రరావు అన్నారు. ‘జబర్దస్త్’ ఫేమ్ ‘సుడిగాలి’ సుధీర్, ‘గెటప్’ శ్రీను, రాంప్రసాద్ ముఖ్య తారలుగా తెరకెక్కిన చిత్రం ‘3 మంకీస్’. కారుణ్య చౌదరి హీరోయిన్‌గా నటించారు. అనిల్ కుమార్ జి. దర్శకత్వంలో నగేష్ .జి నిర్మించిన ఈ సినిమా రేపు విడుదల కానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో రాఘవేంద్రరావు మాట్లాడుతూ– ‘‘సరిలేరు నీకెవ్వరు, శ్రీమంతుడు, ఘరానా బుల్లోడు’ లాంటి టైటిల్స్ ఏ హీరోకి పెట్టినా సరిపోతాయి. ‘3 మంకీస్’ టైటిల్ మాత్రం వీరికి తప్పితే మరెవరికీ పనికిరాదు’’ అన్నారు. ‘‘సినిమాలో నటించడం కంటే ‘జబర్దస్త్’ లో చేయడమే కష్టం’’ అన్నారు మంచు లక్ష్మి. ‘‘చిన్న సినిమాలను బతికిస్తే ఇండస్ట్రీతో పాటు చిన్న దర్శకులు బాగుంటారు’’అన్నారు నటుడు అలీ. ‘‘మా సినిమా అందరికీ కచ్చితంగా నచ్చుతుంది’’ అన్నారు నగేష్. ‘‘ఇలాంటి పాత్ర చేస్తానని జీవితంలో అనుకోలేదు’’ అన్నారు రాంప్రసాద్. ‘‘మా ముగ్గురికీ ఇంతకన్నా మంచి ప్రాజెక్ట్ రాదు’’ అన్నారు ‘సుడిగాలి’ సుధీర్. ‘‘ఈ ప్రపంచంలో సాయం అనే మందు లేక చాలా మంది చనిపోతున్నారని మా చిత్రంలో చెప్పాం’’ అన్నారు అనిల్. హీరో ఆకాష్ పూరి, కారుణ్య చౌదరి, రచయిత అరుణ్, కెమెరామేన్ సన్నీ మాట్లాడారు.







# సాక్షి భవిత

సోమవారం నుంచి శుక్రవారం వరకు

స్పర్ధయా వర్ధతే విద్య

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

గురువారం
6-2-2020


ఎస్‌ఎస్‌బీ ఇంటర్వ్యూ



# బలమైన వ్యక్తిత్వంతోనే విజయం!

**త్రివిధ దళాలు.. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్. యూపీఎస్సీ నిర్వహించే సీడీఎస్‌ఈ, ఎన్‌డీఏ, ఎన్ఏ రాత పరీక్షలు, ఏఎఫ్‌క్యాట్, టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ పరీక్షలు.. ఇవన్నీ త్రివిధ దళాల్లో అడుగుపెట్టేందుకు తొలిదశ మాత్రమే. ఇందులో మెరిట్ జాబితాలో నిలిచిన అభ్యర్థులు.. అత్యంత కీలకమైన ఎంపిక ప్రక్రియ.. సర్వీస్ సెలక్షన్ బోర్డ్(ఎస్‌ఎస్‌బీ) ఇంటర్వ్యూలోనూ సత్తా చాటాలి. రాత పరీక్ష కంటే క్లిష్టమైనదిగా భావించే ఎస్‌ఎస్‌బీ ఎంపిక ప్రక్రియలో ఐదు రోజులపాటు అనేక కోణాల్లో అభ్యర్థిని పరీక్షిస్తారు. ఈ నేపథ్యంలో.. ఎస్‌ఎస్‌బీ ఇంటర్వ్యూ ప్రక్రియ ఎలా ఉంటుందో తెలుసుకుందాం..**

**రాత పరీక్షల విజేతలకు మలి దశలో ఎస్‌ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ ● అయిదు రోజుల పాటు మానసిక, శారీరక ధ్రుఢత్వ పరీక్షలు ● వీటిలో నెగ్గితేనే త్రివిధ దళాల్లో ఆఫీసర్ కొలువు**

ఎస్‌ఎస్‌బీ ఎంపిక ప్రక్రియను ఇంటెలిజెన్స్ అండ్ పర్సనాలిటీ టెస్ట్‌గా పేర్కొంటారు. రాత పరీక్షల్లో ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌కు ఎంపికైన అభ్యర్థులకు ఆయా విభాగాలు ప్రత్యేకంగా, వేర్వేరుగా ఎస్‌ఎస్‌బీ ఇంటర్వ్యూలను నిర్వహిస్తాయి. రాత పరీక్షల్లో విజయం సాధించిన అభ్యర్థులకు సంబంధిత విభాగాలు.. ఎస్‌ఎస్‌బీ ఇంటర్వ్యూకు హాజరు కావాలని ప్రత్యేకంగా సమాచారం ఇస్తాయి.

## అయిదు రోజులు.. 15 లక్షణాలు

ఎస్‌ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ అయిదు రోజుల పాటు కొనసాగుతుంది. ఈ మొత్తం ప్రక్రియలో అభ్యర్థుల్లోని, వ్యక్తిగత, మానసిక, శారీరక ధ్రుఢత్వాలకు సంబంధించి మొత్తం 15 లక్షణాలను పరీక్షిస్తారు. ఇందుకోసం గ్రూప్ డిస్కషన్, సైకలాజి కల్ టెస్ట్‌లు నిర్వహిస్తారు. మొత్తంగా సదరు విభాగాల్లో ఆఫీసర్లకు ఉండాల్సిన లక్షణాలను (ఆఫీసర్స్ లైక్ క్వాలిటీస్) పరీక్షించే విధంగా ఈ ప్రక్రియ జరుగుతుంది.

## ముందుగా రిపోర్టింగ్

ఎస్‌ఎస్‌బీ ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థులు ముందుగా సంబంధిత కేంద్రం వద్ద అధీకృత అధికారి ముందు హాజరవ్వాల్సి ఉంటుంది. సదరు అధికారి ఎస్‌ఎస్‌బీ ఎంపిక ప్రక్రియపై అభ్యర్థులకు అవగాహన కల్పిస్తారు. ఇదే సమయంలో డాక్యుమెంట్ వెరిఫికేషన్ (అభ్యర్థుల అకడమిక్ ధ్రువ పత్రాలు, రాత పరీక్ష ఫలితాల పత్రాలు తదితర)కూడా జరుగుతుంది. ఆ తర్వాత రోజు నుంచి అయిదు రోజుల ఎంపిక ప్రక్రియలో.. తొలిరోజు ప్రక్రియ మొదలవుతుంది. ఎయిర్‌ఫోర్స్, అదే విధంగా కొన్ని టెక్నికల్ ఎంట్రీ స్కీమ్‌ల విషయంలో మాత్రం సర్టిఫికెట్ వెరిఫికేషన్ రోజు నుంచే ఎస్‌ఎస్‌బీ ప్రక్రియ ప్రారంభమవుతుంది.

## మొదటి రోజు మూడు పరీక్షలు

- మొత్తం అయిదు రోజుల ఎస్‌ఎస్‌బీ ఎంపిక ప్రక్రియలో.. మొదటి రోజున అభ్యర్థులు మూడు పరీక్షలకు హాజరు కావాల్సి ఉంటుంది. అవి.. ● ఆఫీసర్ ఇంటెలిజెన్స్ రేటింగ్ టెస్ట్ (పేపర్-1, పేపర్-2), ● పిక్చర్ పర్సెప్షన్ టెస్ట్ , ● డిస్కషన్ టెస్ట్.
- పేపర్-1, పేపర్-2లుగా నిర్వహించే ఆఫీసర్ ఇంటెలిజెన్స్ రేటింగ్ టెస్ట్ ప్రధాన ఉద్దేశం.. అభ్యర్థి వ్యక్తిత్వం, పోటీతత్వ లక్షణాలను పరీక్షించడం. రెండు పేపర్లలోనూ వెర్బల్, నాన్-వెర్బల్ రీజనింగ్ టాపిక్స్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. ప్రతి పేపర్‌లో 40 ప్రశ్నలు అడుగుతారు. పేపర్-1కు 22 నిమిషాలు, పేపర్-2కు 17 నిమిషాల వ్యవధిలో సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇందులో పొందిన మార్కులు, చూపిన ప్రతిభ ఆధారంగా అభ్యర్థులకు అయిదు రకాలుగా(ఔట్ స్టాండింగ్, ఎక్సలెంట్, ఎబోవ్ యావరేజ్, యావరేజ్, బిలో యావరేజ్) రేటింగ్స్ ఇస్తారు. తర్వాత దశలో నిర్వహించే పిక్చర్ పర్సెప్షన్, డిస్కషన్ టెస్ట్‌లలో పొందిన మార్కులకు ఈ రేటింగ్స్‌ను కూడా కలుపుతారు. కాబట్టి ఇంటెలిజెన్స్ రేటింగ్ టెస్ట్ ఎంతో కీలకంగా మారుతోంది.
- **పిక్చర్ పర్సెప్షన్ టెస్ట్:** మొదటి రోజు రెండో ప్రక్రియ పిక్చర్ పర్సెప్షన్ టెస్ట్. ఇందులో అభ్యర్థుల ముందు ఒక సందర్భం లేదా సన్నివేశానికి సంబంధించిన చిత్రాన్ని 30 సెకన్లపాటు ప్రదర్శిస్తారు. ఆ చిత్రంలోని అంశాల ఆధారంగా అభ్యర్థులు నాలుగు నిమిషాల వ్యవధిలో ఒక చిన్న స్టోరీ రాయాల్సి ఉంటుంది. ఇందులో అభ్యర్థులు ఆ చిత్రం ప్రాధాన్యత, అందులో కనిపించిన సన్నివేశం, సందర్భం, ఆ చిత్రం సారాంశం గురించి వివరించాల్సి ఉంటుంది. అభ్యర్థులను 10 నుంచి 18 మంది చొప్పున బృందాలుగా విభజిస్తారు.
- **గ్రూప్ డిస్కషన్ టెస్ట్:** పిక్చర్ పర్సెప్షన్ టెస్ట్‌లో ప్రతిభ ఆధారంగా విభజించిన బృందాలకు గ్రూప్ డిస్కషన్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులో అభ్యర్థులు తాము రాసిన స్టోరీ(వివరణ) గురించి మౌఖికంగా చర్చించాల్సి ఉంటుంది. ప్రతి బృందంలోని అభ్యర్థులందరూ ఆ చిత్రానికి సంబంధించి ఉమ్మడి అభిప్రాయానికి వచ్చే విధంగా ఉండాలి. ఈ మూడు టెస్ట్‌లలో అభ్యర్థుల ప్రతిభ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసి.. తదుపరి దశలో జరిగే టెస్ట్‌లకు ఎంపిక చేస్తారు.

## రెండో రోజు.. సైకాలజీ టెస్ట్

రెండో రోజు సైకలాజికల్ టెస్ట్ నిర్వహిస్తారు. ముందుగా థీమాటిక్ అప్పెర్సెప్షన్ టెస్ట్, వర్డ్ అసెస్‌మెంట్ టెస్ట్, సిట్యుయేషన్ రియాక్షన్ టెస్ట్, సెల్ఫ్ డిస్క్రిప్షన్ టెస్ట్‌లు ఉంటాయి.

- థీమాటిక్ అప్పెర్సెప్షన్ టెస్ట్‌లో అభ్యర్థుల ముందు 12 చిత్రాలను ప్రదర్శిస్తారు. వాటిని చూసిన తర్వాత ఒక్కో చిత్రంపైనా నాలుగు నిమిషాల వ్యవధిలో స్టోరీ రాయాల్సి ఉంటుంది.
- వర్డ్ అసోసియేషన్ టెస్ట్‌లో 15 సెకన్ల వ్యవధిలో 60 పదాలను ప్రదర్శిస్తారు. ఆ పదాల ఆధారంగా అభ్యర్థులు ఒక అర్థవంతమైన వాక్యాన్ని రూపొందించాల్సి ఉంటుంది.
- **సిట్యుయేషన్ రియాక్షన్ టెస్ట్:** రెండో రోజు ఎంపిక ప్రక్రియలో నిర్వహించే సిట్యుయేషన్ రియాక్షన్ టెస్ట్ కొంత కీలకమైనదిగా పేర్కొనొచ్చు. ఈ టెస్ట్‌లో భాగంగా అభ్యర్థులకు 60 నిజ జీవిత సంఘటనలతో కూడిన బుక్‌లెట్‌ను ఇస్తారు. అభ్యర్థులు వీటికి సంబంధించి తమ అభిప్రాయాలను 30 నిమిషాల వ్యవధిలో రాయాల్సి ఉంటుంది. అభ్యర్థుల్లోని సమయస్ఫూర్తి, టైమ్ సెన్స్, వ్యక్తిత్వ వికాస స్థాయిని పరీక్షించడమే సిట్యుయేషన్ రియాక్షన్ టెస్ట్ ఉద్దేశం.
- **సెల్ఫ్ డిస్క్రిప్షన్ టెస్ట్:** ఈ టెస్ట్ సమయంలో అభ్యర్థులు వ్యక్తిగత సందర్భానికి సంబంధించిన అంశాలను రాయాల్సి ఉంటుంది. ఉదాహరణకు తమ తల్లిదండ్రులు, టీచర్లు, స్నేహితులపై తమకున్న అభిప్రాయం, వారు మెరుగుపరుచుకోవాల్సిన నైపుణ్యాలు వంటివి. దీనికి కేటాయించిన సమయం 15 నిమిషాలు.
- రెండో రోజు నాలుగు టెస్ట్‌లలో చూపిన ప్రతిభ ఆధారంగా షార్ట్ లిస్ట్ చేసి మూడో రోజు ఎంపిక ప్రక్రియకు అర్హులైన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు.

## మూడో రోజు.. గ్రూప్ టెస్టింగ్-1

మూడో రోజు గ్రూప్ టెస్టింగ్-1 పేరుతో నిర్వహించే ఈ ప్రక్రియలో అభ్యర్థులు ఔట్ డోర్, ఇన్‌డోర్ టెస్ట్‌లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. మూడో రోజు నిర్వహించే టెస్ట్‌ల వివరాలు...

- **గ్రూప్ డిస్కషన్:** ఏదైనా సమకాలీన అంశం లేదా సామాజిక అంశంపై 20 నుంచి 30 నిమిషాల వ్యవధిలో గ్రూప్ డిస్కషన్ నిర్వహిస్తారు.
- **గ్రూప్ ప్లానింగ్ ఎక్సర్‌సైజ్:** ఈ ప్రక్రియలో ముందుగా 10 నుంచి 15 మంది అభ్యర్థులతో వేర్వేరు బృందాలుగా విభజిస్తారు. ఆ తర్వాత వారికి ఏదైనా ఒక సమస్యతో కూడిన స్టోరీని పేర్కొంటారు. దీనికి అభ్యర్థులు ఆ స్టోరీలోని సమస్యలను గుర్తించడం, వాటికి పరిష్కారాలు కనుగొనడం చేయాల్సి ఉంటుంది.
- **ప్రోగ్రెసివ్ గ్రూప్ టాస్క్:** ఇది ఫిజికల్ యాక్టివిటీ టెస్ట్‌గా నిలుస్తోంది. ఈ ప్రక్రియలోనూ అభ్యర్థుల ముందు ఏవైనా నాలుగు వాస్తవ సమస్యలు ఇస్తారు. వాటికి పరిష్కారం చూపాల్సి ఉంటుంది. ఇవి సాధారణంగా ఔట్ డోర్ యాక్టివిటీస్‌గా ఉంటాయి. అదే విధంగా అభ్యర్థుల్లోని భౌతిక ధ్రుఢత్వాన్ని పరీక్షించేవిగా ఉంటాయి. బరువులు మోయడం, లాంగ్ జంప్ వంటి పోటీల్లో తమ సత్తా చూపాల్సి ఉంటుంది.
- **గ్రూప్ అబ్‌స్టాకిల్ రేస్:** ఇందులో అభ్యర్థులు నిర్ణీత బరువుతో కూడిన వస్తువుతో పాకుతూ నిర్ణీత హద్దును చేరుకోవాల్సి ఉంటుంది. దీనికి కూడా అభ్యర్థులను బృందాలుగా విభజిస్తారు. అభ్యర్థుల్లో బృంద స్ఫూర్తిని నింపే ఉద్దేశం, ఆ స్ఫూర్తి ఏ మేరకు ఉందో పరీక్షించడం ఈ గ్రూప్ అబ్‌స్టాకిల్ రేస్ లక్ష్యంగా నిలుస్తోంది.
- **హాఫ్ గ్రూప్ టాస్క్:** ఇది కూడా దాదాపు ప్రోగ్రెసివ్ గ్రూప్ టాస్క్ మాదిరిగానే ఉంటుంది. బృందాలు-అభ్యర్థుల సంఖ్య కొంత తక్కువగా ఉంటుంది. అదే విధంగా ఏదైనా ఒక అడ్డంకిని మాత్రమే దాటాల్సి ఉంటుంది.

## నాలుగో రోజు.. గ్రూప్ టెస్టింగ్-2

మూడో రోజు ఫిజికల్ యాక్టివిటీస్‌లో అభ్యర్థులు చూపిన ప్రతిభ ఆధారంగా నాలుగో రోజు గ్రూప్ టెస్టింగ్-2 పేరుతో పలు అంశాల్లో అభ్యర్థులను పరిశీలిస్తారు. అవి.. **లెక్చరెట్:** ఇందులో ప్రతి అభ్యర్థికి నాలుగు టాపిక్స్ ఇస్తారు. వాటి నుంచి తమకు ఆసక్తి ఉన్న ఏదో ఒక టాపిక్‌ను ఎంచుకొని ఆ టాపిక్‌పై మూడు నిమిషాల వ్యవధిలో మాట్లాడాల్సి ఉంటుంది.

- **ఇండివిడ్యువల్ అబ్‌స్టాకిల్స్:** ఈ దశలో ప్రతి అభ్యర్థికి 10 ఫిజికల్ టెస్ట్‌లు ఇస్తారు. మహిళా అభ్యర్థులైతే ఏడు టెస్ట్‌లు ఉంటాయి. వీటిలో ప్రధానంగా హై జంప్, బ్యారెల్ జంప్, డబుల్ జంప్, టార్జాన్ స్వింగ్, టైగర్ లీప్, రోప్ క్లైంబ్, కమాండో వాక్, స్క్రీన్ జంప్, మంకీ క్రాల్ తదితర టాస్క్‌లు ఉంటాయి. వీటిని మూడు నిమిషాల వ్యవధిలో పూర్తి చేయాల్సి ఉంటుంది. అభ్యర్థులు ఆయా టాస్క్‌లలో చూపిన ప్రతిభ ఆధారంగా 1 నుంచి పది మార్కులు కేటాయిస్తారు.
- **కమాండ్ టాస్క్:** ఇది ఒక విధంగా అభ్యర్థుల్లో క్షేత్ర స్థాయిలోని నాయకత్వ లక్షణాలు, భౌతిక ధ్రుఢత్వాన్ని పరిశీలించే టాస్క్‌గా పేర్కొనొచ్చు. ప్రతి అభ్యర్థి వాస్తవంగా ఒక కమాండర్‌గా తనకు తాను ఊహించుకుని ఒక టాస్క్‌ను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం తమ బృందం నుంచే ఇద్దరు లేదా ముగ్గురు సహచరులను తన సహాయకులుగా తీసుకునే అవకాశం కల్పిస్తారు. దీనిద్వారా అభ్యర్థులు తమకు ఇచ్చిన టాస్క్‌ను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇవి సాధారణంగా క్లైంబింగ్, మెటీరియల్ బ్రేకింగ్ వంటి అంశాలపై ఉంటాయి.
- **ఫైనల్ గ్రూప్ టాస్క్:** ఫిజికల్ యాక్టివిటీస్ టెస్ట్ విభాగంలో దాదాపు ఇది చివరిది. ఇందులో అభ్యర్థులందరూ కలిసి ఏదైనా ఒక ఫిజికల్ టాస్క్‌ను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాల్సి ఉంటుంది.
- **పర్సనల్ ఇంటర్వ్యూ:** నాలుగో రోజు చివరి ప్రక్రియ పర్సనల్ ఇంటర్వ్యూ. వాస్తవానికి రెండో రోజు, మూడో రోజు టాస్క్‌లు పూర్తయిన తర్వాత కూడా పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఆ సమయంలో సంబంధిత రోజున చేసిన టాస్క్‌లు, అభ్యర్థుల వ్యక్తిగత అనుభవం, వారికి కలిగిన అభిప్రాయాల గురించి అడుగుతారు. నాలుగో రోజు చివరి ప్రక్రియగా నిర్వహించే పర్సనల్ ఇంటర్వ్యూలో ఎస్‌ఎస్‌బీలో అప్పటి వరకు జరిగిన ప్రక్రియల్లో అనుభవాలు, అదే విధంగా వ్యక్తిగతంగా అకడమిక్ నేపథ్యం, కుటుంబ నేపథ్యం, అకడమిక్‌గా చూపిన ప్రతిభ, జనరల్ అవేర్‌నెస్ అంశాలపై అభ్యర్థులను ప్రశ్నిస్తారు.

## అయిదో రోజు.. కాన్ఫరెన్స్

- అభ్యర్థులకు పర్మనెంట్ కమిషన్ ర్యాంకు హోదాలో ఉద్యోగం కల్పించేందుకు తుది అంకం.. అయిదో రోజు. ఇందులో భాగంగా ఒకే ఒక్క అంశంలో అభ్యర్థులు పాల్గొనాల్సి ఉంటుంది. అది.. కాన్ఫరెన్స్.
- ఈ ప్రక్రియలో ముందుగా మూల్యాంకన చేసే అధికారి క్లోజింగ్ అడ్రస్(ముగింపు ప్రకటన) చేస్తారు. ఆ తర్వాత అభ్యర్థుల కాన్ఫరెన్స్ మొదలవుతుంది. తర్వాత అభ్యర్థుల ప్రతిభను మదింపు చేసిన అధికారులతో బోర్డ్ కాన్ఫరెన్స్ జరుగుతుంది. ఇందులో సదరు మూల్యాంకన చేసిన అధికారులు.. తమ పరిధిలోని అభ్యర్థుల్లోని సామర్థ్యాన్ని, సర్వీస్‌కు సరితూగే అంశాలను చర్చిస్తారు.
- ఆ తర్వాత అభ్యర్థులు వ్యక్తిగతంగా బోర్డ్ ముందు హాజరవ్వాల్సి ఉంటుంది. అక్కడే బోర్డ్ అధికారులు సదరు అభ్యర్థులకు వారు చూపిన ప్రతిభకు సంబంధించిన అంశాలను, తమ మూల్యాంకనను వివరిస్తారు. దానికి అనుగుణంగా సదరు అభ్యర్థులను సర్వీస్‌కు సిఫార్సు చేయడం జరుగుతుంది.
- అనంతరం మొత్తం అయిదు రోజుల ప్రక్రియలో పొందిన మార్కుల ఆధారంగా ఫలితాలు వెల్లడిస్తారు. షార్ట్ లిస్ట్‌లో నిలిచిన అభ్యర్థులకు తదుపరి దశలో వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.
- ఈ వైద్య పరీక్షల్లోనూ అన్ని రకాలుగా త్రివిధ దళాలకు సరితూగే విధంగా అభ్యర్థులు ఉన్నారని సంబంధిత వైద్యులు సిఫార్సు చేస్తే.. పర్మనెంట్ కమిషన్డ్ ర్యాంకు హోదాతో కొలువు ఖాయమైనట్లే.

## తక్కువ సంఖ్యలో ఎంపికవుతున్న అభ్యర్థులు

సీడీఎస్, ఎన్‌డీఏ, ఏఎఫ్‌క్యాట్ రాత పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన అభ్యర్థుల్లో చాలా తక్కువ మంది మాత్రమే ఎస్‌ఎస్‌బీ ఇంటర్వ్యూలో విజయం సాధించి త్రివిధ దళాల్లో అడుగు పెడుతున్నారు. ఎన్‌డీఏ 1- 2019లో 447 మంది మాత్రమే ఎస్‌ఎస్‌బీ ఇంటర్వ్యూలో విజయం సాధించారు. డిగ్రీ అర్హతగా నిర్వహించే సీడీఎస్ విషయంలో సీడీఎస్2-2018లో మూడు దళాలకు సంబంధించి కేవలం 295 మంది ఎస్‌ఎస్‌బీ ఎంపికలో విజేతలయ్యారు. ఏఎఫ్‌క్యాట్‌ను పరిశీలిస్తే.. జూలై 2019లో 114 మంది అభ్యర్థులు మాత్రమే మెరిట్ లిస్ట్‌లో నిలిచారు. ఇలా రాత పరీక్షలో విజయం సాధించినప్పటికీ ఎస్‌ఎస్‌బీలో రాణించలేకపోవడానికి కారణం.. ఈ ఎంపిక ప్రక్రియపై అవగాహన లేకపోవడమే. తెలుగు రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ వంటి పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు తమ ప్రిపరేషన్‌కు ఇంకొంచెం పదును పెట్టుకుంటే సీడీఎస్, ఎన్‌డీఏ పరీక్షల్లోనూ విజయం సాధించి.. ఆ తర్వాత ఎస్‌ఎస్‌బీ ఇంటర్వ్యూను కూడా సులభంగా ఛేదించే అవకాశం ఉంటుంది.



## ఉద్యోగ సమాచారం

### ఐఐటీ, గాంధీనగర్‌లో నాన్ టీచింగ్ పోస్టులు

గాంధీనగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)..నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 29
- **పోస్టుల వివరాలు:** డిప్యూటీ లైబ్రేరియన్, అసిస్టెంట్ లైబ్రేరియన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ తదితరాలు
- **అర్హత:** పోస్టును అనుసరించి ఇంటర్మీడియెట్, సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్స్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **ఎంపిక విధానం:** టెస్ట్/ప్రజెంటేషన్/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 05.03.2020
- **వెబ్‌సైట్:** http://iitgn.ac.in/


## ఇంటర్మీడియట్ ప్రత్యేకం

- ఇంటర్మీడియట్ ప్రీవియస్ పేపర్స్, మోడల్‌పేపర్స్, స్టడీ మెటీరియల్, ఎగ్జామ్స్ గైడెన్స్ మొదలైనవి... (EM& TM)

విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS
యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

నేటి టాబ్లాయిడ్ విద్య పేజీల్లో...
10th Class
SRIGAYATRI EDUCATIONAL INSTITUTIONS
MATHEMATICS


# అవుతారా.. పొలిటికల్ సైంటిస్ట్

**పొలిటికల్ సైన్స్‌కు వందల ఏళ్ల చరిత్ర ఉంది. గ్రీకు తత్వవేత్తలు అరిస్టాటిల్, ప్లేటోలను పొలిటికల్ సైన్స్‌కు ఆద్యులుగా చెబుతారు. అరిస్టాటిల్‌ను రాజనీతి శాస్త్ర పితామహుడిగా పేర్కొంటారు. ఆధునిక పొలిటికల్ సైన్స్ మాత్రం 19వ శతాబ్దంలో ఒక అకడెమిక్ సబ్జెక్టుగా రూపుదిద్దుకుంది. మన దేశంలో బీఏ పొలిటికల్ సైన్స్ విద్యార్థులు కోర్సులో భాగంగా రాజ్యాంగం, రాజకీయాలు, రాజకీయ వ్యవస్థ, ప్రభుత్వం గురించి అధ్యయనం చేస్తారు. వీటితోపాటు ప్రస్తుతం ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న అంతర్జాతీయ సమస్యలు, యుద్ధాలు, స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం వంటి అంశాలను పొలిటికల్ సైన్స్ విద్యార్థులు అభ్యసిస్తారు. త్వరలో బీఏ పొలిటికల్ సైన్స్ కోర్సును పూర్తిచేసుకోనున్న విద్యార్థులకు అందుబాటులో ఉన్న కెరీర్ మార్గాల గురించి తెలుసుకుందాం...**




### సివిల్ సర్వీసెస్

బీఏ పొలిటికల్ సైన్స్ విద్యార్థులు కోర్సులో చేరినప్పటి నుంచి సివిల్ సర్వీసు పరీక్షలతోపాటు, రాష్ట్ర స్థాయిలో పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లు నిర్వహించే గ్రూప్స్ పరీక్షలు రాయాలని లక్ష్యంగా పెట్టుకుంటారు. పొలిటికల్ సైన్స్ విద్యార్థులు సివిల్స్, గ్రూప్స్ పరీక్షల ప్రిలిమ్స్, మెయిన్స్‌లో ఉండే జనరల్ స్టడీస్ అంశాలపై త్వరగా పట్టుసాధించగలరు. తద్వారా మిగతా అభ్యర్థుల కంటే వీరు పోటీలో ముందు నిలిచే అవకాశం ఉంటుంది. వీరు సివిల్స్, గ్రూప్స్‌లో విజేతలుగా నిలవడం ద్వారా ఉన్నత ప్రభుత్వ ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు. ప్రభుత్వ రంగంలో ఉజ్వల కెరీర్, ఉద్యోగ భద్రతకు అవకాశం లభిస్తుంది.

### జర్నలిజం

ప్రస్తుతం యువతకు ఆకర్షణీయ వేతనాలతో విస్తృతంగా అవకాశాలు కల్పిస్తున్న రంగం మీడియా. వార్తా పత్రికలతోపాటు ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్ మీడియా రోజు రోజుకూ విస్తరిస్తుండటంతో మీడియా ఉద్యోగాలకు కేరాఫ్‌గా నిలుస్తోంది. బీఏ పొలిటికల్ సైన్స్ విద్యార్థులు సమాజంలోని సమస్యలను అవగాహన చేసుకోవడంతోపాటు సునిశితంగా విశ్లేషించే నైపుణ్యం కలిగి ఉంటారు. మీడియాలో ప్రచురిస్తున్న, ప్రసారం అవుతున్న వార్తలు, వార్తా కథనాల్లో ఎక్కువగా రాజకీయాలు, సామాజిక సమస్యలకు సంబంధించినవే. కాబట్టి పొలిటికల్ సైన్స్ విద్యార్థులకు జర్నలిజం ఉత్తమ కెరీర్‌గా చెప్పొచ్చు. పొలిటికల్ సైన్స్‌తో రిపోర్టర్లు, సబ్‌ఎడిటర్లు, న్యూస్ రీడర్లు, యాంకర్లుగా రాణించే అవకాశముంది.

### టీచింగ్

బీఏ పొలిటికల్ సైన్స్ విద్యార్థులు ఆసక్తి ఉంటే బోధన రంగంలోనూ ప్రవేశించొచ్చు. స్కూల్ స్థాయిలో, కాలేజీలో, యూనివర్సిటీల్లో రాజనీతి శాస్త్రం బోధించే వారికి డిమాండ్ ఉంది. పాఠశాల స్థాయిలో టీచర్‌గా కెరీర్ ప్రారంభించేందుకు బీఏ పొలిటికల్ సైన్స్ తర్వాత బీఈడీ కూడా పూర్తి చేయాల్సి ఉంటుంది. అలాగే కాలేజీ, యూనివర్సిటీ స్థాయిలో లెక్చరర్‌గా చేరేందుకు బీఏ తర్వాత ఎంఏ పొలిటికల్ సైన్స్, యూజీసీ నెట్ అర్హత, ఎంఫిల్, పీహెచ్‌డీ వంటి అర్హతలు ఉండాలి.

### సోషల్ వర్క్

రాజకీయాల్లో చేరకుండా, సివిల్ సర్వీసు ఉద్యోగం లేకుండా.. సమాజ సేవకు సరైన మార్గంగా నిలుస్తోంది సోషల్ వర్క్. పొలిటికల్ సైన్స్ గ్రాడ్యుయేట్లు ఎన్‌జీవోల(నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్స్) ద్వారా, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ విభాగాల ద్వారా సమాజ సేవలో పాల్గొనవచ్చు. తద్వారా అటు సంతృప్తితోపాటు ఇటు ఉజ్వల కెరీర్‌ను సొంతం చేసుకునే వీలుంది. బీఏ పొలిటికల్ సైన్స్ తర్వాత ఎంఏ సోషల్ వర్క్ పూర్తి చేసుకుంటే.. సమాజ సేవలో మరింత ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశం లభిస్తుంది. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, అజీం ప్రేమ్‌జీ యూనివర్సిటీ వంటి సంస్థలు అందిస్తున్న కోర్సులు సోషల్ సర్వీస్ కెరీర్‌కు ఉపయుక్తమని చెప్పొచ్చు.

### పొలిటికల్ సైంటిస్ట్

బీఏ పొలిటికల్ సైన్స్ అభ్యర్థులకు అందుబాటులో ఉన్న మరో మార్గం... పొలిటికల్ సైంటిస్ట్. వీరు ప్రభుత్వ నిర్ణయాలు, ప్రభుత్వ విధానాలు.. సమాజంపై చూపే ప్రభావాన్ని వివిధ కోణాల్లో లోతుగా అధ్యయనం చేస్తారు. అందుకే దేశంలోని అనేక సంస్థలతోపాటు అంతర్జాతీయ సంస్థలు సైతం పొలిటికల్ సైంటిస్ట్‌ల సేవలు కోరుతున్నాయి. ఐక్యరాజ్య సమితి వంటి అంతర్జాతీయ సంస్థల్లో ఇంటర్న్‌షిప్ కోసం బీఏ పొలిటికల్ సైన్స్ గ్రాడ్యుయేట్లు ప్రయత్నించొచ్చు. ఆ అనుభవంతో వివిధ అంతర్జాతీయ స్థాయి సంస్థల్లో అవకాశాలు లభిస్తాయి.

## ఉద్యోగాలు

# స్టీల్ ప్లాంట్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీస్

సుస్థిరమైన కెరీర్, ఆకర్షణీయమైన వేతనాలు అందించే కొలువుల కోసం ఎదురు చూసే ఇంజనీరింగ్ పట్టభద్రులకు సువర్ణావకాశం. దేశంలోని తీర ప్రాంతంలో ఉన్న అతి పెద్ద స్టీల్ ప్లాంట్.. విశాఖ పట్నం స్టీల్ ప్లాంట్(రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్(ఆర్ఐఎన్ఎల్).. మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతుంది. ఆర్ఐఎన్ఎల్ నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో పూర్తి సమాచారం..

### పోస్టుల, విభాగాలు

**మొత్తం పోస్టుల సంఖ్య:** 188.
ఇందులో సిరామిక్స్-04, కెమికల్-26, సివిల్-05, ఎలక్ట్రికల్-45, ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ ఎలక్ట్రానిక్స్-10, మెకానికల్-77, మెటలర్జీ-19, మైనింగ్-02 విభాగాలకు సంబంధించిన పోస్టులు ఉన్నాయి.

**అర్హతలు :**

- సంబంధిత విభాగాల్లో కనీసం 60 శాతం మార్కులతో ఇంజనీరింగ్ పూర్తి చేసి ఉండాలి. ఏప్రిల్ లేదా మేలో నిర్వహించే ఇంటర్వ్యూ సమయానికి నిర్దేశిత మార్కులతో కూడిన ప్రొవిజినల్ పాస్ సర్టిఫికేట్‌లను కలిగి ఉండాలి.
- **వయోపరిమితి:** 27 ఏళ్లకు మించకూడదు. నిబంధనలను అనుసరించి ఎస్సీ, ఎస్టీలకు 5 ఏళ్లు, ఓబీసీ నాన్ క్రిమిలేయర్ అభ్యర్థులకు మూడేళ్లు, దివ్యాంగులకు 10 ఏళ్ల గరిష్ఠ వయోపరిమితి సడలింపు ఉంటుంది.

### ఎంపిక ప్రక్రియ

- ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

**ఆన్‌లైన్ టెస్ట్ :** కంప్యూటర్ ఆధారితంగా(సీబీటీ- కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ) నిర్వహించే ఆన్‌లైన్ పరీక్ష మొత్తం 100 ప్రశ్నలు- 100 మార్కులకు జరుగుతుంది. ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు ఉంటుంది. ఈ పరీక్షల్లో ఎటువంటి నెగిటివ్ మార్కుల విధానం లేదు. జనరల్ అవేర్‌నెస్, న్యూమరికల్ ఎబిలిటీ/అప్టిట్యూడ్, జనరల్ ఇంగ్లిష్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, వెర్బల్ అండ్ నాన్ వెర్బల్ రీజనింగ్ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు వస్తాయి.

**పరీక్ష కేంద్రాలు :** హైదరాబాద్, కాకినాడ, రాజమండ్రి, విజయవాడ, విశాఖపట్నం.

**పర్సనల్ ఇంటర్వ్యూ :** ఆన్‌లైన్ టెస్ట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులను పర్సనల్ ఇంటర్వ్యూలకు పిలుస్తారు. ఇంటర్వ్యూలోనూ ప్రతిభ చూపిన వారిని తుది ఎంపిక చేస్తారు.

**శిక్షణ :** మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఏడాదిపాటు ప్రాథమిక శిక్షణ ఇస్తారు. విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులకు మరో ఏడాది పాటు ప్రొబేషన్‌గా నియమిస్తారు. అనంతరం పూర్తిస్థాయి ఉద్యోగ బాధ్యతలను అప్పగిస్తారు.

**వేతనం :** మేనేజ్‌మెంట్ ట్రైనీలుగా ఎంపికైన అభ్యర్థులకు ప్రతి మూలవేతనం రూ.20,600 చెల్లిస్తారు. ప్రాథమిక శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులకు రూ.20,600-46,500 పేస్కేలు ఉంటుంది. అలాగే పూర్తిస్థాయి ట్రైనింగ్ పూర్తిచేసుకున్న అభ్యర్థులకు రూ.24,900-50,500 పేస్కేలు ఉంటుంది. వేతనంతోపాటు ఇతర అలవెన్సులు అందుతాయి,

**దరఖాస్తు ఫీజు :** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.590 (జీఎస్టీ 18 శాతం కలుపుకొని), ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులందరు రూ.295 దరఖాస్తు ఫీజుగా చెల్లించాలి.

**ముఖ్యమైన సమాచారం :**
**ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేదీ :** 24.01.2020
**ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ముగింపు తేదీ :** 13.02.2020
**ఫీజు చెల్లింపు ఆఖరు తేదీ :** 14.02.2020
**వెబ్‌సైట్ :** www.vizagsteel.com

# రామ మందిర నిర్మాణానికి ట్రస్ట్

- 'శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర' పేరుతో ట్రస్ట్ ఏర్పాటు
- లోక్‌సభలో స్వయంగా ప్రకటించిన ప్రధాని మోదీ
- ట్రస్ట్‌లో ఒక దళిత వర్గం వ్యక్తి సహా 15 మంది సభ్యులు


అయోధ్య రామాలయ ట్రస్ట్ గురించి లోక్‌సభలో ప్రకటిస్తున్న ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ:** అయోధ్యలో రామ మందిర నిర్మాణానికి మరో ముందడుగు పడింది. మందిర నిర్మాణ పర్యవేక్షణకు ఒక స్వతంత్ర సంస్థ(ట్రస్ట్) ఏర్పాటైంది. అత్యద్భుతంగా మందిర నిర్మాణం జరిపేందుకు 'శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర' పేరుతో ట్రస్ట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు బుధవారం స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లోక్‌సభలో ప్రకటించారు. మందిర నిర్మాణానికి ట్రస్ట్‌ను ఏర్పాటు చేయాలని 'అయోధ్య' తీర్పులో సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించిన విషయం తెలిసిందే. 3 నెలల్లోగా ట్రస్ట్‌ను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించగా, ఆ గడువు ఫిబ్రవరి 9తో ముగియనున్న నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. కేంద్ర కేబినెట్ భేటీ అనంతరం.. బుధవారం ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభం కాగానే ప్రధాని ఈ ప్రకటన చేశారు. 'ఒక ముఖ్యమైన, చరిత్రాత్మక అంశంపై మీతో ఒక విషయాన్ని పంచుకోవాలనుకుంటున్నా. ఇది లక్షలాది ప్రజలలాగే నా హృదయానికి కూడా చాలా దగ్గరైన విషయం. దీనిపై ప్రకటన చేసే అవకాశం లభించడం నా అదృష్టం' అంటూ ట్రస్ట్ ఏర్పాటుపై ప్రధాని ప్రకటన చేశారు. అయోధ్యలో రామ మందిర అభివృద్ధి కోసం ఒక విస్తృత పథకాన్ని సిద్ధం చేశామన్నారు. అయోధ్యలోని వివాదాస్పద స్థలం సహా మొత్తం 67.703 ఎకరాలను ఈ ట్రస్ట్‌కు బదిలీ చేస్తామన్నారు. శ్రీరాముడి జన్మస్థలంలో అద్భుతమైన రామాలయ నిర్మాణానికి భారతీయులంతా సహకరించాలని మోదీ కోరారు. ప్రధాని ప్రకటన సందర్భంగా అధికార పక్ష సభ్యులు జై శ్రీరాం నినాదాలతో సభను హోరెత్తించారు. అయోధ్య తీర్పు అనంతరం దేశ ప్రజలంతా ప్రజాస్వామ్య విధివిధానాలపై గొప్ప విశ్వాసాన్ని చూపారని, అందుకు 130 కోట్ల భారతీయులకు సెల్యూట్ చేస్తున్నానని మోదీ తెలిపారు. భారత్‌లో అన్ని మతాల వారు ఒక ఉమ్మడి కుటుంబంలా కలిసి ఉంటారన్నారు. మన సంస్కృతిలోనే ఆ వసుధైక కుటుంబ భావన ఉందన్నారు. అన్ని వర్గాల అభివృద్ధి లక్ష్యంగా 'సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్' మార్గంలో తన ప్రభుత్వం పయనిస్తోందన్నారు.

### ఒక దళితుడు సహా 15 మంది ట్రస్టీలు

రామ మందిర నిర్మాణం కోసం ఏర్పాటైన ట్రస్ట్‌లో 15 మంది సభ్యులుంటారని, వారిలో ఒకరు దళిత వర్గానికి చెందినవారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ ట్రస్ట్ స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. 'లక్షలాది భక్తుల కోరిక త్వరలో నెరవేరుతుందని ఆశిస్తున్నా. రాముడు జన్మించిన పుణ్యక్షేత్రంలో భక్తులు పూజలు చేసుకునే అవకాశం త్వరలోనే లభించనుంది' అన్నారు. అయితే, ట్రస్టీల పేర్లను ఇంకా ప్రభుత్వం ప్రకటించలేదు. 'శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర' ప్రధాన కార్యాలయం ఢిల్లీలోని గ్రేటర్ కైలాశ్ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర హోంశాఖ ప్రకటించింది. కాగా, రామ మందిర నిర్మాణం గతంలో 'రామజన్మభూమి న్యాస్' ప్రతిపాదించిన నమూనాలో ఉంటుందని ఆశిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ అధ్యక్షుడు విష్ణు సదాశివ్ పేర్కొన్నారు.

### సున్నీ వక్ఫ్ బోర్డ్‌కు ఐదెకరాలు

మసీదు నిర్మాణం కోసం అయోధ్య జిల్లాలో సున్నీ వక్ఫ్ బోర్డ్‌కు ఐదెకరాల స్థలాన్ని కేటాయిస్తూ యూపీ సర్కార్ నిర్ణయించింది. సున్నీ వక్ఫ్ బోర్డ్‌కు మసీదు నిర్మాణం కోసం ఐదెకరాల స్థలాన్ని కేటాయించాలని అయోధ్య తీర్పులో సుప్రీంకోర్టు ఆదేశించడం తెల్సిందే. అయోధ్య నుంచి 18 కి.మీల దూరంలో లక్నో హైవేపై ఈ స్థలాన్ని కేటాయించినట్లు యూపీ ప్రభుత్వం తెలిపింది. కాగా, రామాలయ నిర్మాణం కోసం ట్రస్ట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించడానికి తన అనుమతి అవసరం లేదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

# పెట్టుబడులు పెట్టండి

- 'డిఫెన్స్' సంస్థలకు మోదీ పిలుపు
- 11వ డిఫెక్స్‌పో ప్రారంభం


డిఫెక్స్‌పోలో రంగునీళ్లు ఉన్న గుంత నుంచి దూసుకొస్తున్న యుద్ధట్యాంక్

**లక్నో:** రానున్న ఐదేళ్లలో భారత్ నుంచి 500 కోట్ల డాలర్ల(రూ. 35.6 వేల కోట్లు) విలువైన మిలటరీ ఉత్పత్తులను ఎగుమతి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మోదీ తెలిపారు. రక్షణ ఉత్పత్తుల ఎగ్జిబిషన్ 'డిఫెక్స్‌పో'ను బుధవారం ఇక్కడ ప్రధాని ప్రారంభించారు. ఈ సందర్భంగా భారత్‌లో తయారీ యూనిట్లను ప్రారంభించాలని ప్రపంచంలోని ప్రముఖ రక్షణ పరికరాల తయారీ సంస్థలను కోరారు. ఏ దేశాన్నో లక్ష్యంగా చేసుకుని భారత్ తన సైనిక శక్తిని పెంపొందించుకోవాలనుకోవడం లేదని స్పష్టం చేశారు. శాంతి, సుస్థిరతలను కాపాడే విషయంలో భారత్ నమ్మదగిన భాగస్వామి అన్నారు. భారత్ రెండేళ్లకు ఒకసారి ఈ 'డిఫెక్స్‌పో'ను నిర్వహిస్తుంది. ఈ సంవత్సరం జరుగుతోంది 11వ ప్రదర్శన. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఎగ్జిబిషన్‌కు ఈ సంవత్సరం 38 దేశాల రక్షణ మంత్రులు, 172 విదేశీ, 856 స్వదేశీ మిలటరీ ఎక్విప్‌మెంట్ సంస్థల ఉన్నతస్థాయి ప్రతినిధులు హాజరవుతున్నారు. సొంత దేశ రక్షణే కాకుండా ప్రధాన సవాళ్లను ఎదుర్కొనే విషయంలో పొరుగు దేశాలకు సహకారం అందించడం కూడా భారత్ బాధ్యతగా భావిస్తుందన్నారు. తద్వారా ఈ ప్రాంతంలో శాంతి, సుస్థిరతకు భారత్ దోహదపడుతుందన్నారు. మిలటరీ ఉత్పత్తుల విషయంలో దిగుమతులను తగ్గించుకుని, దేశీయ తయారీని పెంచే దిశగా తమ ప్రభుత్వం కొన్ని విధానపరమైన నిర్ణయాలు తీసుకుందని వివరించారు.

## క్లుప్తంగా...

### తప్పుడు వార్తలకు ట్విట్టర్ చెక్

**న్యూఢిల్లీ:** తప్పుదోవ పట్టించే వార్తల వ్యాప్తిని అరికట్టేందుకు ట్విట్టర్ గట్టి చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఇలాంటి ట్వీట్‌లకు ప్రత్యేక ముద్ర వేయనుంది. ప్రజలకు హానిచేసే విధంగా ఉన్నాయని భావించిన పక్షంలో సదరు ట్వీట్‌లను పూర్తిగా తొలగించేందుకు ట్విట్టర్ చర్యలు తీసుకుంటుంది. తెలిసో తెలియకో తప్పుదోవ పట్టించేలా రూపొందించిన మీడియా, ట్వీట్‌లను షేర్ చేయదల్చుకునే యూజర్లను ముందస్తుగా హెచ్చరించేలా సాంకేతికతను ఉపయోగించనుంది. విషయం గురించి యూజర్లకు మరింత వివరంగా తెలిసేందుకు సదరు పోస్ట్‌లపై వివరణ పొందుపర్చనుంది. మార్చి 5 నుంచి తప్పుడు ట్వీట్లను లేబులింగ్ చేసే ప్రక్రియ ప్రారంభించనున్నట్లు ట్విటర్ వెల్లడించింది.

### సోనియాగాంధీ డిశ్చార్జి

**న్యూఢిల్లీ:** ఉదర సంబంధిత ఇన్‌ఫెక్షన్‌తో ఢిల్లీలోని సర్ గంగారాం ఆస్పత్రిలో చేరిన కాంగ్రెస్ చీఫ్ సోనియా గాంధీ బుధవారం డిశ్చార్జ్ అయ్యారు. ఆదివారం సాయంత్రం ఆమె ఆస్పత్రిలో చేరారు. ఇన్‌ఫెక్షన్ నుంచి కోలుకున్నందున డిశ్చార్జి చేసినట్లు వైద్యులు తెలిపారు.

### కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో 6.83 లక్షల ఖాళీలు

**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో 6.83 లక్షలకుపైగా ఉద్యోగ ఖాళీలున్నాయని సిబ్బంది వ్యవహారాల సహాయ మంత్రి జితేంద్ర సింగ్ లోక్‌సభలో చెప్పారు. కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో మొత్తం 38,02,779 పోస్టులుండగా 2018మార్చి 1 నాటికి అందులో 31,18,956 ఉద్యోగులున్నారని పేర్కొన్నారు. 2019–20 ఏడాదికి గాను కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్‌సీ), స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ), రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ఆర్‌బీ) లు సుమారు 1.34 లక్షల ఉద్యోగాల భర్తీకి ప్రతిపాదనలు చేశాయన్నారు.

### భార్య అకౌంట్లో రూ. 30 కోట్లు..


**బెంగళూరు:** తన భార్య బ్యాంకు అకౌంట్లో రూ. 30 కోట్లు పడటంతో చన్నపట్నానికి చెందిన సయ్యద్ మాలిక్ బుర్హాన్ అనే పూల విక్రేత షాక్‌కు గురయ్యాడు. డిసెంబర్ 2న బ్యాంకు అధికారులు అతని ఇంటికి వచ్చి ఆ డబ్బులు ఎక్కడినుంచి వచ్చాయని ప్రశ్నించడంతో ఈ విషయం బయటికొచ్చింది. గతంలో తాను ఓ సారి ఓ ఆన్‌లైన్ పోర్టల్ నుంచి చీర కొన్నానని, అప్పుడు తాను కారును గెలుచుకున్నానని చెప్పి తన బ్యాంకు ఖాతా వివరాలను ఎవరో ఫోన్ చేసి అడిగారని గుర్తు చేసుకున్నాడు. అప్పటి నుంచి తమ ఖాతాల్లోకి అంత డబ్బు ఎలా వచ్చిందో తెలియక తిరుగుతున్నట్లు పేర్కొన్నారు.

### ట్రంప్ వర్సెస్ పెలోసి


ప్రసంగ ప్రతిని చింపేస్తున్న పెలోసి

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రసంగ ప్రతిని ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సీ పెలోసి చించేసిన సంచలన ఘటన అమెరికా కాంగ్రెస్‌లో చోటు చేసుకుంది. ట్రంప్‌ను విమర్శించే విషయంలో డెమొక్రాటిక్ పార్టీ నేత నాన్సీ ముందుంటారనే విషయం తెలిసిందే. 'స్టేట్ ఆఫ్ ది యూనియన్' ప్రసంగం ఇచ్చేందుకు వచ్చిన ట్రంప్‌ను సభకు పరిచయం చేస్తూ.. సాంప్రదాయక పరిచయ వాక్యాలను నాన్సీ వాడలేదు. తర్వాత ప్రసంగం ఇచ్చేందుకు ట్రంప్ నిల్చుని, తన ప్రసంగ ప్రతిని నాన్సీ పెలోసికి ఇచ్చారు. ఆ సమయంలో ఆమె ట్రంప్‌తో కరచాలనం చేసేందుకు ప్రయత్నించగా, ట్రంప్ పట్టించుకోనట్లుగా వెనక్కు తిరిగారు. ట్రంప్ ప్రసంగం ముగించే సమయంలో.. నాన్సీ లేచి నిల్చున తన చేతిలోని ట్రంప్ ప్రసంగం కాపీని అడ్డంగా చింపేశారు.

# సరోగసీకి దగ్గరి బంధువులే కానక్కర్లేదు




- అద్దెగర్భానికి సమ్మతించే ఏ మహిళైనా బిడ్డల్ని కనివ్వొచ్చు
- ఒంటరి మహిళలూ సరోగసీని వినియోగించుకోవచ్చు
- తేల్చి చెప్పిన సెలెక్ట్ కమిటీ
- అద్దెగర్భాలతో వ్యాపారానికి స్వస్తి

**న్యూఢిల్లీ:** సరోగసీ ద్వారా బిడ్డల్ని కనిచ్చేందుకు దగ్గరి బంధువులే కానక్కర్లేదనీ, ఆరోగ్యవంతులైన స్త్రీలెవ్వరైనా అందుకు సమ్మతిస్తే సరోగసీ పద్ధతుల్లో బిడ్డని కనివ్వొచ్చనీ రాజ్యసభ సెలెక్ట్ కమిటీ తేల్చి చెప్పింది. 35–45 ఏళ్ల మధ్య వయస్కులైన ఒంటరి స్త్రీలు సరోగసీని ఉపయోగించుకోవచ్చని స్పష్టంచేసింది. సరోగసీ తల్లులుగా దగ్గరి బంధువులే ఉండాలన్న నిబంధనను అద్దెగర్భాల తల్లులపై పరిమితులు సృష్టిస్తుందనీ, అందుకే దీన్ని తొలగించాలని కమిటీ సూచించింది. ఒంటరి స్త్రీలంతా సరోగసీకి అర్హులేననీ, భర్తలేకున్నా, భర్తతో విడిపోయినా, భర్త చనిపోయిన స్త్రీలకూ సంతానాన్ని పొందే అవకాశం ఉండాలని స్పష్టం చేసింది. భారతీయురాలైన 35–45 ఏళ్ల మధ్యవయస్సులో ఉన్న స్త్రీలు ఇందుకు అర్హులంది. అద్దెగర్భాన్ని వ్యాపారంగా మార్చొద్దని హెచ్చరించింది. లాభాపేక్షతో కాకుండా మాతృత్వపు విలువలను కాపాడేవిధంగా సరోగసీని అనుమతించాలని అభిప్రాయపడింది. సరోగసీ(రెగ్యులేషన్) బిల్లు–2019ని నవంబర్ 21, 2019న రాజ్యసభ సెలెక్ట్ కమిటీకి పంపించారు. అప్పటి నుంచి ఈ కమిటీ 10 సార్లు సమావేశమైంది. కమిటీ చైర్మన్ భూపేందర్ యాదవ్ బుధవారం నివేదికను సమర్పించారు. 23 మంది సభ్యుల సెలెక్ట్ కమిటీ బృందం సరోగసీ రెగ్యులేషన్ బిల్లులో పలు మార్పులను సూచించింది.

- అదేవిధంగా సరోగసీ ద్వారా బిడ్డని కనాలనుకునే జంట పెళ్లైన ఐదేళ్ళ పాటు భార్యాభర్తలు కలిసి ఉండీ పిల్లల్ని కనలేని పరిస్థితుల్లోనే అద్దెగర్భాన్ని ఆశ్రయించాలన్న నిబంధనను కూడా కమిటీ సడలించింది. సంతానలేమిని కొత్తగా నిర్వచించిన కమిటీ పిల్లల కోసం ఒక జంట ఐదేళ్ళ పాటు ఎదురుచూడడం చాలా ఎక్కువ కాలం అవుతుందని పేర్కొంది.
- ఇష్టమైన ఏ స్త్రీ అయినా సరోగసీ ద్వారా బిడ్డలను కనే అనుమతినివ్వాలనీ, అయితే అందుకు సంబంధించిన అన్ని విషయాలూ సరోగసీ చట్టప్రకారమే జరగాల్సి ఉంటుందనీ తెలిపింది. అలాగే అద్దెగర్భం దాల్చే మహిళలకు గతంలో ఉన్న 16 నెలల ఇన్సూరెన్స్ కవరేజ్‌ను 36 నెలలకు పెంచాలని సూచించింది.
- పిల్లలు పుట్టని వారుసైతం సరోగసీ ద్వారా బిడ్డను పొందేందుకు ఐదేళ్ళు వేచి ఉండాలన్న నిబంధనను తొలగించాలని అభిప్రాయపడిన కమిటీ పిల్లలు పుట్టకపోవడానికి అనేక కారణాలుంటాయని వివరించింది. కొందరికి పుట్టుకతోనే గర్భాశయం లేకపోవడం, లేదా గర్భాశయం పనిచేయకపోవడం, క్యాన్సర్‌కారణంగా గర్భాశయాన్ని తొలగించాల్సి రావడం, కొందరు స్త్రీలకు ఎప్పటికీ పిల్లలను కనే అవకాశంలేని అనారోగ్య స్థితిలో ఉన్న వారికి సరోగసీ ఒక ప్రత్యామ్నాయమని అభిప్రాయపడింది.
- బిడ్డలు కావాలనుకునేవారు ఎప్పుడైనా సరోగసీ ద్వారా బిడ్డలను కనొచ్చనీ, అయితే అందుకు వైద్యపరమైన ఆమోదం పొందాల్సి ఉంటుందని కమిటీ పేర్కొంది.
- అలాగే భారతీయ సంతతికి చెందిన వారెవ్వరైనా సరోగసీ బోర్డు ద్వారా అనుమతిపొందిన తరువాత దేశంలో సరోగసీ ద్వారా బిడ్డలను పొందే వీలుండేలా బిల్లులో మార్పులు చేయాలని కమిటీ సూచించింది.

# ఉరి.. అందరికీ ఒకే సారి

- నిర్భయ కేసులో ఢిల్లీ హైకోర్టు స్పష్టీకరణ
- దోషులకు ఏడు రోజుల గడువు
- సుప్రీంను ఆశ్రయించిన కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వం



**న్యూఢిల్లీ:** నిర్భయపై సామూహిక హత్యాచార కేసులో మరణశిక్ష పడిన నలుగురు దోషులు తమకున్న అన్ని న్యాయపర అవకాశాలను వినియోగించుకోవడానికి ఢిల్లీ హైకోర్టు వారం రోజుల గడువు విధించింది. వారం తర్వాత అధికారులు చట్టబద్ధంగా వ్యవహరించాలని ఆదేశిస్తూ ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేష్ బుధవారం చెప్పారు. దోషులను విడివిడిగా కాకుండా అందరికీ ఒకేసారి శిక్ష అమలుచేయాలని హైకోర్టు తేల్చి చెప్పింది.

**కేంద్రం పిటిషన్ కొట్టివేత..**

నిర్భయ దోషులకు విధించిన మరణశిక్ష అమలులో ఆలస్యాన్ని సవాల్ చేస్తూ కేంద్రం ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జడ్జి తాజా ఆదేశాలిచ్చారు. న్యాయపరమైన అన్ని అవకాశాలనూ వినియోగించుకున్న కారణంగా నలుగురు దోషుల్లో ఇద్దరు ముఖేష్ సింగ్, వినయ్ శర్మలను వేరుగా ఉరితీయాలంటూ చేసిన కేంద్రం అభ్యర్థనను కోర్టు కొట్టివేసింది. తీహార్ జైలు నిబంధనలను కోర్టు తప్పుగా అర్థం చేసుకున్నదనీ, ఉరిశిక్ష నుంచి తప్పించుకోవడానికి దోషులు యత్నిస్తున్నారంటూ ప్రభుత్వం తరపున వాదించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వ్యాఖ్యలను కోర్టు తోసిపుచ్చింది. దోషులు పెట్టుకున్న క్షమాభిక్ష అర్జీని అప్పీల్‌గా పరిగణించరాదన్న తుషార్ వ్యాఖ్యలను జడ్జి అంగీకరించలేదు. దోషులందరి డెత్ వారెంట్లనూ ఒకేసారి అమలుచేయాలని తాను అభిప్రాయపడుతున్నానని పేర్కొన్నారు. కేంద్రం అభ్యర్థనమేరకు ఆదివారం ప్రత్యేకంగా విచారించిన జస్టిస్ సురేష్ కుమార్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కల్పించిన అన్ని రక్షణలను దోషులు చివరి శ్వాస వరకు వినియోగించుకుంటారని స్పష్టం చేశారు. ముకేష్ సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ ని దాఖలు చేసే వరకూ అంటే 186 రోజులపాటు దోషుల ఉరితీతపై ఎవ్వరికీ పట్టలేదనడంలో తనకు సందేహం లేదని జడ్జి తేల్చి చెప్పారు.

**నిర్భయ దోషులకు త్వరలోనే ఉరి ...**

ఉరిశిక్ష అమలు జరుగుతుందని కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ లోక్ సభలో తెలిపారు. దోషులు ఉరిశిక్ష అమలును వాయిదా వేయాలని చూస్తున్నారని ఆరోపించారు. నిర్భయ కేసులో ఇప్పటికే దోషులకు ఉరిశిక్ష విధించిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ విషయంలో కేంద్రం చాలా కఠినంగా ఉందనీ, త్వరలోనే దోషులకు ఉరిశిక్ష అమలుచేస్తారనీ సభకు తెలిపారు. నిర్భయ దోషుల ఉరిశిక్ష అమలుపై స్టేకి వ్యతిరేకంగా కేంద్రం దాఖలు చేసుకున్న పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించడంతో కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. నిర్భయ దోషులకు శిక్ష అమలు విషయంలో ఇక ఎంతో కాలం వేచి ఉండలేమనీ, క్షమాభిక్ష అర్జీలతో సహా న్యాయపరమైన అన్ని అవకాశాలనూ వినియోగించుకున్నందున దోషులను విడివిడిగా ఉరితీయాలంటూ పిటిషన్‌లో పేర్కొన్నారు.

**మరో దోషికి క్షమాభిక్ష తిరస్కరణ**

నిర్భయ దోషి అక్షయ్‌కుమార్ సింగ్ పెట్టుకున్న క్షమాభిక్షను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తిరస్కరించినట్లు హోంశాఖ అధికారులు బుధవారం తెలిపారు. కొద్దిరోజుల కిందట అతడు పిటిషన్ పెట్టుకున్నట్లు తెలిపారు.

### ఎన్పీఆర్ చాలా ముఖ్యం
**ప్రముఖ నటుడు రజనీకాంత్**

**చెన్నై:** పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) వల్ల ముస్లింలకు వచ్చిన ప్రమాదమేమీ లేదని, జాతీయ జనాభా పట్టిక (ఎన్పీఆర్) ప్రస్తుతం చాలా చాలా అవసరమని సినీ హీరో రజనీకాంత్ బుధవారం చెప్పారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న సీఏఏ నిరసనలపై ఆయన స్పందించడం ఇదే తొలిసారి. జాతీయ పౌర పట్టిక (ఎన్నార్సీ)పై ప్రభుత్వమే ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెప్పారు. దేశం విడిపోయాక భారత్‌లో ఉండటానికి నిశ్చయించుకున్న వారికి ఈ దేశంపై అన్ని హక్కులూ ఉన్నాయని చెప్పారు. సీఏఏ వల్ల ముస్లింలకు నష్టమని కొందరు భయాన్ని పుట్టిస్తున్నారని చెప్పారు. సీఏఏ వల్ల ముస్లింలకు సమస్య వస్తే తానే వారికి గొంతుకగా మారతానని హామీ ఇచ్చారు. శ్రీలంక తమిళులకు ద్వంద్వ పౌరసత్వం ఇవ్వాలన్నారు.

# కరోనా విశ్వరూపం

**490కి చేరిన మృతులు**
**24 వేలకుపైగా కేసులు**

**బీజింగ్:** కరోనా వైరస్ తీవ్రత రోజురోజుకీ పెరిగిపోతోంది. చైనాలో 31 ప్రావిన్షియల్ రీజియన్లలో ఇది విశ్వరూపం చూపిస్తోంది. ఈ వైరస్ బారిన పడి ఇప్పటివరకు 490 మంది మరణించారని, 24 వేలకు పైగా కేసులు నమోదయ్యాయని చైనా ఆరోగ్య శాఖ అధికారులు చెప్పారు. వ్యాధిగ్రస్తుల సంఖ్య అంతకంతకీ పెరిగిపోతూ ఉండడంతో వూహాన్‌లో జాతీయ స్టేడియం, జిమ్‌లనే తాత్కాలిక ఆసుపత్రులుగా మార్చి చికిత్స అందిస్తున్నారు. మరోవైపు చైనాలో కరోనా ధాటికి బెంబేలెత్తిపోయి హాంగ్‌కాంగ్ వచ్చేవారి సంఖ్య పెరిగిపోతోంది. దీంతో చైనా నుంచి వచ్చిన వారిని తప్పనిసరిగా రెండు వారాల పాటు నిర్బంధంలో ఉంచుతామని హాంగ్‌కాంగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ క్యారీ ప్రకటించారు.

**పుట్టిన పసికందుకి సోకిన వైరస్**

చైనాలోని వూహాన్‌లో అప్పుడే పుట్టిన పసికందుకి కరోనా వైరస్ సోకినట్టు అధికారులు గుర్తించారు. తల్లి గర్భంలో ఉన్నప్పుడే బిడ్డకు ఈ వైరస్ సోకి ఉంటుందని భావిస్తున్నారు. ప్రసవం కావడానికి ముందు తల్లికి జరిపిన పరీక్షల్లో ఆమెకు కరోనా వైరస్ ఉన్నట్టు తేలింది. దీంతో బిడ్డకు గర్భంలోనే ఆ వైరస్ సోకి ఉంటుందని చెబుతున్నారు.

**అనుమానితుడు పరారీ:** గుజరాత్‌లో కరోనా వైరస్ లక్షణాలున్న వ్యక్తి ఆస్పత్రి నుంచి పరారయ్యాడు. జనవరి 19న చైనా నుంచి వచ్చిన 41 ఏళ్ల వ్యక్తికి కరోనా వైరస్ లక్షణాలు కనిపించడంతో అతనిని వైద్య పరీక్షల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆస్పత్రికి తరలించారు. అయితే రక్త నమూనాలు ఇవ్వకుండా అతను పరారీ కావడం ఆందోళన రేపుతోంది. కాగా, కరోనా వైరస్ నిర్మూలనకు చైనాతో కలిసికట్టుగా పోరాటం చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. కరోనా వైరస్ ప్రభావం గుజరాత్‌లో వజ్రాల వ్యాపారాన్ని చావు దెబ్బ కొట్టనుంది. వచ్చే రెండు నెలల్లో 8 వేల కోట్ల రూపాయల నష్టం వస్తుందని మార్కెట్ విశ్లేషకుల అంచనా.

హిమపాతం కారణంగా మంచులో కూరుకుపోయిన వారి జాడ కోసం శ్రమిస్తున్న సిబ్బంది


# టర్కీలో వరుస హిమపాతాలు..

- 38 మంది మృతి
- 53 మందికి గాయలు

**అంకారా:** టర్కీలోని వాన్ ప్రావిన్స్‌లో చోటుచేసుకున్న రెండు వరుస హిమపాతాల కారణంగా 38 మంది మంచులో సజీవసమాధి అయ్యారు. మంగళవారం రాత్రి జరిగిన మొదటి హిమపాతంలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు గల్లంతయ్యారు. వీరిని వెలికితీసేందుకు దాదాపు 300 మంది అత్యవసర విభాగం ఘటనా స్థలికి చేరుకొని రక్షణ చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం మరో హిమపాతం చోటుచేసుకుంది. ఈ ఘటనలో 33 మంది మృతి చెందగా, 53 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. మరణించిన వారిలో 8 మంది మిలిటరీ ఆఫీసర్లు, 9 మంది వాలంటీర్లు, మరో ముగ్గురు ప్రభుత్వం నియమించిన గార్డులు ఉన్నట్లు చెప్పారు. గల్లంతైన వారి పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదని చెప్పారు.

# ఆప్ కే సాథ్!

**ఢిల్లీ గుండె చప్పుడు ఇదేనా? / కఠిన పరీక్ష ఎదుర్కొంటున్న కమలదళం**

**ఇన్నాళ్లూ మూడు స్తంభాలాట అన్నారు. ఇప్పుడు ముఖాముఖి పోరనే అంటున్నారు. రాజధాని రణ రంగంలో ఆప్, బీజేపీల మధ్యే ఎన్నికల యుద్ధం జరుగుతోంది. పోలింగ్‌కు ముందే కాంగ్రెస్ కాడె దింపేసింది. బీజేపీ కఠిన పరీక్ష ఎదుర్కొంటోంది. జనం ఆప్ కే సాథ్ అంటున్నారని వివిధ పోల్ సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. ఏడాది క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఏకంగా 57శాతం ఓట్లతో ఏడుకి ఏడు లోక్‌సభ స్థానాల్లోనూ బీజేపీ విజయఢంకా మోగించింది. ఏడాదిలోనే బీజేపీకి ఏటికి ఎదురీదాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది?**
**- న్యూఢిల్లీ**




- ఢిల్లీలో నిరుపేదల సంఖ్య మిగిలిన హిందీ బెల్ట్ రాష్ట్రాలతో పోలిస్తే తక్కువే. 2015–16 జాతీయ కుటుంబ, ఆరోగ్య సర్వే ప్రకారం దేశవ్యాప్తంగా దుర్భర దారిద్ర్యంలో మగ్గిపోతున్నవారు 20శాతంగా ఉంటే, ఢిల్లీలో మాత్రం 0.2% మాత్రమే ఉన్నారు. దీని వల్ల ఉజ్వల యోజన పథకం కింద ఢిల్లీ జనాభాలో 2% మాత్రమే లబ్ధిదారులు ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం పథకాలన్నీ నిరుపేదల్ని ఉద్దేశించినవి కావడంతో ఆప్ సర్కార్ వాటిని అమలు కూడా చేయడం లేదు.
- ఆమ్ ఆద్మీ పార్టీ మధ్య తరగతి, ఎగువ మధ్యతరగతిని కూడా ఆకర్షించేలా తన సొంత సంక్షేమ ఎజెండాతో ముందుకు వెళుతూ ఎన్నో ఉచితాలు ప్రకటించింది. అందులో ఉచితంగా నెలకి 20 వేల లీటర్ల నీళ్లు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అత్యధికుల్ని ఆకర్షిస్తోంది.
- ఆప్ అవినీతి రహిత పరిపాలన అందిస్తోంది. సీఎం అరవింద్ కేజ్రీవాల్ సుపరిపాలనే ఎజెండాగా తీసుకున్నారు. విపక్షాలు కొన్నాళ్లు ఆప్ సర్కార్‌లో అవినీతి జరుగుతోందని గగ్గోలు పెట్టినా దానికి ఆధారాలేమీ లేవు. ఎన్నికల ప్రచారంలో ఆ ఊసే లేదు.
- అవినీతి లేని ప్రభుత్వాలు కావాలంటే ప్రధానిగా మోదీ, ముఖ్యమంత్రిగా కేజ్రీవాలే ఉత్తమమని ఓటర్లు ముందుగానే ఫిక్స్ అయినట్టుగా అనిపిస్తోందని ఎన్నికల విశ్లేషకుల అంచనా.
- 2019 లోక్‌సభ ఎన్నికల్లో ముస్లిం ప్రాబల్యం ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ గణనీయంగా ఓట్లు సాధించింది. 2017 మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో చతికిలపడిపోయిన ఆప్ తన రాజకీయ వ్యూహాలను మార్చుకుంది. కశ్మీర్‌లో ఆర్టికల్ 370కి మద్దతునిచ్చింది. సీఏఏకి వ్యతిరేక ప్రదర్శనల వైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో సెక్యులర్ పార్టీ అంటే కాంగ్రెస్ అన్న అభిప్రాయం మైనార్టీల్లో వచ్చి ఆ పార్టీ వైపు వెళ్లారు. కానీ ఈ సారి ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రేక్షక పాత్ర పోషిస్తూ ఉండడంతో ఆప్‌కే లబ్ధి చేకూరే అవకాశాలున్నాయని అంచనా.
- ఢిల్లీ ఓటరు ఎన్నికల ఎన్నికలకీ తన తీర్పుల్ని తానే తిరగరాస్తూ ఉంటాడు. 2013 ఎన్నికల్లో ఆప్, బీజేపీ, కాంగ్రెస్‌కి సమానంగా స్థానాలిచ్చిన ఓటర్లు ఆ తర్వాత ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని అక్కున చేర్చుకున్నారు. 2015లో ఆప్ వెంటే నడిస్తే, ఆ తర్వాత రెండేళ్లకే జరిగిన ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఆప్ ఆశలపై నీళ్లు చల్లారు. గత ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి బ్రహ్మరథం పట్టారు. ఈ సారి ఆప్ వెంట నడుస్తారని సర్వేలు చెబుతున్నాయి.

### ఏ సర్వే ఏం చెబుతోంది?

**ఏబీపీ న్యూస్- సీ ఓటర్**
ఆప్ 59, బీజేపీ 8, కాంగ్రెస్ 3

**టైమ్స్ నౌ-ఐపీఎస్ఓఎస్**
ఆప్ 54-60,
బీజేపీ 10-14, కాంగ్రెస్ 0-2

**న్యూస్ఎక్స్ -పోల్‌స్ట్రాట్**
ఆప్ - 53-56,
బీజేపీ- 12-15, కాంగ్రెస్ 2-4



భారత టెస్టు జట్టు తరఫున ఇప్పటికే ఆడిన మయాంక్ అగర్వాల్, పృథ్వీ షా బుధవారం వన్డేల్లో కూడా అరంగేట్రం చేశారు. వీరికి కోహ్లి క్యాప్‌లు అందజేశారు. టీమిండియాకు వన్డేల్లో ప్రాతినిధ్యం వహించిన 230వ ఆటగాడిగా మయాంక్, 231వ ఆటగాడిగా షా గుర్తింపు పొందారు.

# గెలుపు రాస్ పెట్టాడు



రాస్ టేలర్

ఎట్టకేలకు న్యూజిలాండ్ గెలుపు రుచి చూసింది. సొంతగడ్డపై వరుసగా 9 అంతర్జాతీయ మ్యాచ్‌లలో ఓటమి తర్వాత ఆ జట్టుకు ఊరట లభించింది. అది కూడా అసాధారణ విజయంతో దక్కింది. తమ వన్డే చరిత్రలో అతి పెద్ద లక్ష్యాన్ని ఛేదించి కివీస్ సగర్వంగా నిలిచింది. టి20ల్లో 0–5తో క్లీన్‌స్వీప్‌కు గురైన వేదనను మరచిపోయేలా భారత్‌పై తొలి వన్డేలో అద్భుత ప్రదర్శనతో ఆ జట్టు ఆకట్టుకుంది. సీనియర్ బ్యాట్స్‌మన్ రాస్ టేలర్ సెంచరీతో ముందుండి నడిపించగా... కెప్టెన్ లాథమ్, నికోల్స్ కీలక పాత్ర పోషించారు. టీమిండియా తరఫున శ్రేయస్ అయ్యర్ తొలి వన్డే సెంచరీ, రాహుల్ మెరుపు బ్యాటింగ్ చివరకు వృథా కాగా, పేలవ బౌలింగ్‌తో జట్టు భంగపడాల్సి వచ్చింది. మొత్తంగా భారీ స్కోర్లతో పరుగుల వరద పారిన సెడన్ పార్క్‌లో చివరకు ఆతిథ్య జట్టుదే పైచేయి అయింది.

## 348 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన న్యూజిలాండ్

- తొలి వన్డేలో అద్భుత విజయం
- 4 వికెట్లతో భారత్ ఓటమి
- టేలర్ సెంచరీ, రాణించిన లాథమ్, నికోల్స్
- అయ్యర్ శతకం, రాహుల్ మెరుపులు వృథా
- రెండో వన్డే శనివారం



అయ్యర్



రాహుల్

హామిల్టన్: భారత్‌తో వన్డే సిరీస్‌లో న్యూజిలాండ్ శుభారంభం చేసింది. బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో కివీస్ 4 వికెట్ల తేడాతో భారత్‌ను ఓడించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 347 పరుగులు సాధించింది. శ్రేయస్ అయ్యర్ (107 బంతుల్లో 103; 11 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో చెలరేగగా... కేఎల్ రాహుల్ (64 బంతుల్లో 88 నాటౌట్; 3 ఫోర్లు, 6 సిక్సర్లు), కెప్టెన్ విరాట్ కోహ్లి (63 బంతుల్లో 51; 6 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించారు. అనంతరం న్యూజిలాండ్ 48.1 ఓవర్లలో 6 వికెట్లకు 348 పరుగులు చేసి గెలిచింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' రాస్ టేలర్ (84 బంతుల్లో 109 నాటౌట్; 10 ఫోర్లు, 4 సిక్సర్లు) సెంచరీతో అదరగొట్టాడు. అతనికి కెప్టెన్ టామ్ లాథమ్ (48 బంతుల్లో 69; 8 ఫోర్లు, 2 సిక్సర్లు), హెన్రీ నికోల్స్ (82 బంతుల్లో 78; 11 ఫోర్లు) అండగా నిలిచారు. టేలర్, లాథమ్ నాలుగో వికెట్‌కు 13.2 ఓవర్లలోనే 138 పరుగులు జోడించారు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో కివీస్ 1–0తో ముందంజ వేయగా... ఇరు జట్ల మధ్య రెండో వన్డే శనివారం ఆక్లాండ్‌లో జరుగుతుంది.

**కీలక భాగస్వామ్యాలు...**

ఇద్దరు కొత్త ఓపెనర్లు మయాంక్ అగర్వాల్ (31 బంతుల్లో 32; 6 ఫోర్లు), పృథ్వీ షా (20)లతో భారత ఇన్నింగ్స్ ప్రారంభమైంది. తొలి ఓవర్‌ను మెయిడిన్‌గా ఆడిన షా తొమ్మిదో బంతికి వన్డేల్లో ఖాతా తెరిచాడు. ఆ తర్వాత వీరిద్దరు చకచకా పరుగులు రాబట్టారు. ఒక దశలో 17 బంతుల వ్యవధిలో 7 ఫోర్లు వచ్చాయి. అయితే ఈ భాగస్వామ్యం 50 పరుగులకు చేరాక గ్రాండ్‌హోమ్ బౌలింగ్‌లో షా వెనుదిరిగాడు. తర్వాతి ఓవర్లోనే మయాంక్ కూడా అవుటయ్యాడు. ఇలాంటి స్థితిలో కోహ్లి, అయ్యర్ కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. కోహ్లి వేగంగా ఆడగా అయ్యర్ మాత్రం నిలదొక్కుకునేందుకు ఎక్కువ సమయం తీసుకున్నాడు. 9 పరుగుల వద్ద కష్టసాధ్యమైన క్యాచ్‌ను టేలర్ వదిలేయడంతో అయ్యర్ బతికిపోయాడు. ఆ తర్వాత వీరిద్దరు చక్కటి సమన్వయంతో జాగ్రత్తగా ఆడారు. కోహ్లి తనదైన శైలిలో కొన్ని చూడచక్కటి షాట్లతో అలరించాడు. మూడో వికెట్‌కు వీరిద్దరు 20.1 ఓవర్లలో 102 పరుగులు జోడించారు. అయితే ఓవర్‌కు 5.07 పరుగుల చొప్పున మాత్రమే పరుగులు రాబట్టగలిగారు. ఈ దశలో లెగ్ స్పిన్నర్ సోధిని బౌలింగ్‌కు దించి కివీస్ మంచి ఫలితం సాధించింది. అప్పుడే హాఫ్ సెంచరీ మార్క్‌ను దాటిన కోహ్లిని సోధి తన తొలి ఓవర్లోనే 'గుగ్లీ'తో క్లీన్‌బౌల్డ్ చేశాడు. ఇక భారత్‌ను నిలువరించవచ్చని ప్రత్యర్థి భావిస్తున్న తరుణంలో రాహుల్ సవాల్ విసిరాడు. మరోవైపు 66 బంతుల్లో అయ్యర్ అర్ధ సెంచరీ పూర్తయింది. ఆ తర్వాత వీరిద్దరు దూకుడుగా ఆడి బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించారు. సోధి ఓవర్లో రెండు వరుస సిక్సర్లు బాదిన రాహుల్ ఆ తర్వాత సౌతీ ఓవర్లోనూ ఇదే తరహాలో చెలరేగాడు. సౌతీ తర్వాతి ఓవర్లో అయ్యర్ 3 ఫోర్లు బాదడంతో 15 పరుగులు వచ్చాయి. 83 పరుగుల వద్ద గ్రాండ్‌హోమ్ క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన అయ్యర్... సాన్ట్నర్ ఓవర్లో సింగిల్ తీసి కెరీర్‌లో తొలి సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అదే ఓవర్లో రాహుల్ అర్ధ సెంచరీ కూడా పూర్తయింది.

**ఆ మూడు ఓవర్లు...**

భారత్ తమ చివరి 6 ఓవర్లలో 62 పరుగులు చేయగలిగింది. ఇందులో సౌతీ వేసిన 48వ ఓవర్లో 20 పరుగులు వచ్చాయి. కేదార్ జాదవ్ (15 బంతుల్లో 26 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) వరుస బంతుల్లో 4, 6, 4 బాదగా రాహుల్ మరో ఫోర్ కొట్టాడు. అయితే మిగిలిన ఐదు ఓవర్లలో 3 ఓవర్లు వేసిన బెన్నెట్ 6, 8, 7 చొప్పున మాత్రమే పరుగులు ఇవ్వడంతో టీమిండియా మరింత భారీ స్కోరుకు దూరమైంది.

**వీరబాదుడు...**

తొలి పది ఓవర్ల పవర్‌ప్లేలో 54 పరుగులు... ఇలాంటి సాధారణ ఆరంభం తర్వాత కూడా కివీస్ భారీ లక్ష్యాన్ని ఛేదించగలిగింది. ఓపెనర్లు గప్టిల్ (41 బంతుల్లో 32; 1 ఫోర్), నికోల్స్ జాగ్రత్తగా ఆడుతూ ఇన్నింగ్స్‌ను నిర్మించారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 85 పరుగులు జోడించారు. అయితే తాను ఎదుర్కొన్న 35వ బంతికి బౌండరీ కొట్టగలిగిన గప్టిల్ ఆ వెంటనే వెనుదిరిగాడు. ఈ మ్యాచ్‌తో అరంగేట్రం చేసిన బ్లన్‌డెల్ (9) కూడా ఎక్కువ సేపు నిలవలేదు. సగం ఓవర్లు ముగిసేసరికి కివీస్ స్కోరు 147 పరుగులకు చేరింది. అర్ధ సెంచరీ అనంతరం కోహ్లి అద్భుత ఫీల్డింగ్‌కు నికోల్స్ రనౌటయ్యాడు. ఈ దశలో భారత్‌కు మ్యాచ్‌పై పట్టు చిక్కినట్లు అనిపించింది. అయితే టేలర్, లాథమ్ భాగస్వామ్యం ఆ ఆనందాన్ని దూరం చేసింది. 21.3 ఓవర్లలో 177 పరుగులు చేయాల్సిన దశలో జత కలిసిన వీరిద్దరు స్వేచ్ఛగా బ్యాట్ ఝుళిపిస్తూ వేగంగా పరుగులు రాబట్టారు. ముఖ్యంగా కుల్దీప్, శార్దుల్‌పై బ్యాట్స్‌మెన్ విరుచుకు పడ్డారు. ఫలితంగా 4 ఓవర్లలో 44 పరుగులు వచ్చాయి. 45 బంతుల్లో టేలర్ హాఫ్ సెంచరీ పూర్తయింది. ఆ తర్వాత జడేజా ఓవర్లో కూడా 2 ఫోర్లు, సిక్స్ సహా మొత్తం 15 పరుగులు వచ్చాయి. 38 బంతుల్లో లాథమ్ అర్ధ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. భారీ భాగస్వామ్యం తర్వాత ఎట్టకేలకు కుల్దీప్ బౌలింగ్‌లో లాథమ్ అవుట్ కావడంతో టీమిండియా ఊపిరి పీల్చుకుంది. ఆ వెంటనే నీషమ్ (9), గ్రాండ్‌హోమ్ (1) ఒకే ఓవర్లో వెనుదిరగడంతో న్యూజిలాండ్ శిబిరంలో కొంత ఆందోళన పెరిగింది. అయితే శార్దుల్ ఓవర్లో సాన్ట్నర్ (12 నాటౌట్) ఫోర్, సిక్స్ బాది ఒత్తిడి తగ్గించాడు. చివరకు మరో 11 బంతులు మిగిలి ఉండగానే టేలర్ తమ జట్టును గెలిపించాడు.



నికోల్స్



లాథమ్

### స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: పృథ్వీ షా (సి) లాథమ్ (బి) గ్రాండ్‌హోమ్ 20; మయాంక్ (సి) బ్లన్‌డెల్ (బి) సౌతీ 32; కోహ్లి (బి) సోధి 51; అయ్యర్ (సి) సాన్ట్నర్ (బి) సౌతీ 103; రాహుల్ (నాటౌట్) 88; కేదార్ జాదవ్ (నాటౌట్) 26; ఎక్స్‌ట్రాలు 27; **మొత్తం (50 ఓవర్లలో 4 వికెట్లకు) 347.**
వికెట్ల పతనం: 1–50; 2–54; 3–156; 4–292.
బౌలింగ్: సౌతీ 10–1–85–2; బెన్నెట్ 10–0–77–0; గ్రాండ్‌హోమ్ 8–0–41–1; నీషమ్ 8–0–52–0; సాన్ట్నర్ 10–0–58–0; సోధి 4–0–27–1.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: గప్టిల్ (సి) జాదవ్ (బి) శార్దుల్ 32; నికోల్స్ (రనౌట్) 78; బ్లన్‌డెల్ (స్టంప్డ్) రాహుల్ (బి) కుల్దీప్ 9; టేలర్ (నాటౌట్) 109; లాథమ్ (సి) షమీ (బి) కుల్దీప్ 69; నీషమ్ (సి) జాదవ్ (బి) షమీ 9; గ్రాండ్‌హోమ్ (రనౌట్) 1; సాన్ట్నర్ (నాటౌట్) 12; ఎక్స్‌ట్రాలు 29; **మొత్తం (48.1 ఓవర్లలో 6 వికెట్లకు) 348.**
వికెట్ల పతనం: 1–85; 2–109; 3–171; 4–309; 5–328; 6–331. బౌలింగ్: బుమ్రా 10–1–53–0; షమీ 9.1–0–63–1; శార్దుల్ 9–0–80–1; జడేజా 10–0–64–0; కుల్దీప్ 10–0–84–2.

**22 పరుగుల ఓవర్...**

శార్దుల్ ఠాకూర్ వేసిన ఇన్నింగ్స్ 40వ ఓవర్లో కివీస్ పండగ చేసుకుంది. లాథమ్ ఒక సిక్స్ బాదగా...టేలర్ చివరి మూడు బంతుల్లో 6, 4, 4 కొట్టాడు. దాంతో మొత్తం 22 పరుగులు లభించాయి.

**42 బంతుల్లోనే...**

టేలర్, లాథమ్ చెలరేగిన వేళ కివీస్ దూకుడుకు ఎదురు లేకుండా పోయింది. వీరిద్దరు క్రీజ్‌లో ఉన్న సమయంలో స్కోరు 200 నుంచి 300 పరుగులకు చేరేందుకు ఆ జట్టుకు కేవలం 42 బంతులే సరిపోవడం విశేషం.

**56 ఎక్స్‌ట్రాలు!**

మ్యాచ్‌లో ఎక్స్‌ట్రాల రూపంలో ఏకంగా 56 పరుగులు నమోదయ్యాయి. న్యూజిలాండ్ 27 అదనపు పరుగులు ఇవ్వగా, భారత్ 29 పరుగులు సమర్పించుకుంది. కివీస్ 19 వైడ్లు వేయగా...టీమిండియా బౌలర్లు ఏకంగా 24 వైడ్లు వేశారు. అత్యధికంగా బుమ్రానే 9 వైడ్లు ఇచ్చాడు!

# ఆంధ్రకు తొలి ఓటమి



మార్కండే, వినయ్

- నాలుగు వికెట్లతో నెగ్గిన పంజాబ్
- మెరిసిన వినయ్, మార్కండే

పాటియాలా: ప్రస్తుత రంజీ సీజన్‌లో ఆడిన తొలి ఆరు మ్యాచ్‌ల్లో అజేయంగా నిలిచి, 27 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్న ఆంధ్ర జట్టుకు తొలి పరాజయం ఎదురైంది. పంజాబ్ జట్టుతో కేవలం రెండు రోజుల్లోనే ముగిసిన ఎలైట్ 'ఎ అండ్ బి' గ్రూప్ ఏడో రౌండ్ లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర నాలుగు వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. ఆట రెండో రోజు ఓవర్‌నైట్ స్కోరు 31/4తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర జట్టు 60.4 ఓవర్లలో 134 పరుగులకు ఆలౌటైంది. ఒకదశలో 36 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడిన ఆంధ్ర జట్టును కెప్టెన్ రికీ భుయ్ (155 బంతుల్లో 61; 4 ఫోర్లు), కేవీ శశికాంత్ (147 బంతుల్లో 47; 4 ఫోర్లు) ఆదుకున్నారు. వీరిద్దరు ఎనిమిదో వికెట్‌కు 94 పరుగులు జోడించి ఆంధ్ర జట్టు పరువు కాపాడారు. రికీ భుయ్ అవుటయ్యాక మరో నాలుగు పరుగులు జోడించి ఆంధ్ర మిగతా రెండు వికెట్లను కోల్పోయింది. లెఫ్టార్మ్ స్పిన్నర్ వినయ్ చౌదరీ 46 పరుగులకు 6 వికెట్లు... లెగ్ స్పిన్నర్ మయాంక్ మార్కండే 46 పరుగులకు 4 వికెట్లు తీసి ఆంధ్ర ఇన్నింగ్స్‌కు తెరదించారు. అనంతరం 124 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ 39 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 129 పరుగులు చేసి గెలిచింది. ఒకదశలో 32 పరుగులకు 5 వికెట్లు కోల్పోయి ఓటమిదిశగా సాగుతున్న పంజాబ్‌ను అన్‌మోల్ మల్హోత్రా (97 బంతుల్లో 51 నాటౌట్; 4 ఫోర్లు, సిక్స్), అభిషేక్ గుప్తా (60 బంతుల్లో 37; 2 ఫోర్లు, సిక్స్) గట్టెక్కించారు. వీరిద్దరు ఆరో వికెట్‌కు 69 పరుగులు జతచేశారు. అభిషేక్ అవుటయ్యాక మయాంక్ మార్కండే (9 నాటౌట్)తో కలిసి అన్‌మోల్ పంజాబ్‌కు విజయం ఖాయం చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఐదేసి వికెట్లు తీసిన ఆంధ్ర స్పిన్నర్లు షోయబ్ మొహమ్మద్ ఖాన్ (2/52), ఆశిష్ (3/50) రెండో ఇన్నింగ్స్‌లో తమవంతు కృషి చేసినా పంజాబ్ విజయాన్ని ఆపలేకపోయారు. ఈనెల 12న మొదలయ్యే చివరిదైన ఎనిమిదో లీగ్ మ్యాచ్‌లో గుజరాత్‌తో ఆంధ్ర ఆడుతుంది.

# భారత్‌కు మళ్లీ జరిమానా

హామిల్టన్: స్లో ఓవర్ రేట్ కారణంగా భారత జట్టు వరుసగా మూడో మ్యాచ్‌లోనూ భారీ జరిమానాకు గురైంది. బుధవారం జరిగిన తొలి వన్డేలో నిర్ణీత సమయంలో ఓవర్లు పూర్తి చేయనందుకు టీమిండియా ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులో ఏకంగా 80 శాతం కోత విధిస్తున్నట్లు ఐసీసీ మ్యాచ్ రిఫరీ క్రిస్ బ్రాడ్ ప్రకటించారు. భారత జట్టు నిర్ణీత సమయం ముగిసిన తర్వాత కూడా నాలుగు ఓవర్లు వేసింది. నిబంధనల ప్రకారం ఒక ఓవర్‌కు 20 శాతం చొప్పున 80 శాతం మ్యాచ్ ఫీజును జరిమానాగా విధించారు. ఇప్పటికే ఈ టూర్‌లో నాలుగో, ఐదో టి20ల్లో భారత్ 40 శాతం, 20 శాతం చొప్పున మ్యాచ్ ఫీజులను జరిమానాగా చెల్లించింది.

> *న్యూజిలాండ్ చాలా అద్భుతంగా ఆడింది. వారి బ్యాటింగ్ గొప్పగా సాగింది. 348 పరుగుల లక్ష్యం సరిపోతుందని అనుకున్నాం. టేలర్ జట్టులో అత్యంత అనుభవజ్ఞుడే అయినా లాథమ్ దూకుడైన ఇన్నింగ్స్ కారణంగానే మ్యాచ్ మా నుంచి చేజారింది. మా ఫీల్డింగ్‌లో చిన్న పొరపాటు జరిగింది కానీ మరీ నాసిరకంగా ఏమీ లేదు. దీనిని ఇంకా మెరుగుపర్చుకోవాల్సి ఉంది. ఇతర అంశాల గురించి అతిగా ఆలోచించడం లేదు. ఈ రోజు ప్రత్యర్థి మాకంటే బాగా ఆడింది కాబట్టి విజయానికి వారికే అర్హత ఉంది. కొత్త ఓపెనర్లు శుభారంభం అందించారు. ఒత్తిడిలో అయ్యర్ తొలి సెంచరీ సాధించడం, ఎప్పటిలాగే రాహుల్ చక్కటి ప్రదర్శన మాకు సానుకూలాంశాలు.*
>
> –కోహ్లి, భారత కెప్టెన్

# విజయంతో ముగించారు

## చివరి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై 3–0తో నెగ్గిన భారత మహిళల హాకీ జట్టు



ఆక్లాండ్: న్యూజిలాండ్ పర్యటనను భారత మహిళల హాకీ జట్టు విజయంతో ముగించింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగిన చివరి మ్యాచ్‌లో భారత్ 3–0 గోల్స్ తేడాతో న్యూజిలాండ్‌పై ఘనవిజయం సాధించింది. భారత్ తరఫున నవనీత్ కౌర్ (45వ, 58వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేయగా... షర్మిలా దేవి (54వ నిమిషంలో) ఒక గోల్ సాధించింది. తొలి రెండు క్వార్టర్స్‌లో ఖాతా తెరవని భారత్ మూడో క్వార్టర్ చివరి నిమిషంలో బోణీ చేసింది. ఆ తర్వాత అదే జోరు కొనసాగించి చివరి క్వార్టర్‌లో నాలుగు నిమిషాల వ్యవధిలో రెండు గోల్స్ చేసి విజయాన్ని ఖాయం చేసుకుంది.

**ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్**

Ref.No. 4.5.17/Coffee/2019-20/A2 తేది: 04.02.2020

**కాఫీ బీన్స్ అమ్మకం ప్రకటన**

2019–20 సీజన్ యొక్క గ్రేడెడ్ కాఫీ బీన్స్ అమ్మకం NCDEX ఇ–మార్కెట్స్ లిమిటెడ్ ద్వారా ఇ–వేలం ద్వారా అన్ని శుక్రవారాలలో 14 ఫిబ్రవరి నుండి మరియు 28 ఫిబ్రవరి, 2020 నుండి 3 ఏప్రిల్, 2020 వరకు మరియు 17 ఏప్రిల్, 2020న మరియు 24 ఏప్రిల్, 2020న నిర్వహించబడును. NeML వద్ద నమోదు, కాఫీ అమ్మకాల యొక్క ప్రత్యేక నియమ నిబంధనలు, అమ్మకం తేదీలు మరియు ఇతర అప్‌డేట్స్ కోసం వెబ్‌సైట్స్ www.apfdc.com/www.neml.in దర్శించండి. వివరాల కోసం సంప్రదించండి: APFDC 8008301628 & 8008554563. NeML: Tel No.: 022-66473153/ 54 (or) 08123560664/ 08099049116, ఇ–మెయిల్: askus@neml.in.

సం/– కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ & రీజినల్ మేనేజర్, A.P.F.D.C. లిమిటెడ్, విశాఖపట్నం.

DIPR RO.No.: 375-PP/CL/ADVT/1/1/2019-20 Dt : 05.02.2020



# రాహుల్‌కు రజతం

కోల్‌కతా: జాతీయ సీనియర్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు (ఆర్‌ఎస్‌పీబీ) తరఫున బరిలోకి దిగిన ఆంధ్రప్రదేశ్ వెయిట్‌లిఫ్టర్ రాగాల వెంకట్ రాహుల్ రజత పతకం సాధించాడు. 2018 గోల్డ్‌కోస్ట్ కామన్వెల్త్ గేమ్స్‌లో 85 కేజీల విభాగంలో భారత్‌కు స్వర్ణ పతకం అందించిన రాహుల్... జాతీయ చాంపియన్‌షిప్‌లో 89 కేజీల విభాగంలో పోటీపడ్డాడు. గుంటూరు జిల్లాకు చెందిన రాహుల్ మొత్తం 323 కేజీలు (స్నాచ్‌లో 144+క్లీన్ అండ్ జెర్క్‌లో 179) బరువెత్తి రెండో స్థానంలో నిలిచాడు. సాంపో లాపుంగ్ (సర్వీసెస్) 333 కేజీలు బరువెత్తి స్వర్ణం నెగ్గగా... రామ్ కరణ్ ప్రజాపతి (ఉత్తరాఖండ్) 314 కేజీలతో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు.

# దక్షిణాఫ్రికా శుభారంభం

## తొలి వన్డేలో ఇంగ్లండ్‌పై 7 వికెట్ల తేడాతో విజయం

- కెప్టెన్ డికాక్ శతకం
- బవుమా సెంచరీ మిస్



డికాక్

కేప్‌టౌన్: ప్రపంచ చాంపియన్ అయ్యాక బరిలోకి దిగిన తొలి వన్డేలో ఇంగ్లండ్ జట్టుకు చుక్కెదురైంది. సంధికాలంలో ఉన్న దక్షిణాఫ్రికా క్రికెట్.. కొత్త వన్డే జట్టు కెప్టెన్ క్వింటన్ డికాక్ ఆధ్వర్యంలో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో శుభారంభం చేసింది. భారత కాలమానం ప్రకారం మంగళవారం అర్ధరాత్రి దాటాక ముగిసిన తొలి వన్డేలో దక్షిణాఫ్రికా 7 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించింది. గతేడాది జూలైలో స్వదేశంలో జరిగిన ప్రపంచకప్‌లో విశ్వవిజేతగా నిలిచిన ఇంగ్లండ్ ఏడు నెలల విరామం తర్వాత మళ్లీ వన్డే ఆడింది. వరల్డ్ కప్ ఫైనల్లో ఆడిన జట్టులోని ఐదుగురు మాత్రమే దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి వన్డేలో బరిలోకి దిగారు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 258 పరుగులు చేసింది. జో డెన్లీ (103 బంతుల్లో 87; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), వోక్స్ (42 బంతుల్లో 40; 2 ఫోర్లు) ఆకట్టుకున్నారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో షమ్సీ 58 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం 259 పరుగుల లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 47.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి అధిగమించింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' క్వింటన్ డికాక్ (113 బంతుల్లో 107; 11 ఫోర్లు, సిక్స్) సెంచరీ చేయగా... తెంబా బవుమా (103 బంతుల్లో 98; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) రెండు పరుగుల తేడాతో శతకాన్ని చేజార్చుకున్నాడు. డికాక్, బవుమా రెండో వికెట్‌కు 173 పరుగులు జోడించారు. డికాక్, బవుమా అవుటయ్యాక... వాన్ డెర్ డసెన్ (45 బంతుల్లో 38 నాటౌట్; 3 ఫోర్లు), స్మట్స్ (7 నాటౌట్) దక్షిణాఫ్రికాను విజయతీరాలకు చేర్చారు. సిరీస్‌లోని రెండో వన్డే శుక్రవారం డర్బన్‌లో జరుగుతుంది.

# హైదరాబాద్ హంటర్స్ జట్టుకు ఆరో స్థానం

సాక్షి, హైదరాబాద్: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్)లో హైదరాబాద్ హంటర్స్ జట్టు ఆరో స్థానంలో నిలిచింది. బుధవారంతో హంటర్స్ లీగ్ మ్యాచ్‌లు పూర్తయ్యాయి. చివరి మ్యాచ్‌లో హంటర్స్ జట్టు 1–2తో పుణే సెవెన్ ఏసెస్ జట్టు చేతిలో ఓడిపోయింది. ఓవరాల్‌గా 11 పాయింట్లతో హంటర్స్ ఆరో స్థానాన్ని పొందింది. హంటర్స్ తరఫున మహిళల సింగిల్స్‌లో ప్రపంచ చాంపియన్ పీవీ సింధు... మిక్స్‌డ్ డబుల్స్‌లో నేలకుర్తి సిక్కి రెడ్డి–ఇవనోవ్ జంట గెలిచింది. సింధు 15–7, 15–8తో రితుపర్ణ దాస్ (పుణే)పై నెగ్గగా... సిక్కి రెడ్డి–ఇవనోవ్ ద్వయం 15–9, 11–15, 15–8తో క్రిస్ అడ్‌కాక్–గాబ్రియేలా అడ్‌కాక్ (పుణే) జోడీని ఓడించింది. పుణే తరఫున పురుషుల డబుల్స్‌లో చిరాగ్ శెట్టి–సెతియావాన్ జంట... పురుషుల సింగిల్స్ మ్యాచ్‌ల్లో మంజునాథ్, లో కీన్ యెవ్ గెలిచారు. ఇప్పటికే నార్త్ ఈస్టర్న్ వారియర్స్, చెన్నై సూపర్‌స్టార్స్, పుణే సెవెన్ ఏసెస్ జట్లు సెమీస్ చేరగా... నేడు అవధ్ వారియర్స్, బెంగళూరు రాప్టర్స్ జట్ల మధ్య మ్యాచ్ విజేత చివరిదైన నాలుగో సెమీస్ బెర్త్‌ను దక్కించుకుంటుంది.

राष्ट्रीय ग्रामीण विकास एवं पंचायती राज संस्थान
**నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ & పంచాయతీ రాజ్**
రాజేంద్రనగర్, హైదరాబాద్–500030.
గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వం

**ప్రవేశ ప్రకటన**
రూరల్ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్‌లో కెరీర్ కోసం దరఖాస్తు కోరుతోంది

**1. AICTE అప్రూవ్డ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్–రూరల్ మేనేజ్‌మెంట్ (PGDM-RM) 2020–22 బ్యాచ్–3**
రెండు సంవత్సరాల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్
**అర్హత:** కనీసం 50% మార్కులతో (SC/ST/PWD లకు 45%) బ్యాచిలర్స్ డిగ్రీ
**క్వాలిఫైయింగ్ ఎగ్జామ్స్:** CAT/MAT/XAT/ATMA/CMAT/GMATలో దేనిలోనైనా వ్యాలిడ్ స్కోర్స్‌పై ఆధారపడి ఎంపిక ఉంటుంది.
మరిన్ని వివరాలకు దర్శించండి: **www.nirdpr.org.in**

**2. పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ రూరల్ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్ (PGDRDM) 2020–21 బ్యాచ్–18**
ఒక సంవత్సరం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్
**అర్హత:** కనీసం 50% మార్కులతో (SC/ST/PWD లకు 45%) బ్యాచిలర్స్ డిగ్రీ
**క్వాలిఫైయింగ్ ఎగ్జామ్స్:** CAT/XAT/MAT/ATMA/CMAT/GMATలో దేనిలోనైనా వ్యాలిడ్ స్కోర్స్‌పై (లేదా) NIRDPR చే నిర్వహించబడి ఆలిండియా ఎంట్రన్స్ టెస్ట్‌లో క్వాలిఫై అయిన దానిపై ఆధారపడి ఎంపిక ఉంటుంది.
**i) ఆఖరు తేది: 10–04–2020, ii) కోర్సు ప్రారంభం: 2020 జూన్**
మరిన్ని వివరాలకు దర్శించండి: **www.nirdpr.org.in, ఫోన్– 040–24008460 / 442 / 540**
ఇ–మెయిల్: **cpgs.nird@gov.in**

ట్రైనింగ్ & కెపాసిటీ బిల్డింగ్ | రిసెర్చ్ & కన్సల్టెన్సీ | పాలసీ ఫార్ముల్యేషన్ & అడ్వకసి | టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ | అకాడమిక్ ప్రోగ్రామ్స్ | ఇన్నోవేటివ్ స్కిల్లింగ్ & లైవ్‌లీహుడ్

## స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 353 ▲ | 109 ▲ |
| 41,143 | 12,089 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30కి)

| | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 9,501 | ▲ 33 |
| డోజోన్స్ | 29,163 | ▲ 355 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,482 | ▲ 43 |
| డాక్స్ | 13,478 | ▲ 197 |
| షాంఘై | 2,818 | ▲ 34 |
| నికాయ్ | 23,320 | ▲ 235 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|
| యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 70.46 | 72.10 |
| బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 91.25 | 94.45 |
| యూరో | ఎస్‌బీఐ | 77.19 | 80.10 |
| జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 63.93 | 66.33 |
| ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.00 | 49.17 |
| సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 50.76 | 52.51 |
| సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.21 | 19.81 |
| యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.93 | 19.94 |
| చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.59 | 10.99 |


మహీంద్రా ఫన్‌స్టర్ ఎలక్ట్రిక్ కాన్సెప్ట్ కారు

# హంగామా షురూ..

లాంఛనంగా ఆటో ఎక్స్‌పో 2020 ప్రారంభం ● 7-12 దాకా సందర్శకులకు ఎంట్రీ

## పాల్గొంటున్న దేశ, విదేశ వాహన దిగ్గజాలు


మారుతీ ఫ్యూచరో-ఈ ఎస్‌యూవీ

**న్యూఢిల్లీ:** ఆటోమొబైల్ పరిశ్రమ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఆటో ఎక్స్‌పో 2020 మోటార్ షో ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో బుధవారం లాంఛనంగా ప్రారంభమైంది. తొలి రెండు రోజుల్లో వ్యాపార వర్గాలను అనుమతించనుండగా.. 7 నుంచి 12 దాకా సామాన్య ప్రజలు కూడా సందర్శించవచ్చు. దేశ, విదేశాలకు చెందిన పలు దిగ్గజ ఆటోమొబైల్ సంస్థలు ఇందులో తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నాయి. 15 పైగా స్టార్టప్ సంస్థలు, టెలికం, విద్యుత్ వాహనాల సంస్థలు, సోషల్ మీడియా సంస్థలు ఈ 15వ ఆటో ఎక్స్‌పోలో పాల్గొంటున్నాయి. 'పర్యావరణ అనుకూలమైన, సురక్షితమైన వాహనాలు, విద్యుత్ వాహనాలు, స్మార్ట్ వాహనాలకు సంబంధించిన కొంగొత్త టెక్నాలజీలను కంపెనీలు ఈ ఎక్స్‌పోలో ప్రదర్శిస్తున్నాయి' అని భారతీయ ఆటోమొబైల్ తయారీదారుల సమాఖ్య... సియామ్ డైరెక్టర్ జనరల్ రాజేష్ మీనన్ ఈ సందర్భంగా చెప్పారు. సుమారు 60 దాకా ప్యాసింజర్ కార్లు, కమర్షియల్ వాహనాలు, ద్విచక్ర వాహనాలను కంపెనీలు ఈ ఆటో షోలో ఆవిష్కరించనున్నాయి. అయితే, వీటిలో ఎక్కువ భాగం వాహనాలు.. కొత్త బీఎస్-6 కాలుష్య ప్రమాణాలకు అప్‌గ్రేడ్ చేస్తున్న గత మోడల్స్ కొత్త వెర్షన్లే ఉండనున్నాయి. భారతీయ పరిశ్రమల సమాఖ్య... సీఐఐతో పాటు ఏసీఎంఏ, సియామ్ కలిసి ఈ ఆటో ఎక్స్‌పోను నిర్వహిస్తున్నాయి. అమ్మకాల క్షీణత తదితర సమస్యలతో వాహన పరిశ్రమ సతమతమవుతున్న తరుణంలో జరుగుతున్న ఆటోమొబైల్ ఎక్స్‌పో మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

బయో ఇథనాల్ ఉత్పత్తిలో ప్రపంచంలోనే అగ్రశ్రేణి సంస్థల్లో ఒకటైన బ్రెజిల్‌కి చెందిన చరకు పరిశ్రమ సమాఖ్య యూనికా, ఇటాలియన్ టైర్ల సంస్థ పిరెలీ, డిజైన్ కంపెనీ ఐకోనా వంటివి ఈ షోలో పాల్గొంటున్నాయి. కొత్త విదేశీ సంస్థల ఉత్పత్తులు ఇందులో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. చైనాకు చెందిన గ్రేట్ వాల్ మోటార్, ఎఫ్ఏడబ్ల్యూ హైమా, ఒలెక్ట్రా, ఎంజీ మోటార్స్ మొదలైనవి కార్లు, ఎస్‌యూవీలు, బస్సులు తదితర వాహనాలను ప్రదర్శించనున్నాయి. తాజా వార్తలు, ఈవెంట్స్‌ను ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లోని ఆటోఎక్స్‌పో 2020 పేజ్‌లలో ఎప్పటికప్పుడు లైవ్‌లో అందించేందుకు సియామ్, ఫేస్‌బుక్ చేతులు కలిపాయి.

### జీడబ్ల్యూఎం 1 బిలియన్ డాలర్ల పెట్టుబడులు..

చైనాకు ఎస్‌యూవీ దిగ్గజం గ్రేట్ వాల్ మోటార్స్ (జీడబ్ల్యూఎం) భారత్‌లో బిలియన్ డాలర్ల (సుమారు రూ.7,100 కోట్లు) మేర ఇన్వెస్ట్ చేయనున్నట్లు వెల్లడించింది. పరిశోధన.. అభివృద్ధి, తయారీ, సేల్స్..మార్కెటింగ్‌పై ఈ పెట్టుబడులు పెట్టనున్నట్లు జీడబ్ల్యూఎం భారత అనుబంధ సంస్థ డైరెక్టర్ హర్‌దీప్ బ్రార్ తెలిపారు. వచ్చే 3-5 ఏళ్లలో ప్రపంచంలోనే తమకు టాప్ 3 మార్కెట్లలో భారత్ కూడా చేరగలదని విశ్వసిస్తున్నట్లు ఆయన చెప్పారు. బెంగళూరులో తమ పరిశోధనా కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేయనున్నట్లు, దశలవారీగా 3,000 మందికి పైగా ప్రత్యక్షంగా ఉద్యోగాలు కల్పించనున్నట్లు బ్రార్ వివరించారు.


### ఎలక్ట్రిక్ వాహనాల సందడి..

ఆటో షోలో కొంగొత్త ఎలక్ట్రిక్ వాహనాలు ఎక్కువగా కొలువుతీరాయి. టాటా మోటార్స్ నెక్సాన్ ఈవీ, ఆల్ట్రోజ్ ఈవీలతో పాటు 'లో ఫ్లోర్ ఎంట్రీ ఎలక్ట్రిక్ బస్'ను ప్రదర్శిస్తోంది. ఇప్పటికే 100 చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామని, రాబోయే 2-3 ఏళ్లలో ఎలక్ట్రిక్ వాహనాల ఇన్‌ఫ్రా మరింత మెరుగుపడగలదని టాటా మోటార్స్ ప్రెసిడెంట్ శైలేష్ చంద్ర తెలిపారు. జీడబ్ల్యూఎం తమ హావల్ కాన్సెప్ట్ హెచ్ వాహనాన్ని ఆవిష్కరించింది. దీంతో పాటు విజన్ 2025 ప్యూర్ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీని ప్రదర్శిస్తోంది. మారుతీ సుజుకీ.. తమ కాన్సెప్ట్ ఎలక్ట్రిక్ వాహనం 'ఫ్యూచరో-ఈ'ని ఆవిష్కరించింది. ఎంజీ మోటార్ ఇండియా.. కొత్త మార్వెల్ ఎక్స్ వాహనాన్ని ప్రదర్శనకు ఉంచింది.



సుజుకీ జిక్సర్ ఎస్ఎఫ్, సుజుకీ యాక్సెస్ 125 బీఎస్6 సుజుకీ వీస్ట్రామ్ 650 ఎక్స్‌టీ 2020 ఎడిషన్


స్కోడా విజన్ ఇన్


కియా సోనెట్ కాన్సెప్ట్ కారు


వెస్పా స్కూటర్


మారుతీ ఎస్-ప్రెసో


మెర్సిడెస్ బెంజ్ ఎ-క్లాస్ లిమోజిన్


హ్యుందాయ్ కోనా ఎలక్ట్రిక్ కారు


కియా మోటార్స్ సెల్టోస్

# ధూమ్ 2020 షో


హ్యుందాయ్ లె ఫిల్ రూజ్ కాన్సెప్ట్ కారు


ఫోర్డ్ మోటార్స్ ఆఫ్‌రోడ్ జీప్ 'గూర్ఖా'


ఫోక్స్‌వ్యాగన్ టిగ్వాన్ | టాటా మోటార్స్ సియెరా కాన్సెప్ట్ కారు | కియా మోటార్స్ కార్నివాల్ | రెనో జో | ఫోక్స్‌వ్యాగన్ టీ-రాక్ | జీడబ్ల్యూఎం హవల్ 2025 కాన్సెప్ట్ కారు | ఎంజీ మోటార్స్ మార్వెల్ ఎక్స్

**నేటి బోర్డ్ మీటింగ్స్:** హీరో మోటోకార్ప్, సన్ ఫార్మా, లుపిన్, అరబిందో ఫార్మా, ఎన్ఎమ్‌డీసీ.

## బులియన్ రూ.లలో

| | | |
|---|---|---|
| **ముంబై** | | |
| బంగారం (99.9, 10గ్రా) | 41,420 | ▼ 160 |
| బంగారం (99.5, 10గ్రా) | 39,450 | ▼ 150 |
| వెండి (కిలో) | 49,400 | ▼ 300 |
| **హైదరాబాద్/చెన్నై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 40,290 | ▼ 200 |
| బంగారం (22 క్యారెట్లు) | 38,370 | ▼ 190 |
| వెండి (కిలో) | 49,400 | ▼ 300 |
| **ప్రొద్దుటూరు** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 40,700 | ▼ 100 |
| బంగారం (22 క్యారెట్లు) | 37,550 | ▼ 180 |
| వెండి (కిలో) | 47,300 | 0 |
| **విశాఖపట్నం** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 41,370 | ▼ 260 |
| బంగారం (22 క్యారెట్లు) | 38,480 | ▼ 240 |
| వెండి (కిలో) | 47,500 | 0 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 41,510 | ▼ 230 |
| బంగారం (22 క్యారెట్లు) | 38,370 | ▼ 190 |
| వెండి (కిలో) | 47,000 | ▼ 300 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

## కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 5-2-2020

| | |
|---|---|
| విశాఖ | 375-00 |
| చిత్తూరు | 383-00 |
| వరంగల్ | 318-00 |
| విజయవాడ | 325-00 |
| గోదావరి | 325-00 |
| **6-2-2020 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 315-00 |

# సహకార బ్యాంకులు మరింత బలోపేతం


**బ్యాంకింగ్ చట్టాల సవరణకు క్యాబినెట్ ఆమోదం**



**న్యూఢిల్లీ:** పీఎంసీ బ్యాంక్ తరహా సంక్షోభం మరోసారి తలెత్తకుండా డిపాజిట్‌దారుల ప్రయోజనాల పరిరక్షణ, సహకార బ్యాంకులను మరింత పటిష్టం చేసే దిశగా బ్యాంకింగ్ నియంత్రణ చట్టానికి సవరణను కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోదించింది. దీని ప్రకారం సీఈవోల నియామకం వంటి పలు కీలక అంశాల్లో కమర్షియల్ బ్యాంకుల తరహాలోనే సహకార బ్యాంకులు కూడా రిజర్వ్ బ్యాంక్ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. సీఈవో అభ్యర్థుల అర్హత వంటివి ఆర్‌బీఐ నిర్దేశిస్తుంది. ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారమే ఆడిటింగ్ జరపాల్సి ఉంటుంది. ఒకవేళ ఏదైనా కోఆపరేటివ్ బ్యాంక్ సంక్షోభంలో ఉంటే.. దాని బోర్డును రద్దు చేసి, ఆర్‌బీఐ తన అధీనంలోకి తీసుకోవచ్చు. ఆర్‌బీఐ మార్గదర్శకాలను దశలవారీగా పాటించేందుకు సహకార బ్యాంకులకు తగినంత సమయం ఇస్తామని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్ తెలిపారు. పీఎంసీ బ్యాంక్‌లో స్కామ్ కారణంగా ఆర్‌బీఐ ఆంక్షలు విధించడం, లక్షలాది ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనాల్సి రావడం వంటి అంశాల నేపథ్యంలో సహకార బ్యాంకులకు సంబంధించిన తాజా చట్ట సవరణ ప్రాధాన్యం సంతరించుకుంది.

# 12,000 పాయింట్లపైకి నిఫ్టీ

- తగ్గిన కరోనా భయాలు
- సానుకూల అంతర్జాతీయ సంకేతాలు



కరోనా వైరస్‌తో వచ్చే రోగానికి చికిత్స విషయంలో కీలక విజయం లభించిందన్న వార్తలతో ప్రపంచ మార్కెట్లు పెరిగాయి. మరిన్ని నిధులను చైనా అందుబాటులోకి తెచ్చింది. ఇలా అంతర్జాతీయ సంకేతాలు అనుకూలంగా ఉండటంతో బుధవారం స్టాక్ మార్కెట్ లాభపడింది. సెన్సెక్స్, నిఫ్టీలు వరుసగా మూడో రోజూ లాభాల్లోనే ముగిశాయి. సెన్సెక్స్ 41,000 పాయింట్లు, నిఫ్టీ 12,000 పాయింట్లపైకి ఎగబాకాయి. ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ సమావేశం మొదలైన నేపథ్యంలో (నేడు-గురువారం ఉదయం 11.45ని. రేట్ల నిర్ణయం వెలువడుతుంది)వడ్డీరేట్ల ప్రభావిత షేర్లు లాభపడటం కలసివచ్చింది. భారత సేవల రంగం గత నెలలో ఏడేళ్ల గరిష్ట స్థాయికి చేరడం సెంటిమెంట్‌కు జోష్‌నిచ్చింది. ముడి చమురు ధరలు 2 శాతం మేర ఎగసినప్పటికీ, డాలర్‌తో రూపాయి మారకం విలువ అంతంతమాత్రం రేంజ్‌లోనే ట్రేడైనప్పటికీ, మన మార్కెట్ ముందుకే దూసుకుపోయింది. బీఎస్‌ఈ సెన్సెక్స్ 353 పాయింట్లు లాభపడి 41,143 పాయింట్ల వద్ద, ఎన్ఎస్‌ఈ నిఫ్టీ 110 పాయింట్లు పెరిగి 12,089 పాయింట్ల వద్ద ముగిశాయి. గత మూడు రోజుల్లో సెన్సెక్స్ 1,407 పాయింట్లు, నిఫ్టీ 427 పాయింట్ల మేర పెరిగాయి. ఆసియా, యూరప్ మార్కెట్లు లాభాల్లోనే ముగిశాయి. టాటా స్టీల్ షేర్ 5 శాతం లాభంతో రూ.475 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా లాభపడిన షేర్ ఇదే. ఎయిర్‌టెల్ 3% లాభంతో రూ.533 వద్ద ముగిసింది. ఈ షేర్‌తో పాటు పీవీఆర్, శ్రీ సిమెంట్, ఐఆర్‌సీటీసీ, ఎస్ఆర్ఎఫ్, టాటా గ్లోబల్, అవెన్యూ సూపర్ మార్ట్స్, బాటా, బెర్జర్ పెయింట్స్ తదితర షేర్లు ఇంట్రాడేలో ఆల్‌టైమ్ హైలను తాకాయి.

### మార్చి చివరికి పీఎస్‌యూ బీమా కంపెనీల విలీనం

**న్యూఢిల్లీ:** ప్రభుత్వరంగంలోని సాధారణ బీమా సంస్థలు.. నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ, ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీల విలీనాన్ని మార్చి చివరికి పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉన్నట్టు కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి రాజీవ్‌కుమార్ వెల్లడించారు.

### పెట్టుబడుల ఉపసంహరణకు ముందే ఆస్తుల విక్రయం

**న్యూఢిల్లీ:** పెట్టుబడుల ఉపసంహరణకు ముందే కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలకు సంబంధించి మిగులు భూములు ఏవైనా ఉంటే మార్కెట్ రేటుకు ఆయా రాష్ట్రాలు లేదా ప్రయివేటు పార్టీలకు విక్రయించనున్నట్టు కేంద్రం బుధవారం స్పష్టం చేసింది. పెట్టుబడుల ఉపసంహరణ విధానాన్ని పారదర్శకంగా నిర్వహిస్తామని రాజ్యసభలో ఓ సభ్యుని ప్రశ్నకు సమాధానంగా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు.

### ఏడేళ్ల గరిష్టానికి సేవల రంగం కార్యకలాపాలు

**న్యూఢిల్లీ:** భారత సేవల రంగం కార్యకలాపాలు జనవరి నెలలో ఏడేళ్ల గరిష్ట స్థాయికి చేరాయి. ఐహెచ్ఎస్ మార్కిట్ ఇండియా సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ డిసెంబర్‌లో ఉన్న 53.3 పాయింట్ల నుంచి జనవరి నెలలో 55.5 పాయింట్లకు చేరుకుంది.

### యస్ బ్యాంక్ ఎండీపై చర్యలు తీసుకోండి..!

**న్యూఢిల్లీ:** నియంత్రణ సంస్థ నిర్దేశించిన పలు నిబంధనల ఉల్లంఘనకు గాను ప్రైవేట్ రంగ యస్ బ్యాంక్ సీఈవో, ఎండీ రవ్‌నీత్ గిల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఆ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ప్రకాష్ అగర్వాల్ తాజాగా రిజర్వ్ బ్యాంక్‌కు లేఖ రాశారు.

# బీపీసీఎల్‌పై రష్యా రాస్‌నెఫ్ట్ ఆసక్తి



**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్) కొనుగోలుపై రష్యాకు చెందిన చమురు దిగ్గజం రాస్‌నెఫ్ట్ కూడా ఆసక్తిగా ఉంది. బుధవారం కేంద్ర చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో సమావేశంలోనూ, ఆ తర్వాత ఇతర ఉన్నతాధికారులతో భేటీలోను రాస్‌నెఫ్ట్ సీఈవో ఇగోర్ సెషిన్ ఈ డీల్‌పై ఆసక్తి వ్యక్తం చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దీర్ఘకాలిక ప్రాతిపదికన ముడిచమురు సరఫరాకు సంబంధించి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ)తో ఒప్పందం కుదుర్చుకున్న సందర్భంగా.. భారత్‌లో మరింతగా ఇన్వెస్ట్ చేయాలని భావిస్తున్నట్లు సెషిన్ చెప్పారని వివరించాయి. ఈ బిడ్డింగ్‌లో పాల్గొనేలా.. సౌదీ ఆరామ్‌కో, ఏడీఎన్‌వోసీ తదితర మధ్య ప్రాచ్య సంస్థలతోనూ కేంద్రం చర్చించినట్లు పేర్కొన్నాయి.

## అక్టోబర్-డిసెంబర్ క్వార్టర్ ఫలితాలు

| | నికర లాభం | | | మొత్తం ఆదాయం | | |
|---|---|---|---|---|---|---|
| కంపెనీ | 2019-20 | 2018-19 | వృ./క్షీ.(%) | 2019-20 | 2018-19 | వృ./క్షీ.(%) |
| హెచ్‌పీసీఎల్ | 747 | 248 | 3 రెట్లు | 74,288 | 76,884 | -3 |
| అదానీ ఎంటర్. | 383 | 81 | 4 రెట్లు | 11,075 | 10,548 | 5 |
| క్యాడిలా హెల్త్‌కేర్ | 374 | 511 | -27 | 3,638 | 3.578 | 2 |
| సిప్లా | 339 | 322 | 5 | 4,371 | 4,008 | 9 |
| ★ ఐబీ హౌ. ఫై. | 547 | 973 | -44 | 3,370 | 4,478 | -25 |
| ఆంధ్రాబ్యాంక్ | 175 | (574) | -- | 5,913 | 5,609 | 5 |

★ ఒక్కో షేర్‌కు రూ.6 మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. రికార్డ్ డేట్ ఫిబ్రవరి 15 (నష్టం)

# హావెల్స్ నూతన శ్రేణి వాటర్ ప్యూరిఫయర్లు

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** హావెల్స్ ఇండియా నూతన శ్రేణి ఆల్కలైన్ వాటర్ ప్యూరిఫయర్లను విడుదల చేసింది. మార్కెట్లో చాలా ఆర్‌వో ప్యూరిఫయర్లు 70 శాతం నీటిని వృథా చేస్తాయని, రికవరీ 30 శాతమే ఉంటుందని కంపెనీ సీరియర్ వైస్ ప్రెసిడెంట్ సురేష్ సిసోడియా తెలిపారు. వైస్ ప్రెసిడెంట్లు శశాంక్ శ్రీవాస్తవ్, అనిల్ శర్మ, బిజినెస్ హెడ్ వి.మహేందర్‌తో కలిసి బుధవారమిక్కడ మీడియాతో మాట్లాడారు. హావెల్స్ రూపొందించిన డిలైట్ ఆల్కలైన్ హై రికవరీ మోడల్‌తో 50 శాతం నీరు రికవరీ అవుతుందని వెల్లడించారు. ఉత్పత్తుల ధరల శ్రేణి రూ.15,000తో మొదలుకుని రూ.24,000 వరకు ఉందని వివరించారు. రానున్న రోజుల్లో ఇతర మోడల్స్‌ను కూడా ఆల్కలైన్ వాటర్ ప్యూరిఫయర్లుగా తీర్చిదిద్దుతామన్నారు.


కొత్త ప్యూరిఫయర్లతో సురేశ్, మహేందర్, శశాంక్, అనిల్ (ఎడమ నుంచి)

epaper.sakshi.com

## పాతగుట్టలో వైభవంగా ధ్వజారోహణం

**యాదగిరిగుట్ట :** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం రెండవ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం ధ్వజారోహణం నిర్వహించారు. స్వామి వారి వాహనమైన గరుడ ఆళ్వారును కొత్త వస్త్రంపై చిత్రించి పూజలు చేశారు. గరుడముద్దలను ధ్వజస్తంభం వద్ద పైకి ఎగురవేశారు. సాయంత్రం భేరిపూజ, దేవతాహ్వానం జరిపించారు. గురువారం సాయంత్రం శ్రీస్వామి వారికి ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తారు. ఈ వేడుకల్లో స్థానాచార్యులు రాఘవచార్యులు, ఆలయ ఈఓ గీతారెడ్డి, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.


ధ్వజారోహణం నిర్వహిస్తున్న ఆచార్యులు

## 37 రోజులు.. రూ.73.38 లక్షలు

### భద్రాద్రి రామయ్య హుండీ ఆదాయం

**భద్రాచలం టౌన్:** భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారికి 37 రోజుల్లో హుండీల ద్వారా రూ.73,38,315 ఆదాయం సమకూరినట్లు దేవస్థానం ఈఓ గదరాజు నర్సింహులు తెలిపారు. బుధవారం ఉదయం రామాలయ ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో హుండీలను లెక్కించామని చెప్పారు. నగదుతో పాటు బంగారం 60 గ్రాములు, వెండి 600 గ్రాములు, 467 అమెరికా డాలర్లు, 3 బ్యాంక్ ఆఫ్ మలేషియా రింగిట్స్, 100 ఇంగ్లండ్ పౌండ్స్, ఖతార్ రియాల్స్ 1,000, ఆస్ట్రేలియా డాలర్లు 10, కెనడా డాలర్లు 10, బహ్రెయిన్ దినార్లు 3 వచ్చాయని వివరించారు.


హుండీలను లెక్కిస్తున్న దృశ్యం

## సిరిసిల్ల నేతకు కొత్త హంగులు

### పవర్‌లూమ్స్‌పై ఎలక్ట్రానిక్ జకార్డు ఏర్పాటు

**సిరిసిల్ల:** సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ఆధునిక హంగులు సమకూర్చుకుంటోంది. నేత కళాకారులు ఇప్పటికే పవర్‌లూమ్స్‌పై అనేక ప్రయోగాలు చేస్తుండగా, తాజాగా నేతకళాకారుడు వెల్ది హరిప్రసాద్ తన కార్ఖానాలో ఎలక్ట్రానిక్ జకార్డు ఏర్పాటు చేశాడు. పిక్ ఆప్ పిక్ పవర్‌లూమ్ ఏర్పాటు చేసి తొలుత వినాయకుని చిత్రాన్ని వస్త్రంపై నేశాడు. ఇప్పటికే బుల్లి మగ్గం, బుల్లి రాట్నం, ఉంగరంలో దూరే చీర, అగ్గిపెట్టెలో ఇమిడే చీర, సూది రంధ్రంలో దూరే చీరలను తయారు చేసిన హరిప్రసాద్ ఆధునిక జకార్డుతో కొత్త దనంవైపు అడుగులు వేస్తున్నాడు. దీని ద్వారా కోరుకున్న డిజైన్లలో సులభంగా వస్త్రాలను ఉత్పత్తి చేయడానికి వీలుంటుంది. పట్టణ శివారులోని హరిప్రసాద్ జకార్డు యంత్రాన్ని టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్ బుధవారం సందర్శించారు. హరిప్రసాద్ కృషిని ఆయన అభినందించారు.


ఎలక్ట్రానిక్ జకార్డు గురించి వివరిస్తున్న హరిప్రసాద్

## కండరాల వ్యాధి నిర్మూలనపై పరిశోధన

### ఐఐటీ హైదరాబాద్ బృందం వెల్లడి

**సంగారెడ్డి టౌన్:** కండరాలపై తీవ్ర ప్రభావం చూపి పక్షవాతం, మరణానికి కారణమయ్యే అమియోట్రోఫిక్ లాటరల్ స్లెరోసిస్ వ్యాధికి మందు కనిపెట్టడంలో ఐఐటీ హైదరాబాద్ పరిశోధకుల కృషి ఫలిచింది. ఇప్పటివరకు మందులు లేని ఈ వ్యాధిని తగ్గించేందుకు ఐఐటీ పరిశోధకులు ఏఐఎమ్4 అనే అణువును అభివృద్ధి చేశారు. దీనికి సంబంధించి ఐఐటీ హైదరాబాద్ బయో టెక్నాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ బసంత్‌కుమార్ బుధవారం వివరాలు వెల్లడించారు. టీడీపీ 43 అనే క్లిష్టమైన ప్రొటీన్‌కు కోడ్ చేసే జన్యువుల్లో మార్పుల వల్ల అమియోట్రోఫిక్ లాటరల్ స్లెరోసిస్ వ్యాధి వస్తుందని తెలిపారు. ఈ పరిశోధనలో డాక్టర్ సందీప్‌సింగ్, రాజకుమార ఈరప్ప, కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ గణేషన్ ప్రభుశంకర్ పాల్గొన్నట్టు తెలిపారు. తమ పరిశోధనను ఇటీవల పీర్ రివ్యూడ్ ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ బయో లాజికల్ మాక్రోమాలిక్యూల్స్‌లో ప్రచురించామని చెప్పారు.


పరిశోధన వివరాలు తెలియజేస్తున్న ప్రొఫెసర్ బసంత్ కుమార్ బృందం

## పూడ్చిపెట్టిన మృతదేహానికి గుండుగీసిన దుండగులు

**పటాన్‌చెరు టౌన్:** పూడ్చిపెట్టిన మృతదేహాన్ని బయటికి తీసి గుండు గీసిన సంఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పటాన్‌చెరు మండలం పోచారం గ్రామపరిధిలోని గణపతిగూడెంకు చెందిన మల్లమ్మ (మేరమ్మ) (65) ఆదివారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు సోమవారం ఆమెను క్రైస్తవ సంప్రదాయం ప్రకారం సమాధి చేశారు. ఈ క్రమంలో మంగళవారం మూడోరోజు కావడంతో కుటుంబ సభ్యులు సమాధి దగ్గరికి వెళ్లగా.. మృతురాలి తల వెంట్రుకలు బయట ఉన్నాయి. అనుమానం వచ్చిన కుటుంబసభ్యులు మృతదేహాన్ని బయటకు తీసి చూడగా శవానికి గుండు గీసి ఉంది. దీంతో వారు పటాన్‌చెరు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## బాసర ట్రిపుల్‌ఐటీలో విద్యార్థి ఆత్మహత్యాయత్నం

**బాసర(ముథోల్):** నిర్మల్ జిల్లాలోని బాసర ట్రిపుల్‌ఐటీ (ఆర్జీయూకేటీ)లో బుధవారం ఓ విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలానికి చెందిన బోండ్ల సంజయ్ అనే విద్యార్థి.. సాయిచరణ్ అనే మరో విద్యార్థితో మంగళవారం రాత్రి ఓ అమ్మాయి విషయమై ఘర్షణ పడ్డాడు. దీనిపై సాయిచరణ్.. సంజయ్‌పై అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అధికారులు వీరిని ప్రత్యేక గదిలో ఉంచారు. బుధవారం ఉదయం సంజయ్‌ని విచారించే సమయంలో మరుగుదొడ్డికి వెళ్తానని చెప్పిన సంజయ్ నాలుగు అంతస్తుల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన తోటి విద్యార్థులు, సిబ్బంది చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. తమ తల్లిదండ్రులకు యూనివర్సిటీ అధికారులు విషయం చెబుతారేమోననే భయంతోనే సంజయ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలుస్తోంది.


విద్యార్థి సంజయ్

### విద్యార్థిని పరామర్శించిన వీసీ

విద్యార్థి ఆత్మహత్యాయత్నంపై కళాశాల యాజమాన్యం స్పందించింది. వీసీ అశోక్‌కుమార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి సంజయ్‌ను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తామని వైద్య ఖర్చులు యూనివర్సిటీ భరిస్తుందని వీసీ పేర్కొన్నారు.


దక్షిణ రాజగోపురం, తూర్పు రాజగోపురం ముందు భాగంలో రాతి ఫ్లోరింగ్


శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయం (శివాలయం)


పడమటి రాజగోపురం

# స్వయంభువుల దర్శనానికి మరికొంత కాలం

**యాదాద్రిలో కొనసాగుతున్న పనులు**

**పనులు పూర్తికాకపోవడంతో యాగం వాయిదా**


**మరోసారి యాదాద్రికి రానున్న సీఎం కేసీఆర్**

సాక్షి, యాదాద్రి

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి స్వయంభువుల దర్శనం మరింత ఆలస్యం కానుంది. సీఎం కేసీఆర్ యాదాద్రి పుణ్యక్షేత్రంలో మహా సుదర్శనయాగం చేపట్టి ఫిబ్రవరిలో భక్తులకు గర్భాలయంలో స్వామి దర్శనం కల్పించాలని గతంలో నిర్ణయించారు. అయితే ప్రధానాలయం పనులు పూర్తి కావస్తున్నప్పటికీ అనుబంధ పనులు ఎక్కడిక్కడే ఉన్నాయి. గత డిసెంబర్ 17న సీఎం యాదాద్రికి వచ్చి పనులను పరిశీలించి వెళ్లారు. అయితే పనులు మరింత ఆలస్యం అయ్యే పరిస్థితిని గుర్తించిన సీఎం.. మరోమారు తాను త్రిదండి చిన జీయర్‌స్వామితో కలసి యాదాద్రికి వస్తానని ప్రకటించారు. కానీ ఫిబ్రవరి వచ్చినా పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. వచ్చే నృసింహస్వామి జయంతి లేదా దసరా నాటికి పనులు పూర్తి కావచ్చని అధికారవర్గాల ద్వారా తెలుస్తోంది.

### ప్రధానాలయంలో..

ప్రధాన ఆలయంలోని గర్భాలయ ముఖ మండపంపై ప్రహ్లాద చరిత్ర ఘట్టాలకు సంబంధించిన 10 ప్యానళ్లను అమర్చారు. మిగతా పనులు జరుగుతున్నాయి. ప్రధాన ఆలయంలోనే బలిపీఠం, ధ్వజస్తంభాలకు రాగి తొడుగులు అమరుస్తున్నారు. అంతర ప్రాకార మండపం పైభాగం, బాహ్య ప్రాకార మండపం, అష్టభుజి ప్రాకార మండపం పైభాగాల్లో తుది మెరుగులు దిద్దుతున్నారు. అలాగే తూర్పు, ఉత్తర రాజ గోపురాలపై తుది మెరుగులు దిద్దుతున్నారు. ఏసీలు, లిఫ్టులు, మెట్లు, గర్భాలయంలో ఇతర పనులు పూర్తి కావాల్సి ఉంది. కాగా, పడమటి రాజగోపురం ముందు భాగంలో ఏర్పాటు చేసిన వేంచేపు మండపం ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంది. తూర్పు రాజగోపురం ముందు భాగంలో నిర్మిస్తున్న బ్రహ్మోత్సవ మండపం పూర్తి కావస్తోంది. విష్ణు పుష్కరిణిలో నిర్మించిన మండపం పూర్తికాగా, కొండ కింద వైకుంఠ ద్వారం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ప్రధానాలయానికి నలుదిక్కుల గల అష్టభుజి మంటపాలు, రాజగోపురాల పరిసరాల్లో శిల్పులు కృష్ణ శిలతో ఫ్లోరింగ్ పనులు చేస్తున్నారు. దక్షిణ రాజగోపురం వైపు దాదాపు ఈ ఫ్లోరింగ్ పనులు పూర్తి కాగా, తూర్పు, పడమర, ఉత్తర రాజగోపురం ముందు భాగాల్లో ఈ రాతి ఫ్లోరింగ్ పనులతోపాటు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు సమాంతరంగా చేస్తున్నారు. పడమటి రాజగోపురం కింది భాగంలో ఉన్న గోడలకు కాకతీయ తోరణాలు, ఏనుగుల బొమ్మలను ఆకర్షణీయంగా ఏర్పాటు చేస్తున్నారు. తులసి కాటేజీలో భక్తుల కోసం 100 గదుల నిర్మాణం జరుగుతోంది. అలాగే వీవీఐపీల కోసం ప్రెసిడెన్షియల్ భవనాల నిర్మాణం జరుగుతోంది. స్వామి, అమ్మవార్ల దివ్యవిమాన గోపురానికి బంగారు తాపడం పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే శిఖర కలశాల బిగింపు పూర్తి చేశారు. అలాగే కొండపైన గల శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయంలో పనులు జరుగుతున్నాయి. ఇటీవలనే ప్రధాన ఆలయం పైభాగంలో నాలుగు దిక్కులా నంది విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఆలయానికి ముందు భాగంలో నంది మండపం, బలిపీఠం ఏర్పాటు చేశారు. ప్రధాన ఆలయం చుట్టు పక్కల కృష్ణ శిల రాయితో ఫ్లోరింగ్ పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు, ప్రాకార నిర్మాణ పనులు చేస్తున్నారు. గండి చెరువు నుంచి ప్రారంభమైన రింగ్ రోడ్డు పనులు ప్రస్తుతం యాదగిరిపల్లి దుర్గమ్మ ఆలయం వరకు జరిగాయి. వైకుంఠద్వారం నుంచి మొదటి ఘాట్ రోడ్డు వరకు విస్తరణ పనులు ప్రారంభించారు.


నిర్మాణంలో ఉన్న ప్రెసిడెన్షియల్ సూట్‌లు, ఇతర కాటేజీలు

### మరికొంత సమయం పడుతుంది.

పనులు వేగంగా జరుగుతున్నాయి. ఫిబ్రవరిలో యాగం చేయాలని సీఎం కేసీఆర్ ముందుగా అనుకున్నప్పటికీ కొన్ని పనుల జాప్యం వల్ల వాయిదా పడింది. బంగారు తాపడం పనులు ప్రారంభించాం. ప్రధానాలయం పనులు దాదాపు పూర్తయ్యాయి. క్యూ కాంప్లెక్స్ పనులు ఇంకా ప్రారంభించలేదు. ప్రధానాలయం ప్రారంభిస్తే వచ్చే లక్షలాది భక్తులకు ఇబ్బందులు కలగకుండా పనులు పూర్తి చేయాల్సి ఉంది. అందుకే యాగం ఆలస్యం అవుతోంది.
– గీతారెడ్డి, ఆలయ ఈఓ

### యాగశాల స్థల సేకరణ ఆలస్యం

కొండకింద యాగం చేపట్టేందుకు నిర్ణయించిన యాగస్థల భూసేకరణ ఆలస్యం అవుతోంది. సుమారు 93 ఎకరాల మేర భూ సేకరణ చేయాలని నిర్ణయించారు. భూ సేకరణకు అధికారులు చర్యలు ప్రారంభించారు.



ఉమ్రా యాత్ర ముగించుకొని వచ్చిన యాత్రికులను ఉద్దేశించి మాట్లాడుతున్న హరీశ్‌రావు

## కేసీఆర్ పాలనలో రాష్ట్రం సుభిక్షం

**ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు**

**సాక్షి, సిద్దిపేట:** ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పాలనలో రాష్ట్రం అంతా సుభిక్షంగా ఉందని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. బుధవారం ఆయన సిద్దిపేట జిల్లా పొన్నాల, చింతమడక, సిద్దిపేట పట్టణంలోపలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సిద్దిపేట హజ్ హౌజ్‌లో ఉమ్రా యాత్రను ముగించుకొని వచ్చిన వారిని సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణలో హిందూ, ముస్లిం, క్రైస్తవులు అనే తేడా లేకుండా అందరూ కలసి కట్టుగా ఉంటారని చెప్పారు. ముఖ్యమంత్రి అన్ని కులాలకు, మతాలకు సమన్యాయం చేస్తూ సంక్షేమ ఫలాలు అదరికీ అందిస్తున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ పాలనకు వానదేవుడు కూడా మద్దతు ప్రకటించాడని అన్నారు. ఈ సారి సమృద్ధిగా వర్షాలు కురిసి కృష్ణా, గోదావరి జలాలతో ప్రాజెక్టులు కళకళలాడుతున్నాయని చెప్పారు. సీఎం దూర దృష్టితో ఆలోచించి కాకతీయుల నాటి చెరువులను పునరుద్ధరించారని, దీంతో ఈ ఏడాది పెద్ద ఎత్తున ధాన్యం పడిందని అన్నారు. యాసంగిలో కూడా రైతులు పోటాపోటీగా నాట్లు వేయడం చూస్తే సీమాంధ్ర ప్రాంతాన్ని మించిన పచ్చదనం తెలంగాణలో కనిపిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రవేశపెట్టిన ప్రతీ పథకం పేదరిక నిర్మూలన, అన్నదాత ఆనందంతో ముడిపడి ఉన్నాయని చెప్పారు. పేదింటి ఆడపడుచులు తల్లిదండ్రులకు భారం కావద్దని ప్రవేశపెట్టిన కల్యాణ లక్ష్మి, షాదీ ముభారక్ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## నలుగురు చిన్నారుల అదృశ్యం

### మెదక్ జిల్లా తూప్రాన్‌లో ఘటన

**తూప్రాన్:** మెదక్ జిల్లాలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు చిన్నారులు అదృశ్యమయ్యారు. బుధవారం తూప్రాన్ పట్టణంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. తూప్రాన్ ఎస్‌ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్తాన్ రాష్ట్రానికి చెందిన నస్రీన్‌భాను భర్త జాకీర్‌తో గొడవ పడి తూప్రాన్‌లో నివాసం ఉంటున్న తన సోదరి ఇంటికి నెల రోజుల క్రితం తన నలుగురు పిల్లలతో కలసి వచ్చింది. ప్రస్తుతం ఆమె సిద్దిపేట జిల్లా నాచారం సీడ్ పరిశ్రమలో దినసరి కూలీగా పని చేస్తోంది. ఈ క్రమంలో బుధవారం కంపెనీ నుంచి ఇంటికి వచ్చిన నస్రీన్‌భానుకు తన నలుగురు పిల్లలు ఎస్కే షాకీర్(10), ఎస్కే సబెర్(8), ఎస్కే నజరీన్(6), ఎస్కే సదూర్(4) కనిపించ లేదు. దీంతో చుట్టు పక్కల వెతికినా ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు. నలుగురు చిన్నారులు కనిపించకపోవడం తూప్రాన్‌లో కలకలం రేపింది. కాగా మూడు రోజుల కిందటే ఇక్కడ ఒక బాలుడు అదృశ్యమైయ్యాడు. తాజా ఘటనపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


హుజూరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

## ‘కరోనా’ వదంతులు నమ్మొద్దు

**వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్**

**హుజూరాబాద్:** ‘కరోనా వ్యాధికి సంబంధించిన వదంతులు నమ్మకండి. తెలంగాణలో ఇప్పటి వరకు ఒక్కకేసు కూడా నమోదు కాలేదు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదు’అని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం ఆయన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ, ‘నెలరోజుల నుంచి కరోనా వైరస్ భయపెడుతోంది. చైనా నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ప్రతీ ఒక్కరికి అన్ని పరీక్షలు నిర్వహిస్తున్నాం. రాష్ట్రంలోని అన్ని ఆస్పత్రులను అప్రమత్తం చేశాం’అని పేర్కొన్నారు. ఇప్పటి వరకు చైనా నుంచి 52 మంది వచ్చారని. ఇందులో 25 మందికి పుణేలో, 25 మందికి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహించామని తెలిపారు. కరోనా, స్వైన్‌ఫ్లూ లక్షణాలు ఒకేరకంగా ఉం టాయని, ఎవరికైనా అలాంటి లక్షణాలు ఉం టే వెంటనే ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కరోనా వైరస్‌కు సం బంధించి రాష్ట్రంలో ఒక ప్రత్యేక అధికారితో పాటు కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు.

**‘సహకారం’మాకే..**

రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పాటు కరీంనగర్‌లోని అన్ని సహకార సొసైటీల్లో టీఆర్‌ఎస్ జెండా ఎగురవేస్తామని మంత్రి ఈటల రాజేందర్ ధీమా వ్యక్తంచేశారు. జిల్లాతో పాటు తన నియోజకవర్గంలోని అన్ని సొసైటీల్లో ప్రత్యేక కమిటీలు వేయనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వైరుధ్యాలపై వివరణ ఇవ్వండి

- జంతు రవాణా చట్టాల్లో తేడాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు ఆదేశం
- విచారణ వచ్చే నెలకు వాయిదా

సాక్షి, హైదరాబాద్



జంతువులను సురక్షితంగా రవాణా చేయాలనే ఉద్దేశంతో రూపొందించిన చట్టాల నిబంధనల్లో వైరుధ్యాలు ఎందుకున్నాయో తెలియజేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్ర సింగ్ చౌహాన్, జస్టిస్ ఎ.అభిషేక్ రెడ్డి ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫార్మర్స్ అసోసియేషన్, ఆల్ ఇండియా జమియాతుల్ ఖురేష్ యాక్షన్ కమిటీ దాఖలు చేసిన రెండు వేర్వేరు పిటిషన్లను ధర్మాసనం బుధవారం విచారించింది. సెంట్రల్ మోటారు వాహనాల చట్టంలోని రూల్ 125–(ఇ)ని కేంద్రప్రభుత్వం 2017లో నోటిఫై చేసింది. దీనిని తెలంగాణ మోటారు వాహనాల నిబంధనల చట్టంలో 253 నిబంధన కింద అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం జంతువుల రవాణాపై కొన్ని పరిమితులు విధించింది. నిర్దేశించిన వాహనాల్లోనే జంతువులను తరలించాలని, టెంపోల వంటి చిన్న వాహనాలను వాడకూడదని, జంతువుల్ని రవాణా చేసే వాహనంతో వాటి పర్యవేక్షణ కోసం ఒక వ్యక్తి ఉండాలని, జంతువుల్ని కుక్కేసి తరలించరాదని, జంతువుల సంఖ్యపై కూడా ఆంక్షలు విధించిందని పిటిషనర్లు హైకోర్టు దృష్టికి తెచ్చారు. ఈ నిబంధనలన్నింటినీ రైతులు, వ్యాపారులు కచ్చితంగా అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం గతేడాది డిసెంబర్ 7న మెమో జారీ చేసిందని పిటిషనర్ న్యాయవాది కె. వివేక్ రెడ్డి హైకోర్టు దృష్టికి తెచ్చారు. ఐదారు గొర్రెలు లేదా పశువులను సమీప గ్రామ మార్కెట్లకు రవాణా చేసే చిన్న రైతులకు ఇబ్బందికరంగా ఆ నిబంధనలున్నాయని చెప్పారు. అయితే కేంద్రం నిబంధనలు రైతుల విషయంలో కాస్త ఉదారంగా ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలు కఠినంగా ఉన్నాయన్నారు. రెండు చట్టాల్లోని నిబంధనల్లో వ్యత్యాసాలను న్యాయవాది హైకోర్టు దృష్టికి తెచ్చారు. జంతు సంక్షేమ నియమాలను మోటారు వాహనాల చట్టంలో చేర్చడం సరికాదన్నారు. జంతువుల పట్ల క్రూరత్వాన్ని నివారించడం వంటివి జంతు సంక్షేమ చట్టాలకు వర్తిస్తాయన్నారు. కేంద్ర, రాష్ట్ర చట్ట నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమని అఖిల భారత జమియాతుల్ ఖురేష్ యాక్షన్ కమిటీ అభివర్ణించింది. పెద్ద సంఖ్యలో చిన్న వ్యాపారుల్ని, రైతుల జీవన హక్కును దెబ్బతీసేలా చట్ట నిబంధనలు ఉన్నాయని పేర్కొంది. కొత్త రూల్స్‌ను అమలు చేస్తే, చిన్న వ్యాపారులు చేసే మాంసం పరిశ్రమ మొత్తం నష్టపోతుందని, భారీ స్థాయిలో మాంసం వ్యాపారమే మిగులుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. కేంద్రం తరపున కౌంటర్ దాఖలు చేస్తామని అదనపు సొలిసిటర్ జనరల్ నామవరపు రాజేశ్వరరావు చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించిన ధర్మాసనం విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది.

## పరువునష్టం దావావేసిన మాజీ ఏఎస్సై మోహన్‌రెడ్డి

**కరీంనగర్ క్రైం:** నిరాధారమైన ఆరోపణలతో పత్రికల్లో, టీవీల్లో అసత్య ప్రకటనలు ఇస్తూ.. ముస్కు మహేందర్‌రెడ్డి అనే వ్యక్తి తనకు పరువునష్టం కలిగిస్తున్నాడని మాజీ ఏఎస్ఐ మోహన్‌రెడ్డి కోర్టులో పరువునష్టం దావా దాఖలు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. కరీంనగర్‌లోని ఒక ప్రైవేటు పాఠశాల యజమాని ఆత్మహత్య చేసుకోవడంతో మోహన్‌రెడ్డితో పాటు మరికొందరిపై కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో ఆయన జైలుకు వెళ్లారు. కాగా, మహేందర్‌రెడ్డి తనకు పరువునష్టం కలిగించాడని, ఇందుకు రూ.50 లక్షలు చెల్లించాలని కోర్టులో మోహన్‌రెడ్డి దావా వేశారు. తదుపరి ఉత్తర్వులు జారీచేసేవరకు మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా మహేందర్‌రెడ్డి ఎలాంటి ప్రకటనలు చేయరాదని కరీంనగర్ సీనియర్ సివిల్ జడ్జి సతీశ్‌కుమార్ ఉత్తర్వులు ఇచ్చారు.

## అత్యాచారం కేసులో యువకుడికి జైలు శిక్ష

**పాపన్నపేట(మెదక్):** మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని నార్సింగి గ్రామానికి చెందిన తొమ్మిదేళ్ల బాలికపై అత్యాచారం చేసిన నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.రెండు వేల జరిమానా విధిస్తూ ఫాస్ట్ ట్రాక్ కోర్టు స్పెషల్ జడ్జి శ్యామ్ బుధవారం తీర్పు చెప్పారు. ఈ వివరాలను పాపన్నపేట ఎస్ఐ ఆంజనేయులు విలేకరులకు తెలిపారు. నార్సింగి గ్రామానికి చెందిన బాలిక 2016 ఆగస్టు 9వ తేదీన రాత్రి ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన చాకలి రాజు అనే యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. దీనిపై బాలిక తల్లి ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ రామకృష్ణ, ఎస్ఐ సందీప్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

# అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండండి

- అటవీ అధికారులు, సిబ్బందికి పీసీసీఎఫ్ ఆదేశాలు
- వెంటనే క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేయాలని సూచన

**సాక్షి, హైదరాబాద్:** వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో అటవీ సంరక్షణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను పీసీసీఎఫ్ ఆర్.శోభ ఆదేశించారు. అటవీ మార్గాలు, అడవుల వెంట ఉండే గ్రామాల్లో ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మొత్తం 9,771 కంపార్ట్‌మెంట్లకు గాను 43 అటవీ రేంజ్‌ల్లో 1,106 ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందు వల్ల వాటిల్లో కనీసం ఐదుగురు సిబ్బంది, వాహనం, నిప్పును ఆర్పే బ్లోయర్ పరికరాలతో క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అన్ని కంపార్ట్‌మెంట్లలో ఫైర్ లైన్లను ఏర్పాటు చేయాలన్నారు. బుధవారం అరణ్య భవన్ నుంచి అగ్ని ప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన చర్యలపై జిల్లాల అటవీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అగ్ని ప్రమాద నివారణ చర్యల కోసం అవసరమైన నిధులను అన్ని జిల్లాలకు అందుబాటులో ఉంచనున్నట్లు ఆమె వెల్లడించారు. ఫిబ్రవరి నుంచి మే నెల దాకా అడవుల్లో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయని, దీంతో ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇటీవల నల్లమలలో జరిగిన రెండు ఘటనల్లో ఒకటి పశువుల కాపరులు, మరొకటి ప్రయాణికులు విసిరిన సిగరెట్/బీడీ వల్ల ప్రమాదాలు జరిగినట్లు గుర్తించామని తెలిపారు. మేడారం జాతర జరుగుతున్న అటవీ ప్రాంతంలో నిత్యం అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో అదనపు పీసీసీఎఫ్‌లు లోకేష్ జైస్వాల్, ఆర్.ఎం.డోబ్రియల్, స్వర్గం శ్రీనివాస్, ఎంసీ పర్గెయిన్, సిద్ధానంద్ కుక్రెటీ పాల్గొన్నారు.

## ఆ దూర విద్యా కేంద్రాలను మూసేయండి

**యూనివర్సిటీలకు ఉన్నత విద్యా మండలి లేఖ**

**సాక్షి, హైదరాబాద్:** ఇతర రాష్ట్ర యూనివర్సిటీలు, డీమ్డ్, ప్రైవేటు యూనివర్సిటీలకు చెందిన దూర విద్యా కేంద్రాలను నిర్వహించే కాలేజీలపై చర్యలు చేపట్టాలని యూనివర్సిటీలకు తెలంగాణ ఉన్నత విద్యా మండలి సూచించింది. ఈ మేరకు బుధవారం రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలకు తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి లేఖ రాశారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్రంలోని కాలేజీలు ఇతర రాష్ట్రాల యూనివర్సిటీల దూర విద్యా కేంద్రాలను ఏర్పాటు చేశాయని ఆ లేఖలో పేర్కొన్నారు. అలాంటి కాలేజీలకు జరిమానా విధించడం, గుర్తింపు రద్దు చేయడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. వీటికి సంబంధించి చేపట్టిన చర్యలపై 15 రోజుల్లోగా తమకు నివేదిక అందజేయాలని ఆదేశించారు. యూనివర్సిటీల భౌగోళిక పరిధులను పేర్కొంటూ యూజీసీ 2013లో జారీ చేసిన ఉత్తర్వులు, 2015లో జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం.. ఒక రాష్ట్రంలోని యూనివర్సిటీ మరో రాష్ట్రంలో దూర విద్యా విధానంలో విద్యను అందించడానికి వీల్లేదని స్పష్టంచేశారు.

## ‘యాజమాన్యాల వారీగా పదోన్నతులు కల్పించండి’

**సాక్షి, హైదరాబాద్:** యాజమాన్యాల వారీగా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని వివిధ ఉపాధ్యాయ సంఘాలు విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రా రామచంద్రన్‌కు విన్నవించాయి. ఇటీవల విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఆమెను ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, పీఆర్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగళి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు బుధవారం సచివాలయంలో కలిశారు. వీరితోపాటు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ), ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి (జాక్టో) నేతలు కె.జంగయ్య, చావ రవి, జి.సదానందంగౌడ్, పర్వతరెడ్డి, కె.రమణ, మైస శ్రీనివాసులు, ఎం.రఘుశంకర్‌రెడ్డి, చంద్రశేఖర్, కృష్ణుడు చిత్రా రామచంద్రన్‌ను కలిశారు. ఈ సందర్భంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో ఉపాధ్యాయులకు నాలుగున్నరేళ్లుగా పదోన్నతులు లేక సబ్జెక్టు టీచర్ల కొరతతో విద్యా బోధన దెబ్బతింటోందని ఆమెకు తెలియజేశారు.

## వ్యవసాయశాఖ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన జనార్దన్‌రెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** వ్యవసాయశాఖ కార్యదర్శిగా బి.జనార్దన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ముఖ్య కార్యదర్శిగా పనిచేసిన పార్థసారధి నుంచి బుధవారం



ఆయన బాధ్యతలు స్వీకరించారు. గతంలో జనార్దన్‌రెడ్డి వ్యవసాయశాఖ కమిషనర్‌గా పనిచేసిన సంగతి తెలిసిందే. దీంతో ఆయనకు ఆ శాఖపై మంచి పట్టు ఉంది. అందులో పనిచేసే కిందిస్థాయి అధికారులు, ఉద్యోగులతోనూ ఆయనకు మంచి సంబంధాలున్నాయి. ఇప్పుడు వ్యవసాయశాఖ కార్యదర్శితోపాటు కమిషనర్‌గానూ ఆయన వ్యవహరిస్తారు. కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆయన ఇతర అధికారులతో కాసేపు సమావేశమయ్యారు. ప్రస్తుతం కొనసాగుతున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. గురువారం ఆయన వ్యవసాయ కమిషనరేట్ కార్యాలయానికి వస్తారని అధికారులు తెలిపారు.

## రీ-ఆర్గనైజేషన్‌ను త్వరగా పూర్తి చేయండి: రజత్‌కుమార్

**సాక్షి, హైదరాబాద్:** ఇరిగేషన్‌శాఖ రీ–ఆర్గనైజేషన్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని, దీనిపై సీఎం కేసీఆర్ పట్టుదలతో ఉన్నారని ఇంజనీర్లతో ప్రిన్సిపల్ సెక్రటరీ రజత్‌కుమార్ అన్నారు. రీ–ఆర్గనైజేషన్ పని ఎంత వరకు వచ్చిందని పలువురు ఇంజనీర్లను ఆయన అడిగి తెలుసుకున్నారు. బుధవారం జలసౌధలో ఇరిగేషన్‌శాఖ సలహాదారు ఎస్‌కే జోషితో రజత్‌కుమార్ భేటీ అయ్యారు. వర్క్‌షాప్‌లో ఇంజనీర్లు చెప్పిన అభిప్రాయాలు, ఆ తర్వాత తీసుకున్న చర్యలపై ఆయన ఆరా తీశారు. ఆన్‌గోయింగ్ ప్రాజెక్టుల పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఈఎన్సీలు మురళీధర్, నాగేందర్‌రావు, హరిరాం, సీఎం ఓఎస్డీ శ్రీధర్‌దేశ్‌పాండే, సీఈలు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

## హైదరాబాద్ విద్యార్థికి సీఏలో 30వ ర్యాంకు

**సాక్షి, హైదరాబాద్:** ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ఇటీవల ప్రకటించిన సీఏ ఫలితాల్లో హైదరాబాద్‌కు చెందిన సిద్ధార్థ్ జైన్ జాతీయ స్థాయిలో 30వ ర్యాంకు సాధించినట్లు ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ ఫైనాన్షియల్ స్టడీస్ (ఐఎస్ఎఫ్ఎస్) చైర్మన్ బ్రహ్మదేవర అవినాష్ తెలిపారు. గత నవంబర్‌లో 400 మార్కులకు ఈ పరీక్షను నిర్వహించగా, సిద్ధార్థ్ 334 మార్కులు సాధించాడని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా సీఏలో 23 శాతమే అర్హత సాధించినట్లు వెల్లడించారు.

## ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సీఐటీడీలో ఉచిత వసతి

**సాక్షి, హైదరాబాద్:** నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ పొందే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు బాలానగర్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ (సీఐటీడీ)లో ఉచిత వసతి కల్పిస్తున్నట్లు ఎస్సీ అభివృద్ధి సంస్థ పేర్కొంది. ఈ మేరకు వసతి సౌకర్యాల కోసం అయ్యే ఖర్చును ప్రభుత్వ పరంగా భరించేందుకు అనుమతినిస్తూ ఎస్సీ అభివృద్ధి సంస్థ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో దీనిపై మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్ లేఖ రాశారు.

## ఏప్రిల్ 11 నుంచి పౌర హక్కుల సంఘం మహాసభలు

**హైదరాబాద్:** రాష్ట్ర పౌర హక్కుల సంఘం రెండో మహాసభలను ఏప్రిల్ 11, 12 తేదీల్లో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం.లక్ష్మణ్, ఉపాధ్యాక్షుడు వి.రఘునాథ్, ప్రధాన కార్యదర్శి నారాయణరావు, ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు పాశం యాదగిరి తెలిపారు. ఈ మేరకు బుధవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పీడిత ప్రజల హక్కుల రక్షణ కోసం అనునిత్యం తమ సంఘం కృషి చేస్తోందన్నారు. దేశంలో ఆర్థిక సంక్షోభం, నిరుద్యోగం, కర్మాగారాల మూసివేత తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. పేదల సంక్షేమాన్ని విస్మరించి బడా పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా కేంద్ర, రాష్ట్ర సర్కార్‌లు పని చేస్తున్నాయని విమర్శించారు.

## 22న సీపీఐ నిర్మాణ మహాసభలను ప్రారంభించనున్న డి.రాజా

**సాక్షి, హైదరాబాద్:** మంచిర్యాలలో ఈ నెల 22న జరగనున్న సీపీఐ రాష్ట్ర నిర్మాణ మహాసభలను ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రారంభించనున్నారు. 24వ తేదీ వరకు జరిగే ఈ మహాసభల్లో పార్టీ సిద్ధాంతాలు, నిర్మాణానికి సంబంధించిన అంశాలపై చర్చించనున్నారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యలు, వాటిపై స్థానికంగా పోరాటాలు, ఉద్యమాల నిర్వహణపై కార్యచరణను సిద్ధం చేయనున్నట్లు సీపీఐ కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం మఖ్దూం భవన్‌లో పార్టీ నేతలు పల్లా వెంకటరెడ్డి, తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, ఎన్.బాలమల్లేశ్, కలవెరి శంకర్, ఈటి.నరసింహ, డా.సుధాకర్‌లతో కలసి నిర్మాణ మహాసభల పోస్టర్‌ను చాడ ఆవిష్కరించారు.

## ‘అవని’ పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి నిరంజన్‌రెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** ప్రముఖ కవి, గాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు, ప్రకృతి ప్రేమికుడు జయరాజ్ రచించిన ‘అవని’పుస్తకాన్ని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అబ్రహం, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, రాజేందర్‌రెడ్డి, బాద్మి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఏరో స్పేస్‌కు కొత్త రెక్కలు

**మార్చి 12 నుంచి 15 మధ్య హైదరాబాద్‌లో ‘వింగ్స్ ఇండియా’**

**ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల అభివృద్ధిపై భారీ ఆశలు**

**ఏరోస్పేస్ రంగంలో మౌలిక వసతులు, నైపుణ్య శిక్షణపై దృష్టి**

**సాక్షి, హైదరాబాద్:** ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాన్ని అత్యంత ప్రాధాన్య రంగంగా గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఈ రంగంలో మరిన్ని పెట్టుబడులు ఆకర్షించేందుకు ప్రయత్నిస్తోంది. రాష్ట్రంలో ఏరోస్పేస్ రంగం అభివృద్ధికి ఉన్న అవకాశాలను వివరించేందుకు ఈ ఏడాది మార్చిలో జరిగే ‘వింగ్స్ ఇండియా–2020’ను వేదికగా చేసుకోవాలని భావిస్తోంది. భారతీయ పౌర విమానయాన పరిశ్రమకు తలమానికంగా భావించే ఈ కార్యక్రమాన్ని కేంద్ర పౌర విమానయాన శాఖ, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా భాగస్వామ్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. మార్చి 12 నుంచి 15 వరకు హైదరాబాద్‌లో నిర్వహించే ‘వింగ్స్ ఇండియా 2020’లో భాగంగా అంతర్జాతీయ ప్రదర్శన, సదస్సులుంటాయి. ‘ఫ్లయింగ్ ఫర్ ఆల్’నినాదంతో జరిగే ‘వింగ్స్ ఇండియా’ద్వారా రాష్ట్రంలో ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల అభివృద్ధికి అవసరమైన వాతావరణం వృద్ధి చెందగా.. ఏరోస్పేస్ మాన్యుఫ్యాక్చరింగ్‌లో ప్రపంచ స్థాయి కంపెనీలు బోయింగ్, జీఈ, రాఫెల్, లాక్‌హీడ్ మార్టిన్ వంటి సంస్థలు తెలంగాణలో తమ కార్యకలాపాలు ప్రారంభించాయి. వీటితో పాటు సుమారు వెయ్యి చిన్న, మధ్య తరహా ఎయిరోస్పేస్, రక్షణ రంగ పరిశ్రమలు, 4 ఎయిరోస్పేస్ పార్కులున్నాయి. ఎలక్ట్రానిక్స్ తయారీ క్లస్టర్లు, హార్డ్‌వేర్ పార్కులు, టెక్నాలజీ సెజ్‌లు రాష్ట్రంలో ఉండటంతో భవిష్యత్‌లో ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల వృద్ధికి మరింత అవకాశం ఉందని రాష్ట్రం అంచనా వేస్తోంది.

**ఎయిరోస్పేస్ శిక్షణపైనా దృష్టి**

ఏరోస్పేస్ రంగం అభివృద్ధికి అవసరమైన మౌలిక సౌకర్యాల కల్పనతోపాటు శిక్షణ రంగంపైనా దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగంలో ఇప్పటికే బోయింగ్, ఫ్రాట్ అండ్ విట్నీ, కోలిన్స్ ఎయిరోస్పేస్ వంటి స్టార్టప్ సంస్థలతో నూతన ఆవిష్కరణల కోసం ‘టీ హబ్’ పని చేస్తోంది. త్వరలో ప్రారంభమయ్యే ‘టీ వర్క్స్’ ద్వారా కూడా ఈ రంగంలో కొత్త ఆవిష్కరణలు సాధ్యమవుతాయని అంచనా వేస్తోంది. రాష్ట్రంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఏరోస్పేస్, డిఫెన్స్ రంగ పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులకు తెలం గాణ అకాడమీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ స్కిల్స్ (టాస్క్) తరపున శిక్షణ ఇస్తుండగా, ఇందులో భాగస్వాములు కావాల్సిందిగా ఈ రంగాలకు చెందిన ప్రముఖ సంస్థలను రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. ఎయిరోస్పేస్, డిఫెన్స్ రంగాలకు ప్రత్యేక పాలసీ తయారు చేయాలనే యోచనలో రాష్ట్రం ఉంది.

**పారిశ్రామికవాడల్లో హెలీపోర్టులు..**

దేశవ్యాప్తంగా వచ్చే నాలుగేళ్లలో వంద ఎయిర్‌పోర్టులను అభివృద్ధి చేస్తామని కేంద్రం తాజా బడ్జెట్ ప్రతిపాదనల్లో పేర్కొంది. ఇప్పటికే మామునూరు (వరంగల్), ఆదిలాబాద్, కొత్తగూడెం, జక్రాన్‌పల్లి (నిజామాబాద్), బసంత్‌నగర్ (పెద్దపల్లి), అడ్డాకుల (మహబూబ్‌నగర్)లో ఎయిర్‌పోర్టుల ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ఆరు ఎయిర్‌పోర్టుల అభివృద్ధికి ఉన్న సాధ్యాసాధ్యాలపై ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అధ్యయనం చేస్తోంది. వరంగల్, నిజామాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఐటీ క్లస్టర్లను ఏర్పాటు చేస్తోంది. కొత్తగా ఏర్పాటవుతున్న ఐటీ క్లస్టర్లతో పాటు, ఫార్మాసిటీ వంటి పారిశ్రామికవాడల్లో హెలీపోర్టుల ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. ఈ హెలీపోర్టుల ద్వారా రాష్ట్రంలో టెంపుల్ టూరిజం కూడా అభివృద్ధి చెందడంతో పాటు, పారిశ్రామిక పెట్టుబడులకు కూడా ఊతం లభిస్తుందనే అంచనా వేస్తోంది. హెలీపోర్టుల ఏర్పాటుకు అనుమతులు, మౌలిక సౌకర్యాల ఏర్పాటుకు నిధులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతోంది.

# మరో 9 మంది!

- ‘కరోనా’ లక్షణాలతో ఆస్పత్రిలో చేరిక
- ఎన్95 మాస్క్‌లకు పెరిగిన డిమాండ్
- ఒక్కొక్కటి రూ.250కు విక్రయం

**హైదరాబాద్:** సాధారణ జ్వరం, జలుబు లక్షణాలు కన్పిస్తే చాలు కరోనాగా అనుమానిస్తున్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. చైనాకు వెళ్లి వచ్చిన వారిలో హైదరాబాద్ సహా తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు ఉండటంతో కరోనా భయం వెంటాడుతోంది. తాజాగా బుధవారం గాంధీ ఆస్పత్రిలో ఐదు కరోనా అనుమానిత కేసులు నమోదు కాగా, ఫీవర్ ఆస్పత్రిలో నాలుగు కేసులు నమోదయ్యాయి.

**అనుమానిత బాధితులు వీరే...**



చైనా నుంచి వచ్చిన షాపూర్‌నగర్‌కు చెందిన మహిళ (29), ఆమె సోదరి (24), కొచ్చిన్ నుంచి వచ్చిన బొల్లారానికి చెందిన యువతి (20), షాంగై నుంచి వచ్చిన ఖమ్మం జిల్లావాసి (28), వియత్నాం నుంచి వచ్చిన మౌలాలివాసి (60) గాంధీ ఆస్పత్రి ఐసోలేషన్ వార్డులో చికిత్స పొందుతున్నారు. ఇక బీజింగ్ నుంచి వచ్చిన గచ్చిబౌలికి చెందిన ఇద్దరు యువకులు (30, 32), ఖమ్మం జిల్లాకు చెందిన యువకుడు (32), కంచన్‌బాగ్‌కు చెందిన యువకుడు (27)లను నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో చేర్పించారు. వీరి నుంచి నమూనాలు సేకరించి గాంధీ వైరాలజీ ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయంలోగా వ్యాధి నిర్ధారణ పరీక్షలకు సంబంధించిన రిపోర్ట్‌లు వచ్చే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే ఇప్పటి వరకు తొమ్మిది అనుమానిత కేసులు నమోదు కాగా, వీరిలో ఇప్పటికే నాలుగు నెగిటివ్ రిపోర్టు వచ్చింది. మరో ఐదు రిపోర్టులు రావాల్సి ఉంది. ఇక ఫీవర్ ఆస్పత్రిలో ఇప్పటి వరకు 25 అనుమానిత కేసులు నమోదు కాగా, వీరిలో 21 మందిలో నెగటివ్ రిపోర్టు వచ్చింది. మరో నాలుగు రిపోర్టులు రావాల్సి ఉంది.

**పెరిగిన ఎన్95 మాస్క్ ధర...**

ప్రమాదకరమైన స్వైన్‌ఫ్లూ..కరోనా వైరస్‌లు విజృంభిస్తున్న నేపథ్యంలో వైద్యులతో పాటు ఆయా రోగులకు సహాయంగా వచ్చిన బంధువులు సైతం వ్యక్తిగత భద్రతపై దృష్టి సారించారు. ఐసోలేషన్ వార్డుల్లో చికిత్సలు అందించే వైద్య సిబ్బందితో పాటు లిఫ్ట్‌బోయ్‌లకు, అనుమానిత రోగులకు వైద్య ఆరోగ్యశాఖ ఈ మాస్కులను సరఫరా చేస్తుంది. రోగులకు సహాయంగా వచ్చిన బంధువులు వీటిని స్వయంగా సమకూర్చుకోవాల్సి వస్తుంది. కరోనా, ఫ్లూ వైరస్‌లు విజృంభిస్తున్న నేపథ్యంలో ఈ మాస్క్‌లకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. మామూలు రోజుల్లో సాధారణ మాస్క్ రూ.5కు లభించగా, ఎన్ 95 మాస్క్ రూ.90కి లభించే ఈ మాస్క్. ..ప్రస్తుతం రూ.250 వరకు విక్రయిస్తుండటం కొసమెరుపు. కాగా తాజాగా గాంధీలో మూడు స్వైన్‌ఫ్లూ పాజిటివ్ కేసులు నమోదు కాగా, ఇదే లక్షణాలతో మరో ముగ్గురు అనుమానితులు ఆస్పత్రిలో చేరారు. గాంధీ ఆస్పత్రిలో కరోనా, స్వైన్‌ఫ్లూ లక్షణాలతో వచ్చే అనుమానిత రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలని మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (డీఎంఈ) రమేష్‌రెడ్డి ఆస్పత్రి అధికారులకు ఆదేశించారు. బుధవారం ఆయన గాంధీ ఐసోలేషన్, ఎక్యూట్ మెడికల్ కేర్ వార్డు, ఐసీయూలను పరిశీలించారు.

# ఐపీఎస్‌ల బదిలీలపై ఉత్కంఠ!

- ఇప్పటికే సిద్ధమైన జాబితా, సీఎం ఆమోదమే తరువాయి
- పదోన్నతులు పొంది 10 నెలలైనా పాత కొలువుల్లోనే
- సోషల్ మీడియాలో నకిలీ జాబితాల చక్కర్లు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంటూ వస్తోన్న ఐపీఎస్‌ల బదిలీలపై ఎడతెగని ఉత్కంఠ కొనసాగుతోంది. నేడు, రేపు అంటూ ఊరిస్తోన్న ట్రాన్స్‌ఫర్ల ప్రచారంతో పోలీసు అధికారులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నెల 2వ తేదీ అర్ధరాత్రి 50మంది ఐఏఎస్‌లను ప్రభుత్వం ఆకస్మికంగా బదిలీచేసింది. ఈ నేపథ్యంలో మరునాడు ఐపీఎస్‌ల బదిలీలు ఉంటాయని భారీగా ప్రచారం సాగింది. కానీ, అలాంటిదేమీ జరగలేదు. కొందరు ఔత్సాహికులు ఓ అడుగు ముందుకేసి..ఏకంగా పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారుల బదిలీ జరిగిందంటూ పోస్టింగ్‌లతో సహా సోషల్ మీడియాలో పెట్టేసారు.ఈ సందేశాలు క్షణాల్లో రాష్ట్రవ్యాప్తంగా వైరల్ అయ్యాయి.దీంతో డిపార్ట్‌మెంట్ మొత్తం ఇదే చర్చ నడుస్తోంది. పలువురు ఐపీఎస్ అధికారులు కూడా తమ బదిలీలు ఉంటాయా?ఉండవా? అని తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

**పలువురికి స్థాన చలనం..**

వాస్తవానికి ఐపీఎస్‌ల బదిలీలు, పదోన్నతులు 2018లోనే జరగాల్సింది. కానీ, అసెంబ్లీకి జరిగిన ముందస్తు ఎన్నికల కారణంగా వాయిదా పడ్డాయి. దీంతో ఏప్రిల్‌లో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా.. 2019 ఏప్రిల్‌లో రాష్ట్ర హోంశాఖ కేంద్రం అనుమతితో 23 మంది ఐపీఎస్‌లకు పదోన్నతులు కల్పించింది. వాస్తవానికి పదోన్నతితోపాటు బదిలీ తప్పనిసరి. కానీ, వీరికి పదోన్నతి దక్కినా..పాత కుర్చీల్లోనే విధులు నిర్వహిస్తున్నారు.దాదాపు 10 నెలలుగా తమకు కొత్త పోస్టింగ్‌లు వస్తాయని ఎదురు చూస్తున్నారు.మున్సిపల్ ఎన్నికలు ముగిసిన దరిమిలా..ఈ దఫా బదిలీలకు చెందిన ఫైలు సిద్ధమైంది. ఇది సీఎం కేసీఆర్ వద్ద ఉందని, ఆయన ఆమోదం వెంటనే జీవో విడుదల అవుతుందని తెలిసింది.

**12 మంది ఐపీఎస్‌లు నగరానికి..!**

ఇక జిల్లాల్లో వివిధ హోదాల్లో పనిచేస్తోన్న దాదాపు 12 మంది ఐపీఎస్ అధికారులను నగరానికి తీసుకురావాలన్న యోచనలో డీజీపీ ఉన్నట్లు సమాచారం. వీరికి గ్రేటర్ పరిధిలోని మూడు కమిషనరేట్లలో, ఇతర రాష్ట్రస్థాయి విభాగాల్లో పోస్టింగులు ఇవ్వనున్నట్లు సమాచారం. ‘రైట్ పర్సన్ ఎట్ రైట్ పొజిషన్’ అన్న విధానంలో పోస్టింగ్‌లు ఇవ్వనున్నారని సమాచారం.

- రూ.30 వేల కోట్ల ఆస్తులున్న టీఎస్ ఆర్టీసీలో 31 శాతం వాటా ఉన్న కేంద్ర ప్రభుత్వం 70 ఏళ్లలో పెట్టిన పెట్టుబడి కేవలం రూ.50 కోట్లేనని టీఎస్‌ఆర్టీసీ మాజీ బోర్డు డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

SI & కానిస్టేబుల్స్
న్యూ బ్యాచ్: 11-02-2020
శ్యామ్
H.O: - 98482 56254
B.O: హైదరాబాద్ - 88926 21234

NAGARJUNA'S STUDY CIRCLE
ASHOK NAGAR, HYDERABAD.
OUR STUDENT
Congratulations
TSPSC Group - 2
STATE 1st Rank
APPSC TSPSC Gr-2 బ్యాచ్
ECONOMY SPL. BATCH
Demo@ 10.00 am 9-2-2020
040-27604111 / 9989104111



For a test drive, SMS 'RENAULT' to 53030 or call on 1800 300 44444 (Open from Monday to Sunday, 7:00 am -11:00 pm). Select variants available in CSD. Special offers for Defence Personnel, Government, PSU and Corporate employees.
Terms and conditions apply. #Prices mentioned above are for Bharat Stage-6 compliant base variant for ex-showroom Hyderabad and is exclusive of local taxes. *The benefits up to ₹ 50 000 include cash benefit of ₹ 50 000 on select versions of Bharat Stage-4 compliant variant of outgoing KWID only. ^Loyalty Benefits up to ₹ 10 000 include exchange benefit of ₹ 10 000 on Renault model or Cash discount of ₹ 5 000 on buying additional Renault model. **Warranty of 4 Years applicable on KWID only, includes Manufacturer Warranty of 2 Years or 50 000 km + Extended Warranty of 2 Years or 50 000 km. Offers may vary across variants and cities. The above mentioned offers & benefits are valid till 29th February 2020 and are through Renault dealership. For detailed offers, visit www.renault.co.in/offers. Renault India Pvt. Ltd. reserves the right to change or modify the mentioned schemes and conditions without prior notice. Renault India Pvt. Ltd. shall not be liable for any loss or damage arising from your failure to comply or understand the offer details. In the event of any dispute, all matters shall be governed by all applicable laws of India and Court at Gurugram shall have the exclusive jurisdiction. For detailed terms and conditions, please visit www.renault.co.in
SHOWROOMS: TELANGANA: NALGONDA: RENAULT Nalgonda Mob: +91 7428439437. KHAMMAM Renault Khammam: Mob: +91 8527234093. MIRYALGUDA: RENAULT Miryalguda Mob: +91 7428439406.
L&K | SAATCHI & SAATCHI

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.